ISSN 0971-278X

మే 2022 సంచిక : 447 వెల : 25/-

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక



జనసాహితి ప్రచురణ

కరపత్రం

# ప్రజలపై రోజురోజుకీ పెరుగుతున్న భారాలు - మతతత్త్వం - శ్రామికవర్గ సంస్కృతి

## మేడే సాహిత్య సభ 1-5-2022, సా॥ 5:30గం॥కు సుందరయ్య విజ్ఞానకేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్

మిత్రులారా!

ఆంధ్రప్రదేశ్‌లో పెరిగిన విద్యుత్ ఛార్జీలు, తెలంగాణలో పెరిగిన ఆర్టీసీ చార్జీలు, ఇరువైపులా పెరిగిన భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. పైకి రియల్ ఎస్టేట్ లాభాలకోసం అన్నట్లుగా కనిపిస్తున్నప్పటికీ అన్నిరంగాలపై ఇవి సృష్టించే వరుస కష్టాల వల్ల సామాన్య ప్రజల జీవితాల్లో ప్రతి అడుగూ కష్టంగా మారింది. పెరిగిన రవాణా ఛార్జీలు, నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, పెరగని నెలజీతాలు, కూలీరేట్లతో సతమతమవుతున్నారు. వ్యవస్థీకృత సంక్షోభం కారణంగా తీవ్రంగా పెరిగిన నిరుద్యోగం, తరుగుతున్న ఉపాధి అవకాశాలకు నిన్నటివరకు కరోనాను, ఇప్పుడు యుద్ధాన్ని సాకుగా చూపించడం అన్నది కేవలం ప్రజలను పిచ్చివాళ్లను చేయడమే. ఈ కాలంలోనే ప్రపంచ కుబేరుల జాబితాలో పోటీపడుతున్న మనదేశ దళారీ కంపెనీలు దేశంలోని ప్రభుత్వ ప్రైవేటురంగాలను సర్వనాశనం చేస్తూ లక్షలకోట్ల లాభాలు ఆర్జిస్తున్నాయి. అంటే ప్రభుత్వ విధానాలు ఈ కుబేరుల లాభాలకు గ్యారెంటీనిస్తున్నాయి, ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నాయి.

సరిగ్గా ఈ వాస్తవాలు ప్రజలకు అర్థం కాకుండా వుండడానికే గడచిన అనేక దశాబ్దాలుగా దేశంలోనూ, మన చుట్టుపక్కల వున్న అన్ని దేశాలలోనూ ఈ మతతత్త్వశక్తులు సామ్రాజ్యవాదుల కనుసన్నలలో ప్రజల మధ్య విద్వేషాలను పెంచి, నిత్యం శ్రామిక ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నాయి. ప్రపంచీకరణతో సహా అనేక కీలక ఒప్పందాలపై పాలకులు సంతకాలు చేసేముందూ, వెనుక మతోన్మాదాన్ని పెంచడం మనం చూసాము. ఆయా దేశాల్లోఎన్నికలు జరిగి, రాజకీయపక్షాలు మారేటప్పుడు ఈ మతతత్త్వశక్తులు మరింత విజృంభిస్తున్నట్టు కన్పిస్తుంది. ప్రార్థనాలయాల్లో, స్కూళ్ళలో దాడులు, సరిహద్దుల్లో తగాదాలు ఆయా సందర్భాలలో సమయానుకూలంగా ముందుకొస్తూ, కనుమరుగవు తుంటాయి. భారతదేశంలోనే కాకుండా చుట్టూ ఉన్న శ్రీలంక, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బర్మా, చాలా దేశాల్లో ఇదే ఆర్థిక సంక్షోభం, ఇదే సామ్రాజ్యవాదుల దాసోహం, ఇదే తరహా మతతత్వం (ఒక్కొకదేశంలో ఒక్కొక్క మతం ఆధిపత్యంలో ఉంది) సాధారణ ఎజెండాగా కొనసాగుతున్నది.

ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత భారతదేశంలో అటు కాశ్మీర్ నుంచి ఇటు కర్నాటక వరకు నిత్యం ఏదో ఒకచోట ఈ అల్లర్లు సృష్టించడంలో దేశపాలకులు బిజీగా వున్నారు. వచ్చే ప్రతి పండుగను ఒక అవకాశంగా మలుచుకుంటున్నారు. ప్రజల మనసుల్లో విషబీజాలు నాటడానికి తమ గుప్పిట్లో ఉన్న మీడియాను యధేచ్ఛగా వుపయోగిస్తున్నారు. పెరిగిన టెక్నాలజీని ప్రజలలో అనైక్యతను పెంచడానికి బాగా వాడుకుంటున్నారు. ఈ మతతత్త్వశక్తులు ఎంతకు బరితెగిస్తున్నాయంటే రియల్‌ఎస్టేట్ వ్యాపారాల కోసం గుడులు, విగ్రహాలు కట్టడానికి వందల కోట్లు ఖర్చు చేస్తారు కానీ రైతుల ధాన్యం కొనుగోలుకు, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుకు వీరి దగ్గర ఒక పైసా కూడాలేదని చెబుతారు. ప్రజల కష్టాలకు కారణమౌతున్న పెట్రోల్‌పై విధించే పన్నుల గురించి కానీ, పెరిగిన ఆర్టీసీ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరల గురించికానీ ఈ మత ఉద్ధారకులూ, ప్రబోధకులెవరూ మాట్లాడరు. అంటే కళ్లముందు కనిపిస్తున్న కారణం గురించి ఆలోచించకుండా వుండేందుకే ఈ మతతత్త్వశక్తులు నిరంతరం తమ శాయశక్తులా కృషి చేస్తారన్నమాట. విదేశీ, స్వదేశీ దోపిడీ శక్తులకు కొమ్ముకాస్తూ వారికి రక్షణగా భావజాల కవచాన్ని నిర్మిస్తారన్నమాట. మతాన్ని, కులాన్ని ఉద్ధరించడానికే కంకణం కట్టుకున్నట్టు ప్రజలమధ్య సెంటిమెంట్లు రెచ్చగొడుతూ అప్రజాస్వామిక, అరాచక సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. ఈ శక్తులు ఒకరినొకరు సవాలు చేసుకుంటూ పరస్పరం బలం పెంచుకుంటూ, అంతిమంగా లౌకిక స్వభావాన్ని మనుషుల మధ్య ఉండే మానవీయ లక్షణాలను మంటగలిపి, శ్రామిక ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయడం - తద్వారా విదేశీ, స్వదేశీ దోపిడి శక్తులకు సేవ చేయడమే వీరి విధిగా స్వీకరించారు. దేశంలోని పాలక పార్టీలన్నీ ఈ పాపంలో భాగస్వాములే. ఇప్పుడు అధికారంలో వున్నవారు బహుళజాతి బడాబాబుల సేవలో బాగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. తేడా అంతే.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గాని, దేశవ్యాప్తంగా గాని, ప్రపంచ వ్యాప్తంగా గాని పెట్టుబడిదారీ శక్తులు తమ లాభాల కోసం శ్రామిక ప్రజలపై కొనసాగిస్తున్న 12 -16 గంటల శ్రమదోపిడీ విధానం, అతితక్కువ వేతనాలు, కనీస రక్షణ లేని పనిప్రదేశాలు, నిత్యం ఉద్యోగ అభద్రతలతో శ్రామికవర్గ ప్రజలు సతమతమవుతున్నారు. అయినప్పటికీ గెలుపోటముల మధ్య సంఘటితపడుతున్నారు. దోపిడీకి వ్యతిరేకంగా అనేకవిధాలుగా తమ ధర్మాగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. మన దేశంలో రైతాంగం తమ జీవితాలకు సవాలుగా మారబోయిన చట్టాలపై తిరగబడి తాత్కాలికంగానైనా వెనక్కు నెట్టగలిగారు. పబ్లిక్, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు దేశవ్యాప్తంగా సాధారణ సమ్మెలో పాల్గొంటూ తమ నిరసనలు తెలుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో లక్షలాది మంది ఉద్యోగులు రోడ్డెక్కిన విషయం మనకి తెలుసు. ఇలాంటి సమైక్య నిరసనాందోళనలు జరగకుండా అడ్డుకోవటమే మతతత్త్వ శక్తుల ఎజెండా.

నిత్యం తమ అవసరాల కోసం కలిసిమెలిసి వుండే పట్టణ శ్రామిక ప్రజల్లో, గ్రామీణ పేద, మధ్యతరగతి ప్రజల్లో ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమ కార్యకర్తలుగా ఈ వాస్తవాలను ప్రచారం చేద్దాం. మేడే సందర్భంగా 'శ్రమ'ను మించిన గొప్ప 'శక్తి' ఏదీ లేదని, శ్రామికుల శ్రమశక్తే ఈ సకల సంపదల సృష్టికి మూలమన్న మౌలిక ప్రగతిశీల భావనలను ప్రచారం చేద్దాం. కోట్లాది మంది సామాన్య, మధ్యతరగతి ప్రజల శ్రమను కొల్లగొట్టడం ద్వారానే పెట్టుబడిదారీవర్గం తమ లాభాలను పెంచుకుంటున్నదని వివరిద్దాం. ప్రజలందరికీ చెందాల్సిన దేశంలోని సకల సంపదలను, గనులను, తమ రెక్కల కష్టంతో శ్రామికులు, ఉద్యోగులు సృష్టించుకున్న ప్రభుత్వ రంగాలను, చివరకు ఈ ప్రకృతిని కూడా కొల్లగొట్టడం ద్వారానే వీరు అపర కుబేరు లవుతున్నారని ప్రజలకు చాటి చెబుదాం.

ఆకలితో, దాహంతో ఉన్న తోటి మనిషికి కానీ, పశుపక్ష్యాదుల అవసరాలు కానీ తీరుస్తూ వాటితో పాటు కలిసి సమిష్టిగా బతికే రైతుల, రైతుకూలీల, శ్రామికుల సమిష్టి సంస్కృతి మనది. ధాన్యం, పండ్లు, కూరగాయల ధరలను నియంత్రించడానికి సముద్రంలో పారబోసే, యంత్రాలతో ధ్వంసం చేసే పెట్టుబడిదారీ లాభాల దోపిడీ సంస్కృతి వారిది. మూఢత్వాన్ని, మతాల, కులాల ఉన్మాదాన్ని వొకవైపు, సామ్రాజ్యవాదుల వస్తువ్యామోహ సంస్కృతిని మరొకవైపు ప్రోత్సహిస్తున్న సంకర సంస్కృతి ఈనాటి మన పాలకులది. నిత్యం దోపిడీకి గురవుతున్న శ్రమజీవులదే అసలైన పోరాట సంస్కృతి. మన ముందుతరాల వర్గపోరాట వారసత్వాన్ని కొనసాగించడం శ్రామికవర్గ కర్తవ్యం.

ప్రజలారా!

ప్రజలందరినీ ఐక్యంగా నిలిపే ప్రజా సంస్కృతిని నిలబెట్టుకుందాం. దోపిడీ సంస్కృతిని, ప్రజలను చీల్చే మతతత్వ, విచ్ఛిన్నకర సంస్కృతిని ఎండగడదాం. మేడే రోజున గతకాలపు శ్రామిక ప్రజల ప్రాణ త్యాగాలను , చికాగో కార్మికుల పోరాట స్ఫూర్తిని గుర్తుచేసుకుని, సంపదల సృష్టికర్తలైన శ్రామిక ప్రజలతో గొంతు కలుపుదాం రండి!

**జనసాహితి, జంటనగరాల శాఖ**

జనసాహితి ప్రచురణ

45 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

447

సంపుటి : 45

సంచిక : 10

మే 2022

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | శ్రమదోపిడి.. | – చిత్రం : అంతర్జాలం నుండి | .....01 |
| ✦ రెండవ అట్ట | : | కరపత్రం : మేడే సాహిత్య సభ | | .....02 |
| ✦ మూడవ అట్ట | : | యుద్ధం వెనుక (కవిత) | – చలపాక ప్రకాశ్ | |
| | | పదమటి వర్జీనియాలో 'తుపాకి మనిషి' (కవిత) | – అనువాదం : రవి | .....43 |
| ✦ నాల్గవ అట్ట | : | గుండెల్లో గుచ్చుకునే విలాప గేయం (కవిత) | – అనువాదం : కొత్తపల్లి రవిబాబు | .....44 |
| ✦ సంపాదకీయం | : | శ్రామికవర్గ సంస్కృతిని నిలబెట్టుకుందాం! | | .....05 |
| ✦ కథ | : | ఆత్మబలి | – లక్ష్మీకాంతమోహన్ | .....07 |
| ✦ వ్యాసాలు | : | ఉపరితల నిర్మాణముగా కళ – రామ్‌విలాస్ శర్మ | అనువాదం : సూర్యసాగర్ | .....09 |
| | : | మతకలహాలూ వాటి నివారణోపాయమూ – భగత్‌సింగ్ | అనువాదం : నిర్మలానంద | .....16 |
| | : | యుద్ధం ఒక సాంస్కృతిక విపత్తు | – కొత్తపల్లి రవిబాబు | .....25 |
| ✦ పుస్తక పరిచయాలు | : | సాంస్కృతికోద్యమ చరిత్ర | – కడియాల రామమోహన్‌రాయ్ | .....14 |
| | : | డిజిటల్ శ్రమ – కార్ల్‌మార్క్స్ | – జి.వి. భద్రం | .....20 |
| ✦ గల్పిక | : | పిచ్చి పుల్లయ్యలం!! | – శంకరం | .....19 |
| ✦ సినిమా సమీక్ష | : | 'పాథేర్ పాచాలీ' | – బాలాజీ (కోల్‌కతా) | .....29 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | కైఫీ ఆజ్మీ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....24 |
| ✦ కవితలు | : | సఖి (13); సహచరి (18) | | |
| ✦ వివిధ | : | ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (28); ఉత్తరం (08) | | |
| | | చైతన్యవాహిని (31); ఈ పుస్తకాలు అందాయి (33) | | |
| ✦ శాశ్వతనిధి | : | కళిరెడ్డి పద్మ (04) | | |
| ✦ సంతాపాలు | : | కడియాల రామమోహన్‌రాయ్ (04); లలితా జోషి (15) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30-7-6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN 94903393

'ప్రజాసాహితి'

కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు

"అకౌంట్ నెం.

**0680101004936**

***IFSC No. CNRB0000680***

**ఫోన్ : 94901 96890**

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**

మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు

1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# కృతజ్ఞతలు



**కశిరెడ్డి పద్మ** 1969లో విశాఖపట్నంలో జన్మించారు. ఆమె తీవ్రమైన అనారోగ్యంతో 13-5-2008న విశాఖజిల్లా చోడవరంలో మరణించారు.

ఆమె హైస్కూలు విద్య పూర్తిచేశారు. జనసాహితి సభ్యులు, OPDR నాయకుడైన కశిరెడ్డి గౌరీశంకర్‌తో 1987లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. అబ్బాయి తేజ L&T కలకత్తాలో ప్లానింగ్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అమ్మాయి జ్యోత్స్న M.D.S. చదివి దంతవైద్యురాలిగా ఉద్యోగం చేస్తూంది. కశిరెడ్డి పద్మ 14వ వర్ధంతి సందర్భంగా వారిని జ్ఞాపకం చేసుకుంటూ వారి కుటుంబసభ్యులు ఈ సంచిక ముద్రణకై 25 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వారికి ధన్యవాదాలు. పద్మగారికి జోహార్లు. ✦

# సాహిత్య విమర్శకుడు, రచయిత కడియాల రామమోహనరాయ్ మరణం



**రచయిత,** అధ్యాపకుడు, సాహితీ విమర్శకుడు కడియాల రామమోహనరాయ్ తన 78వ యేట అకస్మాత్తుగా 06-04-2022న గుంటూరులో మరణించారు. ఆయన గుంటూరుజిల్లా మేడికొండూరు మండలం సిరిపురంలో సంపన్న రైతు కుటుంబంలో 11-4-1944న జన్మించారు.

సిరిపురంలో ప్రాథమిక విద్యాభ్యాసం, గుంటూరు, విశాఖపట్నంలలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. గుంటూరు ఎ.సి. కళాశాలలో తెలుగుశాఖలో ట్యూటర్‌గా ఉద్యోగ జీవితాన్ని 1964లో ప్రారంభించి, జె.కె.సి. కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా 2002లో ఉద్యోగ విరమణ చేశారు. 'తెలుగు సాహిత్యంలో కృషీవల జీవితం' అనే అంశంపై పరిశోధన చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టా పొందారు.

సాహితీ విమర్శకునిగా 100కి పైగా వ్యాసాలు, 600లకు పైగా సమీక్షలు రాశారు. వేల ఉపన్యాసాలు ఇచ్చారు. 100కి పైగా రేడియో ప్రసంగాలు చేశారు. పదేళ్ళపాటు ఆ ఏడాది వచ్చిన కవితా సంపుటాలను విశ్లేషించారు. సాహిత్య విమర్శతో ఎటువంటి మొహమాటానికి లోనుగాకుండా రచనలోని తప్పు ఒప్పులను నిష్కర్షగా చెప్పేవారు. ఆయన ఉపన్యాసం ఒక మిత్రుడితో సంభాషణలాగా సాగేది.

ఆయన 'తెలుగు కవితా వికాసము – 1947–1980'లో 'ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కవిత్వం', 'సహృదయ' (వ్యాస సంపుటి) 'తెలుగు పద్యం సమగ్ర పరిశీలన' 'నూరు తెలుగు నవలల విశ్లేషణ' మొదలగు గ్రంథాలు రచించారు.

రామమోహనరాయ్ మరణానికి జనసాహితి సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి భార్య రాజ్యలక్ష్మి, కొడుకులు భారవి, శ్రీనాథ్‌లకు సానుభూతిని తెలియచేస్తోంది. ✦

## సంపాదకీయం

# శ్రామికవర్గ సంస్కృతిని నిలబెట్టుకుందాం!

**'భారతదేశం** నా మాతృభూమి, భారతీయులంతా నా సహోదరులు' అంటూ అందరం ప్రాథమిక విద్యాస్థాయి నుండీ ప్రతిజ్ఞ చేస్తున్నాం. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరం కలిసే పెరుగుతున్నాం. మన రాజ్యాంగ పీఠికలో రాసుకున్న "మనదేశ పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలను; ఆలోచన, భావప్రకటన, మతవిశ్వాసం, ఆరాధనాస్వేచ్ఛనూ; హోదాల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వాన్ని సాధించేందుకు; వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత – సమగ్రతను కలిపించే సౌభ్రాతృత్వాన్నీ పెంపొందించాలని" 75 సం॥ అజాదీ అమృతోత్సవాల్లో భాగంగా పాలకుల ఆదేశాల మేరకు రోజూ పఠిస్తున్నాం. ఉద్యోగాలు చేస్తున్నా, కూలిపనులకెల్తున్నా, కంపెనీల్లో పనిచేస్తున్నా శ్రామికులమంతా సమష్టిగానే జీవిస్తున్నాం. కుల, మత, ప్రాంత, లింగ వివక్షలను ఎదుర్కొంటూ ఆధిపత్యవర్గాలకు వ్యతిరేకంగా జరిపే ఉద్యమాలలో, పోరాటాల్లో భుజం భుజం కలుపుకుంటూనే సాగుతున్నాం. కానీ, 'రెండు భారతదేశాల' పాలన శ్రామికవర్గాన్ని పీల్చి పిప్పి చేస్తూ శ్రామికవర్గ సంస్కృతిని కాలరాయాలని చూస్తుంది.

ఢిల్లీ – జహంగీర్‌పూర్‌లో ఏప్రిల్ 16న భజరంగదళ్, విహెచ్‌పి మూతా హనుమాన్ శోభాయాత్రను పర్మిషన్ లేకుండానే నిర్వహించింది. ఆ యాత్ర మసీదు దరిదాపుల్లోకి వచ్చిన వెంటనే భజరంగదళ్, విహెచ్‌పి గూండాలు మసీదు చుట్టుప్రక్కల ఉన్న అన్యమతస్థుల ఇళ్ళపై దాడి చేశారు. అడ్డుకుని ప్రతిఘటించిన యువకులను మోదీ–షా ఆదేశాలమేరకు ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసి ఎన్ఎస్ఎలను ప్రయోగించారు. ఢిల్లీ బిజెపి ఛీఫ్ అక్కడ వున్న ఇళ్ళన్నీ అక్రమ కట్టడాలని, వాటిని కూల్చివేయాలని ప్రకటిస్తే, ప్రజాస్వామికవాదులూ ప్రజలు కలిసి సుప్రీంకోర్టుకు వెళ్ళారు. సుప్రీంకోర్టు తదుపరి విచారణ వరకూ ఇళ్ళను కూల్చవద్దని మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది. ఆ ఉత్తర్వులును లెక్కచేయకుండా, మాకు ఉత్తర్వులు అందలేదంటూ




ఎం.పి. బృందాకరత్ పోలీసు బుల్డోజర్లకు ఎదురెళ్ళి ఉత్తర్వులను చూపించినా, అక్కడి పేద ప్రజల ఇళ్ళను నేలమట్టం చేశారు.

ఏకపక్ష ధోరణితో రాజ్యాంగ విలువలకు తిలోదకాలిస్తూ పౌరసత్వచట్టం సవరణ బిల్లు 2019ని పాలకులు ప్రవేశపెట్టినపుడు – దానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా ఆందోళనల్లో పాల్గొన్నందుకు ఉమర్ ఖలీద్‌ని అరెస్టు చేసి, అతనిపై యు.ఏ.పి.ఐ. 1967 చట్టాన్ని ప్రయోగించారు. 500 రోజులకు పైబడి ఎటువంటి విచారణ లేకుండా అతను జైల్లోనే వున్నాడు. ఈ సం॥ మార్చి 24న ఢిల్లీ సెషన్స్ కోర్టు అతనికి బెయిల్‌నూ నిరాకరించింది. ఈ కేసుల్లో ఇంకా ఎంతోమంది జైళ్ళలోనే వున్నారు. భీమాకొరెగావ్ కేసులో 16 మంది రచయితలు, మేధావులూ 3 సంవత్సరాలుగా బెయిల్ కూడా రాకుండా జైళ్ళల్లో మగ్గుతున్నారు. వయోవృద్ధుడు ఫాదర్ స్టాన్‌స్వామిని జైలులోనే హతం చేశారు. గుజరాత్ ఎం.ఎల్.ఏ జిగ్నేస్ మేవానీ 'మోడీ దృష్టిలో గాడ్సే దేశభక్తుడు' అని ట్వీట్ చేసినందుకు అస్సాం పోలీసులు ఎం.ఎల్.ఏ. అయినా అతన్ని అరెస్టు చేశారు. పాత్రికేయురాలు, రచయిత రాణా ఆయూబ్ గుజరాత్ మారణకాండపై పరిశోధించి మోడీ పాలన హింసాకాండను బట్టబయలు చేస్తూ 'గుజరాత్ ఫైల్స్' అనే పుస్తకాన్ని రాశారు. అప్పటి నుండి ఆమెను కేంద్రం ఎన్‌ఫోర్స్‌మెంట్ వెంటాడుతుంది. లండన్‌లో ప్రసంగించటానికి ఆమె వెళ్తుండగా ముంబైలో విమానం ఎక్కకుండా ఆపేశారు. ఆమె కోర్టుకెళ్ళారు. కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ వారి చర్యలను తప్పు పట్టింది. ఐనా ఇది జరిగిన కొద్ది రోజులలోనే 'అవర్ హిందూ రాష్ట్ర' పుస్తక రచయిత ఆకార్ పటేల్ అమెరికా వెళ్తుండగా బెంగుళూరు విమానాశ్రయంలో సిబిఐ లుక్ అవుట్ పేరుతో ఆపేశారు. ఆకార్ పటేల్ తను రాసిన పుస్తకంలో దేశ జనాభాలో 15 శాతంగా వున్న ముస్లింలు ఎస్సీ, ఎస్టీలకన్నా దిగువస్థాయిలో జీవిస్తున్నారని దామాషా లెక్కలతో తెలియచేశారు. హిందూ మతతత్త్వ విధానాలను ఆయన ఎండగట్టారు. అందుకు ఆకార్‌పటేల్ ప్రభుత్వ వేధింపులను ఎదుర్కొంటున్నారు.

గత 7 సం॥లుగా కొనసాగుతున్న మోడీ–షా పాలనలో ఫాసిస్టు తరహా ధోరణులు హెచ్చుమీరుతున్నాయి. కర్ణాటకలో హిజాబ్ విషయమై జరిగిన ఆందోళనలు సమసిపోకముందే స్వయానా ప్రజాప్రతినిధులే ప్రజలను రెచ్చగొట్టి విడగొట్టేలా ప్రకటనలిస్తున్నారు. ఆలయాల దగ్గర అన్యమతస్థులు దుకాణాలు పెట్టవద్దనీ, ముస్లిం దుకాణాల్లో పండ్లు కొనవద్దనీ, అక్షయ తృతీయ రోజు ముస్లింల దుకాణాల్లో బంగారం కొనవద్దనీ ప్రకటనలిస్తున్నారు. శ్రమ నుండి పుట్టిన సంపదను కొల్లగొడుతూ శ్రమజీవులను కుల, మత వివక్షలకు గురిచేస్తున్నారు.

కేరళలోని ఓ దేవస్థానం బోర్డు నాట్య ప్రదర్శనలను ఏర్పాటుచేస్తూ కళాకారులను ఆహ్వానించారు. భారతనాట్యంలో పిహెచ్‌డి చేసిన

నాట్యకళాకారిణి మాన్సియా కార్యక్రమాన్ని వారే ఏర్పాటు చేశారు. హిందూ మతోన్మాదుల ఆదేశాలతో దేవస్థానం బోర్డువారు, ముస్లిం అయినందున మాన్సియా కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆమెకు తెలియచేశారు. మాన్సియా హేతువాదుల కుటుంబం నుండి వచ్చింది. ఆమె భరతనాట్యం నేర్చుకునేటప్పుడు కూడా ముస్లిం మతోన్మాదులు ఆమెపై, ఆమె చెల్లిపై హిందూ సాంప్రదాయక నృత్యాన్ని నేర్చుకుంటున్నందుకు మత వెలివేత ప్రకటించారు. ఐనా మాన్సియా నేర్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలిస్తూనే వుంది. మతం పేరుతో అన్యమతస్థులపై జరుగుతున్న అప్రజాస్వామిక విద్వేష విధానాలు రోజురోజుకీ ఎంతగా పెరిగిపోతున్నాయో తేటతెల్లమవుతుంది.

శ్రీరామనవమి రోజైన ఏప్రిల్ 9న హిందూ మతోన్మాద మూక దేశవ్యాప్తంగా అనేకచోట్ల అన్యమతస్థులను రెచ్చగొడుతూ, ఉసిగొల్పుతూ రోడ్లమీద ఊరేగారు. హాస్టల్ మెనూలో భాగంగా మాంసాహారాన్ని తీసుకున్న జెఎన్‌యు విద్యార్థులపై దాడిచేసి 'నవమి రోజున మాంసం తింటావా' అని తల పగులకొట్టారు. పూనేలో 3, 4 నెలల క్రితమే నాస్తికులు మీటింగ్‌ను ఏర్పాటు చేసుకుంటే, నవమి రోజు హిందూత్వ వాదులతో గొడవలవుతాయని పోలీసులు మీటింగ్ పర్మిషన్‌ని రద్దుచేశారు.

ఇవన్నీ చూస్తుంటే బ్రిటీష్‌వాడి పాలన స్ఫురణకొస్తుంది. 1919, ఏప్రిల్ 9 నాడు పంజాబులోని అమృతసర్‌లో ముస్లింల నాయకత్వాన హిందూ, ముస్లింల ఐక్యయాత్రగా శ్రీరామనవమిని జరుపుకున్నారు. బ్రిటీష్ ప్రభుత్వం ఆ వూరేగింపుకు నాయకత్వం వహించారని సైఫుద్దీన్ కిచ్లూని, డా॥ సత్యపాల్‌లను అరెస్టు చేసింది. ఆ అరెస్టులకు నిరసనగా జరిపిన బంద్ కార్యక్రమంపై బ్రిటీష్ పోలీసులు జరిపిన కాల్పులలో పదిమంది పైనే ప్రజలు చనిపోయారు. ఐనా ప్రజలు సమష్టిగా వైశాఖ పూర్ణిమ అయిన ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్‌లో పాలకులు అనుసరిస్తున్న నిర్బంధాలకు, రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా సమావేశమయ్యారు. జలియన్ వాలాబాగ్ దుర్ఘటన జరిగింది. ప్రజల్ని విభజించి, పాలించిన ఆనాటి వలస పాలకులకు కొనసాగింపుగానే 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యమైన' నేటి భారతదేశంలో పాలకులు అనుసరిస్తున్న అణచివేత, ఆధిపత్య పాలనా విధానాలు రాజ్యమేలుతున్నాయి.

కర్ణాటకలోని బేలూరు మఠంలో రథయాత్ర ప్రారంభానికి ముందు ముస్లింలు ఖురాన్‌ని పఠిస్తారు. ఇలాంటి సంఘటనలు దేశం నిండా అన్ని రాష్ట్రాలలోనూ మనం చూస్తూనే వుంటాం. దర్గాలకి, రొట్టెల పండుగలకి, గుడులకు, క్రైస్తవ సమారాధనలకు ప్రజలు తమ కష్టాలకు, కన్నీళ్ళకు పరిష్కారాల కోసం పరుగులెడుతూనే వున్నారు. ప్రజలు అనుభవిస్తున్న బాధల గాయాలకు పాలకులు మూఢత్వపు లేపనాన్ని పూస్తున్నారు. పెట్రోలు ధరలు, డీజిలు ధరలు, నిత్యావసరాల ధరలు, బస్ టికెట్ల ధరలు.... సమస్త జీవన వ్యయం పెరిగిపోయింది. ఉపాధి లేక, అవకాశాలు లేక నిరుద్యోగమూ పెరిగిపోతూ కనాకష్టంగా రోజులు వెళ్ళమారుస్తున్న ప్రజానీకం ఈ ఏడు సం॥ల మోడీ-షాల పాలనలో 27% పేదరికంలోకి కూరుకుపోయింది. ప్రపంచ పేదరికం సూచీలో 110వ స్థానానికి దిగజార్చిన మన దేశ ప్రధాని ప్రపంచానికి తిండి పెడతానంటూ ప్రకటిస్తున్నాడు. ఈ ఏడు సం॥ల కాలంలోనే ఆదానీ ఆసియాలోనే రెండవ ధనికుడిగా, ప్రపంచ కుబేరుల్లో 5వ స్థానానికి ఎగబాకాడు. కరోనా వంకతో, యుద్ధం వంకతో పాలకులు ప్రజలకు చెందిన సహజవనరులను, ప్రజలందరి ఆస్తులైన పబ్లిక్‌రంగాలను, కంపెనీలను, ఫాక్టరీలను స్వదేశీ, విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టబెడుతున్నారు. అశేష ప్రజల శ్రమను పిండుకుని తమ గాదెలు నింపుకుంటున్నారు.

అందుకే పాలకులు కాశ్మీరు నుండి కర్ణాటక వరకు ప్రతి రాష్ట్రంలోనూ - ప్రతి గ్రామాల వరకు కుల, మత, ప్రాంత, లింగ వివక్షలను పెంచి పోషిస్తున్నారు. ప్రజల మనసుల్లో విషబీజాలు నాటటానికి ఇంటర్నెట్, సోషల్ మీడియా.... ఒకటేమిటి మొత్తం మీడియానే ఉపయోగిస్తున్నారు. రైతులకు, కనీస గిట్టుబాటు ధరను, కార్మికులకు కనీస వేతనాన్ని, ప్రజలకు కనీస జీవన సౌకర్యాలను కల్పించలేని పాలకులు వందల కోట్ల రూపాయలతో విగ్రహాలను నిర్మిస్తున్నారు. ఐనా ప్రజలని ఎంతకాలం మోసం చేయగలరు?.

పాలకులు పెంచి పోషిస్తున్న మూఢత్వ భావజాలాన్ని, మతతత్త్వ, కులతత్త్వ భావజాలాన్ని, వస్తు వ్యామోహ సంస్కృతిని, సామ్రాజ్యవాద విషసంస్కృతిని, ఫాసిస్టు మతసంస్కృతిని నిలువరిస్తూ ఏ వివక్షలకూ, ఉన్మాదాలకూ తావు లేని శ్రమజీవుల సంస్కృతిని నిలబెట్టుకుందాం. సంపద సృష్టికర్తలమైన శ్రామిక ప్రజలమంతా ఆనాడు చికాగో కార్మికులు చేసిన పోరాటాల చిహ్నం మేడే స్ఫూర్తితో ప్రపంచ శ్రామికవర్గ సమైక్య సంస్కృతిని అశేష ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్దాం. శ్రమజీవుల పక్షాన నిలబడి పీడిత ప్రజలందరి గొంతులమవుదాం! **27-4-2022** ✦



ఉక్రెయిన్ ప్రసిద్ధ జానపద ప్రజాచిత్రకారిణి మరియా ప్రిమచెంకో చిత్రించిన రెండు తలల కోడిపిల్ల చిత్రం

సజీవ సాహిత్యం

# ఆత్మబలి

– లక్ష్మీకాంతమోహన్

**ఆ** యువతికి కింద వున్న భూమీ, చుట్టూ వున్న చెట్లూ మొదలైనవి గిరగిరా తిరిగి పోతున్నట్లనిపిస్తోంది. కాళ్ళకి ఏదో పెద్ద బరువు కట్టబడినట్లుగా అడుగులు యెంతో కష్టం మీద వేస్తోంది. మధ్య మధ్య ఆమె తూలి పడుతోంది; మోచిప్పలు కొట్టుకుపోతున్నాయి. రివ్వురివ్వున వీస్తూన్న గాలి ఆమె గాయాలగుండా జివ్వు జివ్వున పంచప్రాణాలతోసహా లాగుతోంది. కొంచెంగా తెరిచివున్న నోటిమూలల్లో నెత్తురు బుడగలు వేస్తోంది. జుట్టు జీబిరిగా ముఖం మీదికి వేలాడుతోంది. చీరె జీరలు జీరలుగానూ, రవిక బద్దలుగానూ చిరిగి వున్నాయి. ఆ చిరుగుల్లో గుండా, రక్తంతో చారికలుగట్టిన స్తనాలు కనపడుతున్నాయి. యెర్రబడి మత్తుగా వున్న ఆమె కళ్ళల్లో పట్టుదల, ద్వేషం స్పష్టంగా కనపడుతున్నాయి.

ఆమె పేరు గంగమ్మ. లంచాల దోపిడీతో లావుబారిన పటేలు పట్వారీలు మొదలైన మధ్యతరగతి చెత్త, ఆమెనీ "వాశే గంగీ" అంటారు; కాని విప్లవకారులామెను "గంగమ్మా" అని ప్రేమతో పిలుస్తారు. పటేలు, పట్వారీలు, వూళ్లోని రౌడీమందా ఆమెలో బిగువైన యవ్వనాన్ని మాత్రమే చూస్తారు; కాని విప్లవకారులామెలో సాహసాన్నీ, పట్టుదలనీ చూస్తారు, మెచ్చుకొంటారు; అనుసరిస్తారు.

గంగమ్మ తూలుతూ సోలుతూ, పడుతూ లేస్తూ తన గూడెంలోని గుడిశెకి చేరింది. గుడిశె ముందు నుంచున్న గంగమ్మకి గుడిశె పైభాగం మాత్రమే కానవస్తోంది; మెడ వంగటంలేదు. లోనికి వంగి వెళ్ళే ప్రయత్నంలో ఆమె బోర్లగా పడిపోయింది. యీ దెబ్బతో వుబ్బి వున్న పెదిమలు చిట్లి, నెత్తురు చిలుకుతోంది. ముఖం దోక్కుపోయింది. ముక్కువెంట రక్తం కాల్వలు గట్టింది. వుండివుండి ఆమెకి కొండ చాటున వున్న విప్లవకారులు తలుపుకొచ్చేరు; ఆమెకి గుండె దడ యెక్కువైంది. యీ దడ వల్ల రక్తప్రవాహం వేగం యెక్కువై, యింకా యెక్కువ కారుతోంది. ఆ విప్లవకారులకి అన్నం వండి, తీసికెళ్లి యివ్వాలి. లేకపోతే.. లేకపోతే.. లేకపోతే....?

శవం మోస్తరుగా చలనం లేకుండా ఆమె అలానే వాకిట్లో పడుకొంది. మత్తు! తీవ్రమైన మత్తు!! అతి తీవ్రమైన మత్తు!!! ఆమెని పూర్తిగా బంధించింది.

★ ★ ★

ఆమె సామాన్యమైన కూలీ స్త్రీ. మధ్యతరగతి స్త్రీలల్లోనూ, ధనిక స్త్రీలల్లోనూ వుండే పిరికితనం, అహంకారం, అలంకారం, అంకమ్మశోకాలు, కడుపుబ్బరం, మొదలైన అంటురోగాలు ఆమెకి లేవు. ఆమెకి గుండె నిబ్బరం, సాహసం, ప్రజాశత్రువులపట్ల ద్వేషం




– యీ మూడు మాత్రమే వున్నాయి. కాని అలాంటి వుత్తమ మానవ లక్షణాలు వుండటం వల్లనే ఆమెకి యీ రోజున లెక్కలేనన్ని లాఠీ దెబ్బలు తగిలినాయి. అందువల్లనే – పిరికి వాళ్లనీ, కామెర్ల రోగుల్నీ, తోకపీకుడుగాళ్లనీ, లఫంగుల్నీ, కూపస్థమండూకాల్నీ, నపుంసకుల్నీ తెగ పొగుడుతున్న నాయకులూ, పత్రికలూ యీమెలాంటి స్త్రీనీ, పురుషుల్నీ నీచాతినీచంగా దూషిస్తూ 'బందిపోట్లు, హంతకులు' అనే పేర్లుబెడుతూ కాలరాచేయాలని ప్రోత్సహిస్తున్నారు. కాని కోటానుకోట్లుగా వున్న ప్రజలు మాత్రమే యీమెలాంటి వుత్తమ మానవులు కలకాలం బతకాలని కోరతారు.

జబ్బు నయమైన రోగిలో కొత్త రక్తం ప్రవహించినట్లు, తెలంగాణా గ్రామాల్లో ప్రజల ఆధ్వర్యాన పంచాయితీ పాలన యేర్పడినాక, భూమి ప్రజలకి చెందినాక, ఆమెలో కొత్త వికాసం కల్గింది. యిప్పుడామెకి – విముక్తి గ్రామాల్లోని వేలాది స్త్రీలకిమల్లే – యెంతో స్వేచ్ఛ వున్నది. యిదివరకి పటేలు పట్వారీల బూతులూ, దొరల దొరసానుల దోపిడీ, రౌడీల రాక్షసత్వం – యివన్నీ, యింకెన్నో వుండేవి. పైగా మగవాళ్ళు ఆడవాళ్లని నీచంగా చూసేవాళ్ళు. యిప్పుడలాంటివి లేవు.

వొకనాడు గంగమ్మ తమ వంతు వచ్చిన భూమి పరిశీలిస్తూ, చేలో అటూ యిటూ తిరుగుతోంది. అప్పుడు అటువేపు 'సోమిగాడు' అనే యువకుడు వచ్చేడు. అతడు ప్రజారక్షణ దళంలో సభ్యుడు. యెందువల్లనో ఆ యిద్దరికీ యేదో వాదం పెరిగింది. 'సోమిగాడు' తాను మగాణ్ణనే ధీమాతో 'అసలు ఆడ లంజల్ని పగలగోసి యెండెయ్యాలి' అని తిట్టేడు. గంగమ్మ విని వూరుకొని, యీ సంగతి సంఘ నాయకుడితో చెప్పింది. యింకేం? మీటింగు వేసి సోమిగాడ్ని పిలిపించేరు; దానికి వూళ్లో స్త్రీలంతా గుమికూడేరు. అందరి నిర్ణయం ప్రకారం సోమిగాడు తాను అన్నమాటకి క్షమాపణ చెప్పుకొనేదాకా స్త్రీలు వూరుకోలేదు.

అంతేగాదు. యింకోసారి వొక యువతిని వొక యువకుడు బలాత్కారం చెయ్యగా, ఆమె సంఘానికి చెప్పింది. అతన్ని సంఘంలోంచి తొలగించేరు; క్షమాపణ చెప్పించేరు. మరోసారి వొక రైతు వొక కూలీని నీచంగా మాట్లాడేడు. అతనికీ అదే శాస్తి జరిగింది. ఇలా చెప్పాలంటే యేన్నో వున్నాయి. ఆవిధంగా ప్రజలందరి హక్కుల్నీ 'సంగం' కాపాడుతోంది.

★ ★ ★

తల్లి వచ్చి కాసిని నీళ్ళు కొట్టేదాకా గంగమ్మకి స్పృహ రాలేదు. ఆమె పడుకొనివుండే కళ్ళు కొంచెం తెరిచింది. తల్లి తన ముందు కూచుని కన్నీళ్ళు కుక్కుకొంటోంది. ఆ తల్లికి పైన యిద్దరి పిల్లల్లోనూ గంగమ్మ మాత్రమే మిగిలింది. కొడుకు యేనాడో నవాబు తుపాకి గుండ్లకు బలి అయ్యేడు.

గంగమ్మ మనోఫలకంలో తిరిగి విప్లవకారు లగుపించేరు; ఆమె ఆందోళన యెక్కువకాగా లేవబోయింది. కాని వొళ్ళంతా తాళ్ళతో బిగించినట్లుంది. పొద్దుకూకింది. యిళ్ళల్లో దీపాలు కనపడుతున్నాయి. గంగమ్మ పట్టబలవంతాన ప్రయత్నం చేసి లేచి కూచుంది.

'అమ్మా. ఆ కుండలో అన్నం వండుదాం పట్టు' గంగమ్మ నీరసంగా అంది. ఆ అన్నం యెవరికోసమో ఆమె తల్లికి తెలుసు.

'గంగులూ?'

'యేంది?'

'ఆ తీరుగా వుండి నువ్వు కొండకాడికి కూడెత్తుకుపోతావె?'

'అది యివాళ కొత్తా?'

ఆమె తల్లి అన్నం యివాళ యెవళ్లనన్నా యెత్తుకుపొమ్మని చెప్పి, ఆ దెబ్బలు నయం చేసుకొనేదాకా వూరుకోమని బతిమాలింది; గంగమ్మ వినలేదు. వున్నట్లుండి ఆమెకి గుండెలో యెన్నో మేకులు కొట్టినట్లు పోట్లు పుట్టి సాగేయి. శ్వాసకి యేదో అడ్డంపడినట్లుంది. ఆ పోట్లు తెరలు తెరలుగా వస్తున్నాయి. ఆమె గుండెని చేత్తో అదిమిపట్టి నేలమీద ఆ బాధకి దొర్లుతోంది. అన్నం తీసికెళ్లమని యెవరికన్నా చెపుదామా అని ఆ బాధలో అనుకొంది. కాని – అమ్మో – తన బాధ్యతను యింకోరి నెత్తిమీద రుద్దటమా? విప్లవకారులు యెన్నో యమబాధలు పడి ధనవంతుల, దోపిడీగాళ్ల భూమిని, వొకప్పుడు తమదైన భూమిని, తమకి – బీదాళ్ళకి – పంచి యిచ్చేరు. యిప్పుడు ఆ భూమిని జమీందారీ తుపాకి గుండ్లు ఆక్రమించుకొనకుండా, భూమినీ, ప్రజలనీ, రక్షించటం కోసం యెన్నో త్యాగాలు చేస్తున్నారు. అలాంటి విప్లవకారులకి యింత అన్నపుముద్దని తాను అందించలేదా? ఛీ. ఛీ. అకస్మాత్తుగా, నూతనోత్సాహం ఆమె లేచి, తల్లి సహాయంతో అన్నం వండటం పూర్తిచేసి, అన్నపుకుండ నెత్తిపై బెట్టి, బాధపడుతూనే బైలుదేరింది. కన్నీళ్లతోనూ, తాను తప్పుచేశాననే బాధతోనూ తల్లి ఆమెని సాగనంపింది.

★ ★ ★

తీపులుపుట్టించే నొప్పుల్ని లెక్కచేయకుండా ఆమె నడిచి నడిచి అడవి చేరుకొంది. ఆ అడవి దాటితే కొండ; కొండమాటున తన సోదరులు వున్నారు. ఆమె అడవిలోకి కాలుబెట్టింది. ఆ కటిక చీకట్లో వొక కటిక కోనలాగవుండే కొండ సొరంగంలోకి పోతున్నట్లనిపిస్తోంది. బాట కానరావటంలేదు. మధ్యమధ్య తుప్పలూ, దుబ్బులు, ముళ్లపొదలూ, మోదులూ అడ్డం వస్తున్నాయి. తడవ తడవకీ ఆమె పడిపోయేంతపని అవుతోంది. కాని నెత్తిమీదున్న కుండని మాత్రం ఆమె అతిభద్రంగా పట్టుకొంది. మొత్తం అడవిలోంచి బిక్కుబిక్కు మనిపించే రిమ్‌రిమ్ అనే ధ్వని వినవస్తోంది. వుండి వుండి పొదల్లో యేదో అలికిడౌతోంది. దూరాన్నుంచి గాండ్రు గాండ్రుమని యేదో శబ్దం వినవౌతోంది. వొక మానుబిల్లి ఆమె ముందు దూకి, జర్రున చీకట్లోకి దూసుకుపోయింది. నడిచినకొందీ ఆమెకి ఆయాసం పెరుగుతోంది. తిరిగి గుండెలో పోట్లు వస్తున్నాయి. కళ్ళు తిరిగిపోతున్నాయి. కాని విప్లవ కారులకి తాను ఆహారం చేరవేస్తున్నాననే తలంపు వొక్కటే ఆమెకి వుత్సాహిమిస్తోంది. గాయాలు మంటలు పుడుతున్నాయి. గాలికి గాయాలు పగిలి నెత్తురు కారుతోంది.

బాగా పొద్దుపోయినాక ఆమె కొండచాటుకి చేరుకొంది. వొకరు ముందుకొచ్చి ఆమె బరువును దింపేరు వుస్సురంటూ ఆమె కూలబడి వారి వంక తిరిగి చిరునవ్వు నవ్వింది. చీకట్లో, ఆమె పళ్లూ, కళ్లూ మెరిసేయి. తన వొంటిమీద గాయాల సంగతి ఆమె వారికి చెప్పలేదు. చీకట్లో వారు చూడనూలేదు. కొంతసేపటికి ఆమె విరగదీసుకొని పడిపోయింది. యేమిటా అని వారు ఆశ్చర్యపడ్డారు. వారిలో వొకరు ఆమె తలని తన తొడమీద వుంచుకొని జాగ్రత్తగా తడిమి చూసేడు. చేతికి తడి తగిలింది. వాసనని బట్టి నెత్తురనీ, యిది...... లారీలపని అని అతను గ్రహించి అందరికి చెప్పేడు. ఆమె నోటివెంట నెత్తురు నురుగులు వస్తున్నాయి. శీతలం గమ్ముతోంది. 'కామిరేడ్స్!' అని ఆమె నోరు విప్పింది. 'కామిరేడ్స్! వె....నకడుగు..... వేయ....మాకండి. ముందుకే.... ముందుకే..... శెలవు.. కామిరేడ్స్..' ఆమె శాశ్వతంగా కళ్ళు మూసుకొంది.

**ఆత్మబలి (చిన్న కథలు) 1949 ప్రచురణ నుండి....** ✦

## ఉత్తరం

*ప్రజాసాహితి పత్రికవారికి నా నమస్కారములు*

నా పేరు గాయత్రి, మా అత్తవాళ్ళింటికి విజయవాడ వచ్చినపుడు 'ప్రజాసాహితి' పత్రికను చూశాను. దానిలో "డిజిటల్ శ్రమ – కారల్‌మార్క్స్" వ్యాసాన్ని చదివాను. నేను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నందున వెంటనే కనక్ట్ అయ్యాను.

నిజమే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నామని మేం గొప్పగా చెప్పుకుంటాం. నేనందులో ప్రోగ్రామింగ్‌లో చేస్తున్నా. జీతాలు కూడా చాలా ఉంటాయని, లగ్జరీ లైఫ్ ఉంటుందని, వారంలో ఐదురోజులు పనిచేసి మిగతా రెండు రోజులూ ఇష్టమైనట్లు ఎంజాయ్ చేయొచ్చని అందరిలాగే చదువుకునేరోజుల్లో నేనూ అలానే అనుకున్నాను. చేరిన తర్వాత తెలిసిందేమిటంటే అందరికీ జీతాలు 'ఎక్కువ' వుండవు. రోజుకు 14 గంటలకు పైనే పనిచేయాలి. పనేంటో, ఎలా చేయాలో ఎవరూ దగ్గరుండి నేర్పరు. చేసుకుంటూ నేర్చుకోవాలి. చదువుకునే రోజుల్లో ప్రాక్టికల్స్ వుండవు. కాబట్టి నేర్చుకోవటం ఒక పెద్ద యజ్ఞంగా వుండింది. ఆ తర్వాత టీమ్ లీడర్స్ ఒక్కొక్కరు ఒక్కోలా వుంటారు. ఎప్పుడూ తప్పులెన్నుతూ, ఎంతచేసినా ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని వెంటబడుతూ వుంటారు. యూరినల్స్‌కి వెళ్ళటం కోసం పాజ్‌లో పెట్టినా ఎక్స్‌ప్లనేషన్స్ ఇచ్చుకోవాలి. ఎవరో వెంటాడుతున్నట్లుంటుంది. ఇక సొంత కుటుంబం అవసరాలు ఎలా తీర్చాలో తోచదు. ఆందోళన వ్యాపిస్తూ వుంటుంది. ఈ ఒత్తిడిని తట్టుకోవటానికి, బయటకు టూర్లంటూ పరుగులు తీస్తుంటాం. కష్టపడి సంపాదిస్తుంటాం – ఖర్చు పెట్టేస్తూ వుంటాం – చివరకు ఏమీ మిగలదు ఒత్తిడి, ఆందోళన తప్ప. ఈ వ్యాసం చదువుతుంటే సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్థులమైన మేమేకాక ఈ రంగంతో కూడుకున్న అందరి పరిస్థితి ఇలానే వుందని అర్థమయింది. ఈ వ్యాసం చదవగానే మాలో మేమే కుమిలిపోనవసరం లేదన్పించింది.

**– డి. గాయత్రి, నెల్లూరు** ✦

వ్యాసం

# ఉపరితల నిర్మాణముగా కళ

- రామ్‌విలాస్ శర్మ

అనువాదం : సూర్యసాగర్

*రామ్‌విలాస్ శర్మ (10 అక్టోబరు 1912 - 30 మే 2000) ప్రసిద్ధ అభ్యుదయవాది, సాహిత్య విమర్శకుడు, కవి. భాషాశాస్త్ర అంశాలను, సాహిత్యాన్నీ మార్క్సిస్టు దృక్పథంతో వివరించారు. 'సూర్యకాంత త్రిపాఠీ', 'నిరాలా'పై రాసిన సాహిత్య వ్యాసంతో 1939లో సాహిత్య విమర్శారంగంలో ప్రవేశించారు. ఆగ్రాలోని బల్వంత్ రాజ్‌పుట్ కళాశాలలో ఇంగ్లీషు శాఖాధ్యక్షునిగా పనిచేశారు. హిందీ రచయితలైన భారతేందు హరిశ్చంద్ర, ప్రేమ్‌చంద్, నిరాలాల రచనలను అభ్యుదయ కోణం నుండి విమర్శించారు. ఆచార్య రామచంద్ర శుక్లా రచనలు భూస్వామ్య సాహిత్యాన్నీ, రాజాశ్రయ సాహిత్యాన్నీ ఎలా వ్యతిరేకించాయో వివరించారు. 1970లో 'నిరాలాకి సాహిత్య సాధన' (3 భాగాలు) రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. 'భారత్‌కీ ప్రాచీన్ భాషాపరివార్ ఔర్ హిందీ' అనే బృహద్గ్రంథానికి 1991లో వ్యాస సమ్మాన్ అందుకున్నారు.*

*అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘానికి 1949 నుండి 1953 వరకు ప్రధాన కార్యదర్శిగా వున్నారు. 'సమాలోచక్' పత్రికకు రెండేళ్ళపాటు 1958, 59లలో సంపాదకత్వం వహించారు.*

మానవుని ఇతర అభివృద్ధి కలాపాల మాదిరే కళ కూడా అతని శ్రమ మూలంగానే నిర్దేశితమవుతుంది. మానవుడిని ఎలాగైతే సమాజాతీతంగా ఊహించలేమో, సామాజికం కాని కళను కూడా ఊహించలేము. మానవ శ్రమ, అతని ఆర్థిక కార్యకలాపాలు పునాది నిర్మాణము. అతని సంస్కృతి అంతిమంగా పునాదిచే నిర్ధారితమయే ఉపరితల నిర్మాణము. మానవ సంస్కృతిలో ఒక ప్రధాన అంశమైన కళ కూడా ఉరితల నిర్మాణములోని అంశం. మానవుని సౌందర్యాభిరుచి, కళాత్మక సృజనలు కేవలం ఊహాశక్తి ఉత్పన్నాలు కావు. అవి అతని భౌతిక కార్యకలాపాల మూలంగా అంటే జీవితావసరాల ఉత్పత్తి మూలంగా రూపొందినవే. నిర్దిష్ట ఆర్థికవ్యవస్థ మార్పు చెందినప్పుడు, కళతోపాటు ఉపరితల నిర్మాణం అంతా కూడా మార్పు చెందుతుంది.

## కళలోని ఆకర్షణ

అయితే ఒక ప్రశ్న ఉదయిస్తుంది : కాలం చెల్లిన సామాజిక వ్యవస్థలకు చెందిన కళ నేటికీ మనకెందుకు ఆకర్షణీయంగా వుంటున్నది? ప్రాచీన యుగాలకు చెందిన కొన్ని అద్భుత కళాసృజనలను తరువాతి యుగాల కళలు ఎందుకు అధిగమించలేకపోయాయి? మార్క్స్ మాటల్లో "గ్రీకు కళ, ఇతిహాసాలు కొన్ని ప్రత్యేక సామాజికాభివృద్ధి రూపాలతో ముడిపడి వున్నాయన్న భావాన్ని ఆకళింపు చేసుకోవడం కష్టమేమీ కాదు. అయితే ఎందువల్ల అవి నేటికీ మనకు సౌందర్యభరిత ఆనందాన్ని కలిగించేవి గానూ, కొన్ని విషయాల్లో అవి అందుకోలేనంత ప్రామాణికంగానూ, నమూనాగానూ భాసిస్తున్నాయన్నది ఆకళింపు చేసుకోవడంలోనే కష్టం ఇమిడి వుంది."

మొదటిగా, మార్పు అంటే నిరంతరాయతతో పూర్తి తెగతెంపులు అని భావించకూడదు. ఆర్థిక ఉత్పత్తి విధానంలో కూడా గత యుగంలో సాధించిన విజయాలను ఇముడ్చుకోవడం ద్వారా మాత్రమే నూతన సామాజిక వ్యవస్థ పురోగతిని సాధించగలదు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని సాంకేతిక ప్రగతిని సోషలిస్టు వ్యవస్థ తిరస్కరించదు. దాన్ని అదుపులోకి తెచ్చుకొని నూతన స్థాయికి అభివృద్ధి చేస్తుంది. మరి, నూతన ఉపరితల నిర్మాణం మునపటి యుగపు సంస్కృతి ప్రగతిని ఎందుకు మొత్తంగా తిరస్కరించాలి?

రెండవది, ఒక నిర్దిష్టవర్గం చారిత్రకంగా ప్రగతిశీల పాత్ర నిర్వహించినప్పుడు, తరువాత కాలంలో అది ప్రగతి నిరోధకంగా తయారయినప్పుడు దానిలో స్వభావరీత్యా తేడా వుంటుంది. ఒక వర్గం ప్రగతిశీల పాత్ర వహించిన దశలో అది సృజించిన భావజాలం, అది క్షీణ దశలో వున్నప్పుడు సృజించిన భావజాలం సమానం కావు. పురోగామివర్గాలు పూర్వం ప్రగతిశీల పాత్ర నిర్వహించిన వర్గాల సంస్కృతితో సాదృశ్యతను గుర్తించడం ఎంతో సహజమైన విషయం. ఐరోపా పురోగామి బూర్జువావర్గం యొక్క సంస్కృతీ వారసత్వం ప్రగతి నిరోధక బూర్జువావర్గానికంటే కార్మికవర్గానికి ఎంతో విలువైనది కాదా?

మూడవది, మానవ జీవితంలో మాదిరే కళలో కూడా పరిణామము అభివృద్ధి వుంటాయి. నూతనయుగపు కళ అవశ్యంగానే నూతన తలంలో అభివృద్ధి చెందుతుంది. గ్రీకు ఇతిహాసాలు పెట్టుబడిదారీ ఐరోపాలో సృజించడం ఎలా సాధ్యం కాదో, గ్రీకు బానిస సమాజంలో బాల్జాక్, డికెన్స్ నవలల సృజన అంతే అసాధ్యం. ఆధునిక ఐరోపా కళ అవశ్యంగానే గ్రీకు కళ కంటే భిన్నమైన నూతన తలంలో అభివృద్ధి చెందింది.

## కళాభివృద్ధి

అయితే, తేడా ఎందులో వుంది? రవీంద్రనాథ్ కవిత్వం, కాళిదాసు కవిత్వం కంటే భిన్నమైన తలంలో ఎలా అభివృద్ధి చెందింది? అదే జరిగితే దాని కారణంగా రవీంద్రనాథ్ కాళిదాసుకంటే అధికుడా?

రవీంద్రనాథ్ కాళిదాసు యుగం కంటే భిన్నమైనదానికి చెందినవాడు. నూతన జీవన పరిస్థితులచేత రవీంద్రనాథ్ ఠాగూర్ ఉత్తేజితమైనాడు. నూతన సామాజిక అనుభవంచేత, దేశభక్తి, అంతర్జాతీయత, సోదరత్వం, శాంతి, బెంగాలీ జాతీయత పట్ల అభిమానం మొ॥ భావాలచేత ఉత్తేజితుడయినాడు.

అదేవిధంగా ప్రేమ్‌చంద్ కళ తులసీదాస్ కళ నుండి భిన్నంగా వుంటుంది. వారు జీవించిన కాలాలు భిన్నమైనవి. వారిని ఉత్తేజపరచిన సామాజిక స్థితిగతులు, సామాజిక అనుభవము భిన్నమైనవి. ప్రేమ్‌చంద్ చిత్రించిన రైతాంగం రాముని ప్రతిమ ముందు తమ వేదనలు నివేదించడంతో సంతృప్తిపడలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, భారత భూస్వామ్య ప్రభువుల జమిలి శక్తిని ఎదిరించి పోరాడింది. ప్రేమ్‌చంద్, రవీంద్రనాథ్‌ల కళ, కాళిదాసు, తులసీదాసు కళ కంటె భిన్నతలంలో వృద్ధి చెందిందని దీనివల్ల రుజువవుతుంది.

అయితే ఇదంతా తొలిదశ వాళ్ళకంటె మలిదశకు చెందినవారు అధికులని నిరూపించదు. ఒక విధంగా చెప్పాలంటే కళాభివృద్ధి అడ్డతలంలోను, నిలువుతలంలోనూ కూడా జరుగుతుంది. అడ్డతలంలో అభివృద్ధిలో నూతన సాంఘిక యుగం తనదైన భిన్న కళాతలాన్ని ముందుకు తెస్తుందని దీనివల్ల స్పష్టమవుతుంది. అయితే అంత స్పష్టంగా తెలియనిదేమిటంటే నిలువుగా జరిగే అభివృద్ధిలో దాని గాఢత, సమృద్ధి, సౌందర్యము, సౌందర్యానుభూతి విషయాల్లో నూతన యుగపు కళ దాని పూర్వీకపు కళ కంటె ఆధిక్యతను అవశ్యంగా కలిగివుండకపోవడం.

## ఇంద్రియగ్రాహ్య అనుభవం (Sensuous Experience)

పై ప్రశ్నకు సమాధానం కోసం కళలోని వస్తువును విశ్లేషించ వలసిన అవసరముంది. భావాలు మాత్రమే కళ కాజాలవు. భావాలను అనుభూతి, ఉద్వేగాలతో వెలిగించడానికి రచనా సంవిధానము, శిల్ప చాతుర్యంతోపాటు క్షేత్రస్థాయి మానవ అనుభవానికి చక్కని కళారూప మివ్వగల సామర్థ్యం అవసరం. గ్రహణ జ్ఞానం ఇంద్రియావబోధ (Perceptual Knowledge) తప్పనిసరి అవసరం కావడంతో కళ తక్కిన సంస్కృతి కంటె భిన్నమైనది.

జ్ఞానాన్వేషణకంతటికి వాస్తవికతను గూర్చిన ప్రత్యక్షానుభవం వుండి తీరవలసిందే. అయితే అది కళకు అవసరమైనదానికంటె భిన్నమైనది. మార్క్స్ ఎన్నడూ భారతదేశాన్ని సందర్శించకుండానే భారత సమాజాన్ని గురించి ప్రతిభావంతమైన సాధారణీకరణలు అందించాడు. అయితే భారతదేశ సమాజంతో ప్రత్యక్ష సజీవ సంబంధం లేకుండా వాస్తవికతావాద నవలను రాయడం అసాధ్యం. ఇంద్రియజ్ఞానము (Sensation), భావరూపాలతో కూడిన ఇంద్రియావబోధ దశ జ్ఞానాన్వేషణలో కిందిస్థాయి దశే కావచ్చు, అయితే అది లేకుండా కళ అనేది సాధ్యంకాదు. రష్యా సామాజికాభివృద్ధి గురించి టాల్‌స్టాయ్ భావాలు సక్రమంగా లేవు. అయితే అతని గ్రహణ జ్ఞానం మాత్రం లోతైనదీ, సమగ్రమైనదీ. ప్రేమ్‌చంద్ సామాజిక చింతన తరచు నిలకడలేనిది. అయితే గాఢత, విస్తృతిలో ఆయన కల్పనా సాహిత్యం భారతదేశంలో నేటికీ అధిగమించలేనిదిగా వుంది.

ఒక కళాకారుడు సరైన భావాలు కలిగి వున్నప్పటికీ అతడు దిగువస్థాయి కళాకారుడిగా మిగిలిపోవచ్చు. కళావిమర్శ సార్థకం కావాలంటే కళాకారుడి ఆలోచనల పట్ల మాత్రమే శ్రద్ధ చూపడం కాకుండా, అతడు దిగువస్థాయి జ్ఞానసంచితానికి చెందిన ఏ అనుభూతుల్ని, ఏ భావముద్రల్ని పొందాడు అనేదానిపట్ల కూడా మరింత ఎక్కువ శ్రద్ధ కనపరచాలి. కళ కేవలం సాధారణీకరణలకు మాత్రమే పరిమితమై ఇంద్రియానుభూతిని కల్పించని ఎడల అది కళాస్వభావాన్ని కోల్పోతుంది.

కళలోని వస్తువు, రూపమూ రెండూ స్వభావరీత్యా ఇంద్రియానుభూతిని కలిగిస్తాయి. సంగీతము, చిత్రకళలేగాక, కవిత్వం కూడా దాని ప్రభావశీలతలో పదాల యొక్క సంగీత, భావచిత్ర నిర్మాణ గుణాలపై ఆధారపడి వుంటుంది. ఇంద్రియానుభూతి (Sensation), భావచిత్ర కల్పన (imagery) అన్నవి భావాలకంటె ఎక్కువ సార్వత్రికమైనవి. తత్త్వశాస్త్రం కంటె కళ దాని ఆకర్షణలో అధిక విస్తృతి కలిగి వుండడానికి ఇది ఒక కారణం. కాళిదాసు సాంఘిక భావాలతో ఎవరైనా అంగీకరించక పోవచ్చు, కానీ శకుంతల సౌందర్యం కలిగించే అనుభూతి ద్వారా వచ్చే ఆనందం శాశ్వతమైనది.

మానవుని ఇంద్రియానుభవమూ, శబ్దాల, వర్ణాల గురించిన జ్ఞానమూ కూడా పరిణామం చెందుతూ వచ్చాయి. అవి అతని సామాజికాభివృద్ధితో ముడిపడి సాగినాయి. ఈ సందర్భంలో మార్క్స్ ఇలా చెప్పారు :

"వస్తుగతంగా బయల్పడే సంపద్వంతమైన ఆత్మగత మానవ ఇంద్రియానుభవ శక్తి ద్వారా మాత్రమే సంగీతాన్ని ఆస్వాదించగల చెవి, రూప సౌందర్యాన్ని ఆస్వాదించగల కన్ను వంటివి, ఒక మాటలో మానవ సామర్థ్యాలు గల ఇంద్రియ జ్ఞానంలో కొంత భాగం అభివృద్ధి చెందడం, కొంత భాగం సృజింపబడడం జరిగింది. పంచేంద్రియాల గ్రాహకశక్తి కల్పన ఇప్పటివరకు సాగిన మొత్తం ప్రపంచ చరిత్ర గమనం ఫలితమే. సాధారణ కార్యాచరణ అవసరాలకు మాత్రమే పరిమితమైన ఇంద్రియ జ్ఞానం కేవలం స్వల్పమాత్రపు (కుదించిన) అర్థాన్ని కలిగి వుంటుంది. ఆకలిగొన్న మనిషికి మానవులు భుజించే ఆహారం కాకుండా కేవలం ఆహారం యొక్క నైరూప్యస్థితి మాత్రమే గమనంలో వుంటుంది. అది అత్యంత ముతకరూప ఆహారంగా వుండవచ్చు. అంతేగాక ఆహారం తినడంలో ఆకలిగొన్న మనిషికి జంతువులకి మధ్య తేడాని చెప్పడం కష్టం. పేదరికంలో ఆందోళనలో వున్న మనిషి ఒక నాటకాన్ని గురించి, అదెంత గొప్పదైనా, పట్టించుకోడు. లోహాల వ్యాపారి మార్కెట్ విలువను గురించి మాత్రమే ఆలోచించగలడు గాని లోహపు సౌందర్యము, దాని మౌలిక స్వభావాన్ని గురించి మాత్రం కాదు. అతనికి లోహశాస్త్ర జ్ఞానం లేదు. సిద్ధాంతపరంగాను, ఆచరణాత్మకంగాను మానవుని ఉనికి వస్తీకరణ చెందటమంటే మానవుని ఇంద్రియ జ్ఞానాన్ని మానవీకరించడమేగాక, విశాల సంపద్వంత మానవ మరియు ప్రాకృతిక జీవనానికి అనుగుణంగా మానవ ఇంద్రియ జ్ఞానాన్ని సృజించడం కూడా".

(Marx and Engels 'on Literature and Art' - New York 1947, P.16-17)

పెట్టుబడిదారీ వ్యవస్థ విశాల ప్రజారాశులైన పురుషులను స్త్రీలను వేతన బానిసత్వానికి బలిచేయడమేగాక స్వీయ మానవ చైతన్యం యొక్క సంపద్వంతమైన అభివృద్ధిని అణచివేస్తుంది. పెట్టుబడిదారుడు కళ

వ్యాపారే గాని సౌందర్య సృష్టికర్త కాదు. స్వేచ్ఛా శ్రమ జీవనం మాత్రమే మానవ జ్ఞానేంద్రియాలను సంపూర్ణంగా సంస్కరించడానికి, వాటి ఫలవంతమైన క్రియాశీలతకు మార్గమేర్పరుస్తుంది. జ్ఞానేంద్రియాలు మోటు రకపు కార్యాచరణ అవసరాలకే ఎందుకు పరిమితం కాగూడదు? ఎందుకు అలా కాదు అంటే ఇంద్రియగత ఆహ్లాదము ఆర్థిక కార్యకలాపాల ప్రతిఫలన కాదు గనుక. సమాజంతో, సామాజికోత్పత్తితో సంబంధం లేకుండా మానవీయ ఆహ్లాదం పొందగల ఇంద్రియ చేతనను మానవుడు వృద్ధి చేసుకోలేడు. ఆదిమ సామాజిక వ్యవస్థలో జీవించే మానవులు తాజ్‌మహల్ నిర్మింపజాలరు. అందులో ఇమిడిన సౌందర్య భావన సామాజికాభివృద్ధిచే నిర్దేశితమైనది. అయితే అంతమాత్రాన తాజ్‌మహల్ షాజహాన్ కాలంలో నెలకొన్న సామాజిక వ్యవస్థ యొక్క భావజాల ప్రతిఫలనమని భావించకూడదు.

కళ కేవలం ఇంద్రియానుగతమని, మానవుని సామాజిక కార్యాచరణపై ప్రభావం లేనిదని భావించగలమా? ఏమాత్రం అలా కాదు. ఇంద్రియానుగత సంతోషానుభవాలన్నీ ఒకే రకం కాదు. సాధారణ ఆరోగ్యకర ఆనందమూ, అసంగత అనారోగ్యకర ఆనందమూ రెండూ వున్నాయి. రాజాశ్రయంలో బతికిన హిందీ, ఉర్దూ కవులు మద్యపానాన్నీ, స్త్రీలనూ స్తుతిస్తూ బోలెడు కవిత్వాన్ని రాశారు. అయితే ఆధునిక కాల్పనిక కవుల రచనలతో పోలిస్తే అదంతా పరిమితానుభవంతోను అనారోగ్యకర ధోరణులతోను కూడినదిగా అర్థమౌతుంది.

ఇంగ్లండ్‌లో రెస్టొరేషన్ కాలంనాటి కామ నాటక కర్తలు లేదా 19వ శతాబ్దం చివరినాటి దిగజారుడు రచయితల రచనలు వారి మనోవైకల్యాల వ్యక్తీకరణలే. ఆంగ్ల కవులు కీట్స్, షెల్లీ, బైరన్‌ల కవిత్వం కలిగించే ఇంద్రియానుభూతి వాటికంటె భిన్నమైనది, ఆరోగ్యకరమైనది. పతనమవుతున్న మరియు పురోగామి వర్గాల మధ్య విషయాసక్తిలో తేడాలను సులభంగా గుర్తించవచ్చు. జర్మన్ కవి జార్జి వీర్త్‌ని ప్రశంసిస్తూ ఎంగెల్స్ ఇలా రాశాడు : "ఒక విషయంలో అతడు ప్రవీణుడు. సహజ దృఢ ఇంద్రియానురక్తిని, దేహగత ఆనందహేలను అభివ్యక్తీకరించడంలో అతడు హైని (Heinrich Heine) కంటె అధిక సమర్థుడు. అతడు ఎక్కువ ఆరోగ్యవంతంగాను, తక్కువ కృత్రిమంగాను వుంటాడు. అట్టి అభివ్యక్తిలో జర్మన్ భాషలో గేథె (Goethe) మాత్రమే అతన్ని మించినవాడు".

శుద్ధ యోచనాత్మక సౌందర్యం అంటూ ఏదీ లేదు. కళల్లోకెల్లా అత్యంత ఇంద్రియాకర్షకమైన శిల్పకళ కూడా విస్మయాన్ని, భయాన్ని కల్గించవచ్చు. సౌందర్య యోచన ద్వారా ఏర్పడిన సంస్కారం, భావాలు మానవుడి ఆచరణను ప్రభావితం చేస్తాయి. మానసిక ప్రశాంతతను చేకూర్చవచ్చు లేదా ఆత్మిక ఔన్నత్యం ఒనగూర్చవచ్చు.

భగవద్గీతలో ఇలా వుంది : "నీవు యోచించే విషయాలు వాటిపట్ల నీలో వాత్సల్యాన్ని నింపుతాయి". కళ మానవుని సంవేదనాశీలతను సంస్కరిస్తుంది. ఇది కళ యొక్క అత్యంత ప్రయోజనకరమైన గుణం. నిజమైన సంవేదనాశీలత గల మనిషి క్రౌర్యాన్ని, రోతను సహించడు. సామాజిక జీవితం నుంచి వాటిని పారద్రోలడానికి పోరాడుతాడు. హిందీ సాహిత్య విమర్శకుడు రామ్‌చంద్ర శుక్లా కవిత్వాన్ని భావయోగ కర్మయోగాల సమైక్యతగా అభివర్ణించాడు. అంటే అది భావోద్వేగ ఉల్లాసము, ఆచరణల సమైక్యత. అందుకే కళ గురించి కేవలం కళాత్మక ప్రమాణమన్నది వర్తించదు. మానవ విజ్ఞానానికి సంబంధించినట్లే కళకు కూడా అంతిమ ప్రమాణం ఆచరణ మాత్రమే.

ఇంద్రియావలోకనానికి చెందిన నైశిత్యములో, సంస్కారంలో ప్రాచీన యుగాలకు చెందిన కళాకారుడు, మరింత అభివృద్ధి చెందిన భావాలు ఆర్థిక విధానము గల వేరొక తరవాతియుగపు కళాకారుడిని అధిగమించగలిగి వుండవచ్చు. మానవుడు ఇంద్రియజన్య అనుభూతిలో, తన ఆలోచనాక్రమం కంటే తగ్గు స్థాయిలో మార్పుచెందుతాడు. మానవుని సామాజిక భావాలు అతని ఆర్థిక కార్యకలాపాలను ప్రతిబింబిస్తాయి అనే అర్థంలో అతని ఇంద్రియానుభూతులు వాటిని ప్రతిబింబించవు.

ఇంద్రియావబోధలకు, ఆనందహేలకు సంబంధించిన తీవ్రత, నైశిత్యాలను అతడు ఎన్నో శతాబ్దాల తరవాత, ఎంతో అభివృద్ధిని సాధించిన సామాజిక వ్యవస్థల్లో కూడా చేరలేని స్థాయిని అతడు అందుకోగలగడం సాధ్యమే. ఈ కారణం వల్లనే కాళిదాసు జీవించిన సామాజికవ్యవస్థ అంతరించినప్పటికీ ఆయన కవిత్వం నేటికీ మనకు ఆకర్షణీయంగా వుంది.

## ఉద్వేగాల పాత్ర

కళాసృజనలో ఇంద్రియ జ్ఞానం కేవలం ఒక అంశం మాత్రమే. భారతీయ కవిత్వ కళలో భావం లేదా ఉద్వేగానికి (emotion) అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని లలితకళల్లోను మానవుని ఉద్వేగానుభూతి, అంటే అతని భావానుభూతి ప్రధానమైన పాత్ర నిర్వహిస్తుంది. సంస్కృత నాటకకర్త భవభూతి, మానవీయ సానుభూతిని, అంటే కరుణను సాహిత్యంలో ఇతర మనోద్వేగాల కంటే అత్యంత మౌలికమైనదిగా సూత్రీకరించాడు. తన ఉద్వేగ నిర్మాణంలో మానవుడు తన భావప్రపంచం కంటే తక్కువగా మార్పు చెందుతాడు. బాల్యదశలోని అమాయకత్వం, సంతానంపట్ల మాతృప్రేమ, పర్వతాలు నదుల సౌందర్యం విభిన్న సామాజిక వ్యవస్థల్లో మానవాళిని అబ్బురపరచాయి.

పై కారణంగానే తత్త్వశాస్త్రంతో పోల్చి చూసినప్పుడు కళకు విస్తృత ఆకర్షణ వుంటుంది. కళ యొక్క ఉద్వేగ ప్రాముఖ్యత చాలావరకు దాని రూపనిర్మాణంపై ఆధారపడి వుంటుంది. ఇది రూపము – వస్తువుల మధ్య వున్న సన్నిహిత సంబంధాన్ని తెలియపరుస్తుంది. కవిత్వంలో ఒక పదం బదులు వేరొక పదం ప్రయోగించడం వల్ల రూపంలో ఏర్పడే మార్పు ఆ పంక్తి యొక్క ఉద్వేగ ప్రాముఖ్యతను మారుస్తుంది. ఆ విధంగా వస్తువులో మార్పును తెస్తుంది. "A Thing of Beauty is Always a Joy" అన్నది రూపంలోనూ వస్తువులోను కూడా "A Thing of Beauty is Always a Joy for ever" అను దానికంటె భిన్నమైనది. అందుకే కవిత్వం కంటె తత్త్వశాస్త్రాన్ని అనువదించడం సులువు. ఇదంతా తెలియజెప్పే వాస్తవం ఏమిటంటే కళలో భావాలు మాత్రమే వస్తువు కాదు. ఒప్పించే శక్తిలో తత్త్వశాస్త్రము, విజ్ఞాన శాస్త్రాలను కళ అధిగమిస్తుంది. రూపంలోను వస్తువులోను ఇమిడివున్న ఇంద్రియ చేతన మరియు భావోద్వేగాల మౌలిక ఐక్యత వల్లనే ఇది సాధ్యమయింది. కళలో చిత్తశుద్ధి అనుదానికి చతురత ప్రత్యామ్నాయం కాదు. చతురత శ్రోతలను స్పందింపజేయుటలో విఫలమైనపుడు సత్య ప్రతిఫలన బయటపడుతుంది. నీవు వ్యక్తీకరిస్తున్న అనుభూతిలోని

ఉద్వేగ తీవ్రత, దానితోపాటు వ్యక్తీకరణ సామర్థ్యం, కళలు సత్యపూరితం కావడానికి ప్రధానపాత్ర వహిస్తాయి. వాల్మీకి, కాళిదాసు, తులసీదాసు, రవీంద్రనాథ్, భారతి, ప్రేమ్‌చంద్, నిరాలా వంటి సమున్నత స్థాయిగల రచయితలు ప్రాధాన్యత గల జీవిత దృగ్విషయాల చేత ఉద్వేగపూరిత ప్రేరణ పొందడమేగాక, ఇతరుల ఉద్వేగాలను ప్రేరేపించగల, గొప్ప శక్తి కలిగినవారు.

వస్తుగత అంశం మౌలికమైనదయినప్పటికీ, ఆత్మగత అంశం కూడా ప్రధానమైనదే. ఒక యూరిపిడిస్ లేదా ఒక షేక్స్పియర్ లేని పరిస్థితుల్లో తరచు గొప్ప సామాజిక విషయాలు చిత్రణకు నోచుకోకుండా గతించిపోతుంటాయి. ప్రాధాన్యత గల వస్తుగత, ఆత్మగత అంశాల ఐక్యత వల్లనే గొప్ప కళ సిద్ధిస్తుంది. కళాకారుని వ్యక్తిత్వంలో అతి ముఖ్యమైన అంశం మానవ జీవితంలో ప్రాముఖ్యత కలిగిన దానిచేత ప్రేరణ పొంది ఇతరులను ప్రేరేపించే శక్తిని కలిగి వుండడం. హోమర్, డాంటె, షేక్స్పియర్, గొప్ప భారతీయ కవులు వారు జీవించిన యుగంతో పోలిస్తే భావాల రంగంలోను, ఆర్థికాభివృద్ధిలోను ముందుకు పోయిన యుగాలకంటె సమున్నతంగా నిలవడానికి ఇది కూడా ఒక కారణం. ఆత్మగత అంశం ఎంతో ముఖ్యమయినది అయినందువల్ల అది సులువుగా దక్కదు. దానిని జాగ్రత్తగా పెంచి పోషించుకోవాలి. కళను అయత్నకృతమైన (Spontaneous) జీవిత ప్రతిఫలనంగా అర్థం చేసుకోగూడదు.

## రూపంలో వైవిధ్యం

కళారూపాల్ని అనుసరించి భావాలు, ఇంద్రియానుభవాలు, ఉద్వేగాల పాత్ర భిన్న విధాలుగా వుంటుంది. భావాలు కవిత్వంలో వ్యక్తీకరణ పొందేంత నిశ్చయాత్మకత శిల్పకళలో వుండదు. సంగీతం ఊహాత్మక దృశ్యాలను తట్టి లేపగలదు. అయితే చిత్రలేఖనం మాదిరి దృశ్యమానం చేయలేదు. భాష ఆలోచన యొక్క సజీవ సాక్షాత్కారం కావున కళ భాష లేకుండా ఆలోచనను వ్యక్తపరచజాలదు. సాహిత్యంలో మాత్రమే భాష కళాత్మక వ్యక్తీకరణ మాధ్యమంగా వుంటుంది. ఈ కారణంగా ఇతర కళారూపాలలోకంటె సాహిత్యంలో భాష అధిక ప్రాధాన్యత వహిస్తుంది.

కావున భిన్న కళారూపాల్లోని సామాజిక వస్తువు భిన్నంగా వుండి తీరుతుంది. ఒక కళకు చెందిన ఒక శాఖలో కూడా, ఉదాహరణకు సాహిత్యంలో, కళాకారుడు ఎంచుకొనే నిర్దిష్ట రూపాల్లో – నాటకం, కవిత్వం, కల్పనాసాహిత్యం – రూపం చాలా మేరకు వస్తు స్వభావాన్ని నిర్దేశిస్తుంది. కల్పనాసాహిత్యంలో మాదిరి కవిత్వంలో జీవిత వాస్తవిక ప్రత్యక్ష చిత్రణకు వీలుకాదు. సాహిత్యంలోని కవిత్వం వంటి ఒకే శాఖలో కూడా దీన్ని చూడవచ్చు. కథాకావ్యము లేదా వ్యంగ్య కవిత్వం లేదా ఐతిహాసిక కావ్యంలోని ఒకే వస్తువు భిన్న వ్యక్తీకరణలు పొందుతుంది. అందువల్ల వివిధ కళారూపాలను భిన్న మార్గాల్లో పరిశీలించాలి.

భావప్రసారానికి మానవుడు కనుగొన్న అతి ప్రధాన సాధనం భాష. చిత్రలేఖనం కంటె తక్కువ ఇంద్రియాకర్షకమై, సంగీతం కంటె తక్షణ ప్రభావంతో తక్కువ ఉద్వేగ ప్రేరితమైనప్పటికీ, సాహిత్యం అత్యున్నత కళారూపంగా భాసిస్తుంది. శిల్ప నిర్మాణంలో, సౌందర్య రచన తదితరాల్లో సాహిత్యంలో కొంత శిల్పకళ ఇమిడి వుంది. దాని ఇంద్రియాకర్షక భావచిత్రాల్లోను, లయాత్మకతలోను అది చిత్రలేఖనం, సంగీతం గుణాలను పాలుపంచుకుంటుంది. ఆలోచనా వ్యక్తీకరణ సామర్థ్యంలో అది తత్వశాస్త్ర సమానమైనది. ఇందు మూలంగా దాని సంపూర్ణ వ్యక్తీకరణ సామర్థ్యంలో సాహిత్యం వాటన్నిటినీ అధిగమిస్తుంది. సాహిత్యం యొక్క ఈ మహత్తర శక్తిలో భావాలు ప్రధానపాత్ర నిర్వహిస్తాయి.

కేవలం ఇంద్రియానుభవ జ్ఞానమే గాక హేతుబద్ధ విజ్ఞానంతో దాని సమ్మేళనం వల్ల మిగతా అన్ని కళారూపాలకంటె సాహిత్యానికి విశిష్ట స్వభావం చేకూరుతుంది. హేతుబద్ధ జ్ఞానాభివృద్ధి సాహిత్యంలో వాస్తవికతావాదం అభివృద్ధికి, విస్తృత జనామోద రూపాలైన నవలా సాహిత్యం వంటి వాటి సృజనకు దారితీసింది. నాటకం కల్పనా సాహిత్యం సామాజిక వాస్తవికతను ప్రతిఫలించడంలో శక్తిమంతమైన సాధనాలుగా రూపొందడమేగాక దానిని పరివర్తించే సాధనాలుగా కూడా రూపొందినాయి. సాహిత్యం యొక్క ఈ పాత్ర సాఫల్యం కావడానికి కళానియమాలను నిర్లక్ష్యం చేయడం గాక వాటిని పరిపూర్తి చేయడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

## భావజాల వస్తువు

గతానికి చెందిన గొప్ప కవులు, నాటకకర్తలు భావాల పాత్రను నిర్లక్ష్యం చేయలేదు. అంతేగాక వారి కళలోని ఇంద్రియానురక్తికి మరియు ఉద్వేగ పార్శ్వాలను మాత్రమే పరిగణించి వారి రచనలను ప్రశంసించడం సాధ్యం కాదు. తులసీదాస్ ఇలా అన్నాడు : "కవి హృదయం సాగరం వంటిది. అతని మేధస్సు ముత్యపు చిప్ప వంటిది. కవితాదేవత స్వాతి నక్షత్రం వంటిది. ఈ నక్షత్రం దిగువన గొప్ప భావాలు వర్షబిందువుల మాదిరి కురిసినప్పుడు అందమైన ముత్యాల వంటి పద్యాలు సృజింప బడతాయి". సాహిత్యంలోని ఆలోచన, ఉద్వేగాల ఐక్యతను ఇది చక్కగా వివరిస్తుంది.

రవీంద్రనాథ్, భారతి వారికాలపు దేశభక్తియుత ఆలోచనలను వ్యక్తపరచారు. వారి ఆలోచనలు తరచు మార్మికత, నిష్క్రియాపర భావాలతో కలగలసి వుంటాయి. వారి ఆలోచనల్లోని ఈ వైరుధ్యం వారి కవిత్వంలోని భావాల ప్రాధాన్యతను ఏమీ తగ్గించదు. ప్రేమ్‌చంద్ రష్యాలో జరిగిన గొప్ప సోషలిస్టు విప్లవం చేత ప్రభావితుడైనాడు. ఆయన నవలల్లో, కథానికల్లో దేశభక్తి, అంతర్జాతీయత భావాలను కళాత్మకంగా వ్యక్తపరచినాడు. ఆయన తొలి రచనల్లో ఆ భావాలకు విరుద్ధంగా ఊహాత్మక పరిష్కారాలను, చివరిదశ రచనల్లో కూడా కొన్ని సందర్భాల్లో నిష్క్రియాపర, బాధాసహిష్ణుతా భావాలను చిత్రించాడు. ఈ వైరుధ్యం కూడా అతని సాహిత్యంలోని భావాల ప్రాధాన్యతను రద్దుచేయదు. అందువల్ల రచయిత ప్రాపంచిక దృక్పథము, అతని సాంఘిక భావాలు సాహిత్య పురోగమనానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలుగా వుంటాయి.

## సంప్రదాయము - కళ

సాహిత్యంలోని కొన్ని లక్షణాలను కేవలం ఇంద్రియ జ్ఞానముగా, ఉద్వేగాలుగా లేదా భావాలుగా విడివిడిగా పరిగణిస్తే సరిగా వివరించడం వీలుకాదు. ఆ మూడింటి మొత్తంగా వివరించడమే సరైనదిగా వుంటుంది. ఒక ప్రజాసమూహము యొక్క ఆత్మసంకల్పము, గుణగణాలు, సంస్కారాలు సాహిత్యంలో ముద్రితమై వుంటాయి. అందులో మంచివీ,

చెడ్డవీ రెండూ వుంటాయి. మంచివాటిని పదిలపరచుకొని, చెడ్డవాటిని వదిలించుకోవాల్సి వుంటుంది.

భారతీయ సాహిత్యంలో స్త్రీల సమస్యని పరిశీలించవచ్చు. మహాభారతంలో ద్రౌపదికి జరిగిన అవమానానికి కక్ష తీర్చుకోవడం ఇతివృత్తంగా మలచబడింది. రామాయణంలో రావణుడు సీతను బలాత్కారంగా ఎత్తుకుపోవడం పర్యవసానంగా జరిగిన రామరావణ యుద్ధం కేంద్రంగా ఇతివృత్తం నడచింది. రావణున్ని ఓడించి సీతను విడిపించుకున్న తర్వాత వాల్మీకి రాముడు ఇలా అన్నాడు : “విధి (Fate) కల్పించిన అవమానాన్ని ఒక మనిషిగా నేను తుడిచివేశాను”. ప్రేమ్‌చంద్ సాహిత్యంలో “సేవాసదన్”లో సుమన్ జీవన పోరాటం, “ప్రేమాశ్రమ”లో బిలాసి ఆత్మగౌరవ జీవనం, “నిర్మల”, “గబన్”లో సామాన్యులయిన నిర్మల, జలాప పాత్రల సాహసం, “కర్మభూమి”లో బ్రిటిష్ సైనికులపై మున్ని సాధించిన పగ, “గోదాన్”లో ధనియా వీరోచిత జీవితం, వృందబన్‌లాల్ వర్మ చారిత్రక నవలల్లో ప్రేమకోసం పోరాటం - ఇదంతా కూడా భారతీయ సంప్రదాయంలో భాగమే. ఎల్లవేళలా వారి ఎరుకలో లేకపోయినా ఇది మన ప్రజల సంస్కారం.

ఒక తరం నుండి వేరొక తరానికి ప్రసారమయే ఇటువంటి గంభీర వెల్లువల మానవ అనుభూతులు, ప్రవర్తనలు ఒక అద్భుతమయిన వారసత్వం. అవి కళాసాహిత్యాల్లో ఉన్నతోన్నత సృజనలకు కారణభూత మవుతాయి. భిన్న జాతీయతలు, భిన్నవర్గాలు సాహిత్యంపై తమదైన ముద్రను ప్రసరిస్తాయి. వీటిలోకెల్లా మానవాళి విముక్తిని సాధించడానికి శ్రామికవర్గపు అజేయమైన సంకల్పం అత్యంత ప్రధానమయినది.

ప్రాచీన భారతదేశపు, గ్రీసు దేశపు మహాకవులు నేటికీ నమూనాలుగా, ప్రామాణికులుగా వుండడానికి కారణం వారి భావాలు నేటికీ మనకు గొప్ప ప్రాధాన్యతను కలిగివుండి అవి మానవాళి వారసత్వంలో భాగమయి వుండడమే. వారు నేటికీ ఆదర్శ నమూనాలుగా, ప్రామాణికులుగా వుండడానికి కారణం వారి ఉద్వేగాల తీవ్రతలో, నిశిత ఇంద్రియానురక్తిలో, కొత్త యుగాలకు చెందిన మరింత పురోగామి భావాలతో కూడిన అసంఖ్యాక రచయితలు వారిని అధిగమించ లేకపోవడమే. అట్లాగని వారి గురించి పూర్తి సంతృప్తి ఎవరికీ లేదు. మానవుని సామాజికాభివృద్ధితో పాటు కళ మార్పు చెందుతూ అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతూ వుంటుంది.

కళావిమర్శలో వివిధ కళారంగ శాఖల్లో భావాలు, ఉద్వేగాలు, ఇంద్రియానుభూతులు వేరువేరు పాత్రలను నిర్వహిస్తాయన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఒక శాఖ నిర్వహించే పాత్ర వేరొక శాఖలో నిర్వహించ బడాలని ఆశించకూడదు. కళ మారుతున్న సామాజిక వాస్తవికతను ప్రతిఫలిస్తూ దాన్ని పదిలపరచడమో, పరివర్తన చెందించడమో చేస్తుంది. అయితే కళాశాఖలన్నీ ఒకేవిధంగా ఈ విధిని నిర్వహించవు. తాత్విక, నైతికభావాలకంటే కళ నెమ్మదిగా మారుతుంది. ఎందుకంటే ఇంద్రియ గ్రాహక, ఉద్వేగాల ప్రపంచం భావాల ప్రపంచం కంటే మరింత సార్వత్రికమైనది.

అంతిమంగా అన్ని కళలూ మానవశ్రమ, సామాజికోత్పత్తి చేత నిర్దేశింపబడతాయి. కావున అవి ఉపరితల నిర్మాణంలో భాగంగా వుంటాయి. కళ అంతా ఆర్థిక ప్రయోజనాలను కాపాడని విధంగా, భాష కూడా ఒకటికంటే ఎక్కువ వర్గాల ప్రయోజనాలకు సేవ చేయవచ్చు. ఉదా : తాజ్‌మహల్. కళ మానవుని ఇంద్రియానుభూతి అవసరాలను తీరుస్తూ, అతని కార్యకలాపాలను పరోక్షంగా మాత్రమే ప్రభావితం చేయడానికీ, అదే కళ ఇంద్రియానుభూతి అవసరాలను మరియు అదే సమయంలో ఆర్థిక అవసరాలను కూడా తీరుస్తుండడానికీ మధ్య గల తేడాను గుర్తెరగాలి. కళ అంతటినీ కేవలం ఆర్థిక ప్రయోజనాలను ప్రతిఫలించే భావాలను నింపుకున్నదిగా భావించడం తప్పు. కళ అంతటినీ మానవాళి సామాజిక ప్రగతికి తోడ్పడగల భావాలు లేనిదిగా, కేవలం ఇంద్రియానురక్తిక (Sensuous)మైనదిగా భావించడం కూడా అంతే తప్పు. సాహిత్యంలో భాష వ్యక్తీకరణ మాధ్యమం అయినందువల్ల ఆలోచన యొక్క మరియు రచయిత వర్గదృక్పథము, సామాజిక భావాల యొక్క ప్రాధాన్యతను గుర్తించవలసి వుంది. ఈ అంశాలనన్నిటినీ పరిగణనలోకి తీసుకోవడం ద్వారా మాత్రమే ఉపరితల నిర్మాణంగా కళకు న్యాయం చేయగలుగుతాం. ✦

కవిత

## మరోసారి....

– సౌఖ్య

కొంతకాలం
కలలు కనడం మానేద్దాం
ఇది కలలు కనే కాలం కాదు!
అయినా, ఏమి ఆశించి కలలు కంటున్నారు!
మహాత్ముడి తరం కలలు నిజమయ్యాయా!?
‘స్వాతంత్ర్యం’ వచ్చిందా? ఏమో కానీ
ప్రజాతంత్రం వచ్చిందా!?
పుట్టుకతోనే సర్వ అవలక్షణాలతో
ఎదిగిందా బిడ్డ!
ఎప్పటికప్పుడే ఆఖరిచూపనుకున్నాం!
కొన ఊపిరితోనే కొనసాగింది!
సందేహం లేదు! ఈ సారి నిశ్చితంగా
మరణించింది!
అందుకే అనవసరంగా కలలు కనకండి!
ఏమి చేయాలని ప్రశ్నించకండి!
ఇప్పుడు చేయాల్సింది చాలా వుంది
చేతలకు పని చెప్పండి!
తెల్లవాడిని ఎదిరించిన కాలంనాటి
ఉద్వేగ స్ఫూర్తిని ఆవాహన చేయండి!
మళ్ళీ, వీధుల్లోకి పరుగులు తీయండి
మన కోసం జైళ్ళు, తుపాకిగుళ్ళు, లాఠీదెబ్బలు
ఎదురు చూస్తున్నాయి!
మనం నిజమైన స్వాతంత్ర్యాన్ని
సాధించుకోవాల్సి వుంది!! ✦

**పుస్తక పరిచయం**

కడియాల రామమోహనరాయ్‌ను స్మరించుకుంటూ.....

# సాంస్కృతికోద్యమ చరిత్ర



**Marxist-Cultural • Movement in India**
**Chronicles And Documents •(1936-47)**
**Compiled and Edited by Sudhi pradhan**

**డిస్ట్రిబ్యూటర్స్ : నేషనల్ బుక్ ఏజన్సీ (ప్రై) లిమిటెడ్; 12, బంకించంద్రవీధి, కలకత్తా - 700073;**
**రెండు సంపుటాలు : వెల : 1వ సంపుటి : రూ. 45/-; రెండవ సంపుటి : రూ. 100/-**

**మార్క్సిస్టు** సిద్ధాంత ప్రభావం 1930 తర్వాత భారతీయ భాషలన్నిటిపైనా ప్రగాఢంగానే ప్రసరించింది. బోల్షివిక్ విప్లవం విజయవంతమై సోవియట్ రష్యాలో నూతన సమాజం రూపుదిద్దు కొంటున్న తరుణంలో వివిధ దేశాల మేధావులలో కదలిక వచ్చింది. 1980 తర్వాత హిట్లర్ నిరంకుశ పాలనలో, ఫాసిజం కోరల నుండి తప్పించుకొని వచ్చిన శరణార్థుల గాథలు లండన్, పారిస్ నగరాలలోని మేధావుల మనసులను కలచివేశాయి. జర్మనీ నుండి అప్పటికే ఐన్‌స్టీన్, హాబర్ వంటి శాస్త్రజ్ఞులు, థామస్‌మన్, ఎర్నెస్టుటోలర్ వంటి రచయితలు వలస వచ్చేశారు. ఫాసిజం యూరప్ అంతటా వ్యాపించవచ్చుననే భయం పట్టుకొన్నది. 1933లో హిట్లర్ అనుచరులు గోరింగ్, గోబెల్స్‌లు "రీచ్‌స్టాగ్" భవనాన్ని తగులబెట్టించి, ఆ నేరాన్ని కమ్యూనిస్టులపై మోపారు. బల్గేరియా కమ్యూనిస్టు నాయకుడు డిమిట్రావ్ - అప్పుడు జర్మనీలో వున్నాడు. ఆయనపై ఈ నేరం మోపారు. అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాన్సు దేశాలలో డిమిట్రావ్ నిర్దోషి అని చాటుతూ ప్రదర్శనలు జరిగాయి. డిమిట్రావ్ కోర్టు ప్రకటన సత్యాన్ని వెల్లడించింది. ఫాసిజం నిజస్వరూపం ఇతర దేశాల వారికి కూడా సరిగా అర్థం కావటానికి యీ సంఘటన తోడ్పడింది.

ఫ్రాన్స్ దేశంలో హెన్రీ బార్బుస్సీ ఆధ్వర్యంలో "World Congress of Writers for the Defence of Culture" అనే పేరిట 1935లో పారిస్‌లో అంతర్జాతీయ సదస్సు జరిగింది. మాక్సిం గోర్కి, రోమా రోలా. ఆంద్రే మాల్రా, థామస్ మాన్, వాల్డో ఫ్రాంక్ యీ సదస్సులో పాల్గొని, ప్రపంచదృష్టిని మరల్చటానికి తోడ్పడ్డారు. ఆ కాలంలో ముల్కరాజ్ ఆనంద్, సజ్జాద్ జహీర్ లండన్‌లో విద్యాభ్యాసం చేస్తూ ప్రపంచ పరిస్థితులను శ్రద్ధగా గమనించి చైతన్యవంతులవుతున్నారు. కారల్‌మార్క్స్ మొదలైన సోషలిస్టు సిద్ధాంతవేత్తల రచనలను అధ్యయనం చేస్తూ, మిత్రుల గోష్ఠులలో చర్చలు జరుపుతున్నారు. ఇంగ్లాండ్ దేశపు సుప్రసిద్ధ రచయిత రాల్ఫ్‌ఫాక్స్‌తో వారికి గాఢమైన పరిచయం ఏర్పడింది. సజ్జాద్ జహీర్ గదిలో రాల్ఫ్‌ఫాక్స్‌తో గోష్ఠి జరుపుతున్నప్పుడు ఒక బెంగాలీ మిత్రుడు రవీంద్రుణ్ణి భారతదేశపు పెట్టుబడిదారుల, అభివృద్ధి నిరోధకుల ప్రతినిధిగా పేర్కొని విమర్శిస్తే, ఆ వాదనను ఫాక్స్ నిరసించాడు. ఆయన సమర్థనను నిజంచేస్తూ 1937లో భారతదేశంలో ఫాసిజానికి వ్యతిరేకంగా ఏర్పడిన సంఘానికి రవీంద్రుడు అధ్యక్షుడుగా వ్యవహరించాడు.

సజ్జాద్ జహీర్ నివసిస్తున్న గదిలోనే కేవలం ఆరేడుగురు సభ్యులతో భారతీయ అభ్యుదయ రచయితల సంఘం స్థాపితమైంది. నలుగురైదుగురు సభ్యులు సంఘం మేనిఫెస్టో తయారుచేయటానికి పూనుకున్నారు. ముల్కరాజ్ ఆనంద్ మొట్టమొదటి డ్రాఫ్ట్ తయారు చేశారు. అది మరీ పొడవైందని డాక్టర్ ఘోష్ కొంత సవరించారు. సజ్జాద్ జహీర్ ఆ రెండు డ్రాఫ్టులను తిరిగి సవరించి, మిత్రులతో చర్చించి తుదిరూపం ఇచ్చారు. 1935 నవంబర్‌లో లండన్‌లోని డెన్మార్క్ స్ట్రీట్‌లో వున్న నాన్‌కింగ్ రెస్టారెంట్‌లో జరిగిన చారిత్రాత్మక సమావేశంలో భారతీయ అభ్యుదయ రచయితల సంఘం మేనిఫెస్టోను చదివి వినిపించారు. తర్వాత కొద్ది కాలానికే భారతదేశంలో సంచలనం మొదలయింది. 1936లో లక్నోలో మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షతన భారతీయ అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ సమావేశం జరిగింది. బెంగాల్, యు.పి. పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్, మద్రాస్ మొదలైన ప్రాంతాల నుండి రచయితలు ఆ సభలలో పాల్గొన్నారు.

1936 జూన్ 19-23 తేదీల మధ్య "International Association of Writers for the Defence of Culture" రెండవ సమావేశం లండన్‌లో జరిగింది. ఆ సభకు భారతీయ అభ్యుదయ రచయితల సంఘం పక్షాన సుప్రసిద్ధ బెంగాలీ రచయిత సుధీప్రధాన్ హాజరయ్యారు. రవీంద్రనాథ్ ఠాకూర్, శరత్ చంద్ర చటర్జీ, మున్షీ ప్రేమ్‌చంద్, పి.సి. రాయ్, జవహర్ లాల్ నెహ్రూ, ప్రమథ చౌధురి, రామానంద ఛటర్జీ, నందలాల్ బోస్ లండన్ సమావేశానికి భారతీయ రచయితల పక్షాన ఒక మేనిఫెస్టోపై సంతకాలు చేసి పంపారు.

అప్పటి నుండి భారతదేశంలో అభ్యుదయ రచయితల కార్యక్రమాలను నిశితంగా పరిశీలించటమేగాక, వారిలో వొకరై అభ్యుదయోద్యమాన్ని నడిపించడంలో కీలక పాత్ర వహించిన సుధీప్రధాన్ "Marxist Cultural Movement on India - Chronicles and Documents (1936-47)" అనే పేరిట రెండు సంపుటాలలో, అభ్యుదయ రచయితల కార్యకలాపాలను, అభివృద్ధిని, స్తబ్ధతను, ఇక్కట్టులను, పునర్వికాసాన్ని, నిర్వహించిన చైతన్యవంతమైన పాత్రను వివరించారు. భారతీయ సాహిత్య చరిత్రకు, సంస్కృతీ చరిత్రకు, దేశ చరిత్రకు కూడా మిక్కిలి ఉపయోగించే సంపుటాలివి. సమాజంలో మార్పునుకోరే ఆలోచనాపరు లందరూ యీ పుస్తకాలను విధిగా చదవాలి.

మొదటి సంపుటిలో ముల్కరాజ్ ఆనంద్, సజ్జాద్ జహీర్, సుధీ ప్రధాన్‌లు అభ్యుదయ రచయితల సంఘంతో వారి అనుబంధాన్ని వివరించిన వ్యాసాలున్నాయి. బెంగాల్‌లో అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భావ వికాసాలను గుర్చి ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ వ్యాసం మిక్కిలి ఆసక్తికరంగా వున్నది.

1943 మేలో బొంబాయిలో "The All India People's Theatre Conference జరిగింది. హీరేన్ ముఖర్జీ ఆ సదస్సుకు అధ్యక్షులు. Indian People's Theatre Association (IPTA) స్థాపింపబడింది. ఆ సదస్సు వివిధ రాష్ట్రాలలో సంఘం నిర్వహించవలసిన కార్యకలాపాలను నిర్దేశించింది. ఆంధ్రకు డా॥ రాజారావుగారిని, హైదరాబాద్‌కు మక్దూం మొహియుద్దీన్‌ను కార్యదర్శులుగా నియమించింది. "ప్రజానాట్యమండలి నిర్వహించిన ఉజ్వలమైన పాత్రను సుధీప్రధాన్ యీ సంపుటాలలో డాక్యుమెంట్లు, క్రానికిల్స్ సాక్ష్యాధారాలతో చక్కగా వివరించారు. ఆంధ్ర సాహిత్యము, కళలపై ఆసక్తిగలవారందరూ తప్పకుండా ఈ విషయాలను చదివి ముందుగా చరిత్రను సరిగా తెలుసుకోవాలి.

వివిధ రాష్ట్రాలలో అభ్యుదయ రచయితల సంఘాలు నిర్వహించిన చైతన్యవంతమైన కార్యక్రమాలను, ప్రజానాట్యమండలులు ప్రజలలో కలిగించిన రాజకీయ సాంస్కృతిక చైతన్యాన్ని యీ పుస్తకాలు వివరిస్తున్నాయి.

1943లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం శ్రీ తాపీ ధర్మారావు అధ్యక్షతన తెనాలిలో ప్రథమ సమావేశం జరుపుకున్నది. 1946 మే 11వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు నెల రోజులపాటు గుంటూరుజిల్లా పెదపాడులో అభ్యుదయ రచయితల సంఘం నిర్వహించిన సాహిత్య పాఠశాల చారిత్రాత్మకమైనది. దీనికి సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. దేవీప్రసాద్‌రాయ్ చౌదరి ప్రారంభోపన్యాసం చేశారు. శ్రీయుతులు పంచాగ్నుల, నిడదవోలు వెంకటరావు, కోదాడ రామకృష్ణయ్య, చిలుకూరి నారాయణరావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, మా. గోఖలే, కొండముది గోపాలరాయశర్మ, ఆయల సోమయాజుల నరసింహశర్మ, జమ్ములమడక మాధవ రామశర్మ, మద్దుకూరి చంద్రశేఖరరావు, యీ పాఠశాలలో ఉపన్యాసకులుగా వివిధ విషయాలను బోధించారు. ఇటువంటి పాఠశాల భారతదేశంలో మరెక్కడా ఇన్ని రోజుల పాటు, ఇందరు ప్రముఖులతో సమర్థవంతంగా సాగినట్లు లేదు. ఇది ఆంధ్రులకు గర్వకారణమే.

సాంస్కృతిక రంగంలో ఎప్పుడూ ఆంధ్రప్రదేశ్ ముందంజ వేస్తూనే ఉన్నది. బెంగాల్‌తో భుజం భుజం కలిపి ముందుకు నడుస్తున్నది. ఇటీవల విప్లవ రచయితల సంఘం, జనసాహితి కార్యకలాపాలు కూడా భారతదేశంలో ఏ ఇతర రాష్ట్ర కార్యకలాపాలకంటే మిన్నగా చెప్పదగినవి. ప్రజల హక్కులకై పోరాడటంలోనూ ఆంధ్రులు ముందువరుసలోనే వున్నారు. విప్లవ రచయితలు నిర్వహించిన, నిర్వహిస్తున్న సాహిత్య పాఠశాలలో, ముఖ్యంగా జననాట్యమండలి, జనసాహితి, అరుణోదయ, వంటి సాంస్కృతిక దళాలు చేస్తున్న సేవ మెచ్చదగినవి.

"జనసాహితి" వంటి సంస్థలు సాహిత్య పాఠశాలల్లో సుధీప్రధాన్ సేకరించి, అందించిన మార్క్సిస్టు సాంస్కృతికోద్యమ చరిత్రకు సంబంధించిన డాక్యుమెంట్లను, క్రానికల్స్‌ను శ్రద్ధగా అధ్యయనం చేసి, గత కాలంలో జరిగిన పొరపాట్లను తిరిగి జరగకుండ చూచుకోవడం ద్వారా, ఇంతకు మునుపటి వీరులు, సంస్కృతీ చైతన్యమూర్తులు అందించిన కాగడాను ముందుకు తీసుకుపోవటం ద్వారా విప్లవ జ్యోతిని ప్రజ్వరిల్లజేయవచ్చు.

విద్యాసంస్థల గ్రంథాలయాలలోను, పబ్లిక్ లైబ్రరీలు అన్నిటిలోను తప్పక వుండవలసిన పుస్తకాలివి. వీటిని తెప్పించటంలో కూడా సాహిత్యాభిమానులు చొరవ తీసుకోవాలి.

**'ప్రజాసాహితి' 1985 జూన్ సంచికను**
**ప్రజాకళారూపాల ప్రత్యేక సంచిక నుండి.**
**సుధీప్రదాన్ రాసిన ఈ సంపుటాలు రెండు**
**1982 నవంబరులో విడుదలయ్యాయి.**
**ఆఖరిదైన మూడవ సంపుటి 1985 జనవరిలో వెలువడింది.**
**ఈ మూడు సంపుటాలు**
**ప్రస్తుతం పుస్తకాల షాపుల్లో దొరుకుతున్నాయి.** ✦

## ప్రముఖ అనువాదకురాలు
# లలితా జోషి మరణం



**ప్రాచీ** ప్రచురణల ద్వారా అనేక పుస్తకాలను ప్రచురించిన పిపిసి జోషి సహచరి లలితా జోషి 24-4-22న హైదరాబాద్‌లో మరణించారు. ఆమె వయసు 75 సం॥లు.

ప్రాచీ పబ్లికేషన్స్‌ను నిర్వహించటంలోనూ, ఇతర భాషల పుస్తకాలను తెలుగులోకి అనువదించటంలోనూ ఆమె కృషిచేశారు. ఆమెకు ఇంగ్లీషు, హిందీ, రష్యా భాషలపై పట్టు వుంది. పిపిసి జోషి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్‌లకి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చూశారు. ఆయన 26-5-2019న అనారోగ్యంతో చనిపోయారు. లలితా జోషి కూడా ఆయన నిర్వహిస్తున్న బాధ్యతలలో భాగస్వాములయ్యారు. నేషనల్ బుక్ ట్రస్ట్‌లో వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించారు. మహిళల హక్కుల సాధన కోసం కృషిచేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలూ ఒక కుమారుడు ఉన్నారు. లలితా జోషి మరణానికి సంతాపం ప్రకటిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాం. ✦

వ్యాసం

# మతకలహాలూ, వాటి నివారణోపాయమూ

అనువాదం : నిర్మలానంద

- భగత్‌సింగ్

(1919లో జలియన్‌వాలా బాగ్‌లో నిరాయుధులయిన ప్రజానీకంపై అతిదారుణంగా హత్యాకాండ జరిపిన బ్రిటీష్ ప్రభుత్వం ఆ తర్వాత ఆ కాలంలో మతకలహాలనూ, ఘర్షణలనూ పనిగట్టుకొని ప్రోత్సహించింది. రెచ్చగొట్టింది. దీని ఫలితంగా 1924 సంవత్సరంలో కోహాట్ అనే చోట తీవ్రస్థాయిలో అమానుషంగా హిందూ-ముస్లిం ఘర్షణలు జరిగాయి. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లో మతకలహాల గురించి విస్తృతమయిన చర్చలు జరిగి ఇక మీదట అవి జరుగనీయకుండా చేయాలని అన్ని వర్గాలవారూ ఏకాభిప్రాయానికి వచ్చారు. జాతీయ కాంగ్రెస్ నాయకులు మాత్రం హిందూ-ముస్లిం మతతత్త్వ నాయకులను కూచోబెట్టి, ఒడంబడిక పత్రం మీద సంతకాలు పెట్టించి ఈ మత ఘర్షణ ఆపుచేయించే ప్రయత్నం చేశారు.

ఈ సమస్యకి విప్లవోద్యమ నాయకులు ఒక నిర్దుష్టమయిన పరిష్కారం సూచించారు. ఈ వ్యాసం ఈ సమస్యపై భగత్ సింగ్, అతని అనుచరుల అభిప్రాయాల సారం. 'కిరితీ' జూన్, 1927 సంచికలో ప్రచురింపబడింది. - సం॥)

నేటి భారతదేశ పరిస్థితి దైన్యంగా, హైన్యంగా వుంది. ఒక మతస్తుడు వేరొక మతస్తునికి బద్ధశత్రువు. రెండు వేర్వేరు మతాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం. మా మాట మీద మీకు నమ్మకం కలుగకపోతే, లాహోరులో జరిగిన తాజా మతకలహాలను మీరు వచ్చి చూడవచ్చు. ఏ విధంగా ముస్లింలు అమాయకులైన సిక్కుల్నీ, హిందువుల్నీ ఊచకోత కోసిందీ, అలాగే అవకాశం లభించినంత మేరకు సిక్కులు కూడా ముస్లింలను ఎలా తుడిచి పెట్టింది మీకు తెలుసు. ఈ నరుక్కోవడాలూ, వూచకోతలూ జరగడానికి కారణం – ఫలానా వ్యక్తి దోషి, నేరస్తుడు అయినందుకు కాదు. ఒక వ్యక్తి సిక్కుగాని, హిందువుగాని అయితే చాలు, ముస్లిం అతణ్ని చంపేస్తాడు. అలాగే ముస్లిం అయితే చాలు అతని ప్రాణాల్ని తోడెయ్యడానికి హిందువు సిద్ధం. దేశపరిస్థితి యిదే తీరున కొనసాగితే, దీన్ని ఆ దేవుడే కాపాడాలి.

ఈ పరిస్థితి గురించి ఆలోచిస్తుంటే భారతదేశ భవితవ్యం అంధకార బంధురంగా కనిపించక మానదు. ఈ మతాలు భారతదేశాన్ని నట్టేట ముంచి వేస్తాయి. ఈ మతకలహాల బెడద భారతదేశానికి ఎప్పుడు తప్పేదీ చెప్పడం కష్టం. ప్రపంచ దృష్టిలో భారతదేశం సిగ్గుతో తలవంచుకొనేలా ఇవి చేశాయి. ఈ మత దురహంకారపు ప్రవాహంలో అన్ని మతాలవారూ కొట్టుకుపోతున్నారు. స్థిమితంగా కూచొని ఆలోచించేవారు హిందువుల్లో, ముస్లిముల్లో, సిక్కుల్లో ఏ కొద్దిమందో వుంటారు. మిగతావారంతా తాము ఫలానా మతానికి వారసులమన్న దురహంకారంతో దాన్ని నిరూపించేందుకు చేతికందిన కర్రా, లాఠీ, కత్తీ, కటారూ తీసుకొని, తలలు తెగ నరుక్కున్నారు. మిగిలినవారిలో కొందరు ఉరికంబాలెక్కితే, మరికొందరు ఏళ్ల తరబడి కటకటాల వెనుక మగ్గుతున్నారు. ఇంత రక్తపాతం జరిగిన మీదట 'మత ఛాందసు'ల మీద బ్రిటీషు ప్రభుత్వం లాఠీలు నాట్యమాడాయి. అప్పటికిగాని వాళ్ళ మెదడుల్లో తొలుస్తున్న పురుగు సద్దుమణగ లేదు.

మేము పరిశీలించినంత మేరకు ఈ మతకలహాల వెనుక మతతత్త్వ నాయకుల, పత్రికాధిపతుల హస్తం స్పష్టంగా కనిపించింది. ఈ సందర్భంలో జాతీయ నాయకులు నిర్వహించిన పాత్ర గురించి మాట్లాడకపోతేనే మంచిదనిపిస్తోంది. భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చి తీరుతామని బీరాలు పలికే, 'సమాన జాతీయత', 'స్వరాజ్యం!, స్వరాజ్యం!' అంటూ గొంతుచించుకు అరచే ఈ నాయకమ్మన్యులు మొహం చాటుచేసుకొని, గుట్టుచప్పుడు గాకుండా యింట్లో కూచోడమో, అంధ విశ్వాసపు ప్రవాహంలో పడి కొట్టుకుపోవడమో చేస్తున్నారు. అలా కూచున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. మతతత్త్వ ఉద్యమంలో చేరినవారు వందల సంఖ్యలో వున్నారు. హృదయపూర్వకంగా అన్ని మతాల వారి శ్రేయస్సు కోరేవారు మాత్రం బహుస్వల్పంగా వున్నారు. ఈ మతతత్త్వమనే వరద బీభత్సానికి వారు సైతం అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. భారతదేశంలో జాతీయ నాయకత్వం దివాలా తీసిందా అనిపిస్తోంది.

మతకల్లోలాలను ఎగదోయడంలో ప్రత్యేక పాత్రని వహించిన రెండోవారు పత్రికల వారు.

దేశ రాజకీయాల్లో ఒకప్పుడు గణనీయమయిన పాత్ర నిర్వహించిన పత్రికారంగం ఈనాడు గబ్బుకంపు కొడుతోంది. వీరు పత్రికల్లో పతాక శీర్షికల్లో ఒక మతం వారిని రెచ్చగొట్టే వార్తలను ప్రచురించి, పరస్పరం మారణహోమం చేసుకోవడాన్ని ప్రేరేపిస్తున్నారు. స్థానిక వార్తాపత్రికల్లో ప్రచురించిన రెచ్చగొట్టే వ్యాసాలవల్ల, ఒక చోట కాదు, రెండు చోట్ల కాదు, ఎన్నో చోట్ల మతకల్లోలాలు చెలరేగాయి. ఈనాటి పరిస్థితిలో సంయమనంతో వుండే రచయితలను వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు.

పత్రికలవారు తమ బాధ్యత గుర్తించాలి. ప్రజలను చైతన్యపరచడం, సంకుచిత మనస్తత్వం నుంచి వారిని బయటపడెయ్యడం, మతతత్త్వ భావాలను వారి మనసుల నుంచి తొలగించి, వారి మధ్య పరస్పరం సుహృద్భావం పెంపొందించడం, భారతీయ జాతీయ జీవనస్రవంతిలో వారు భాగస్వామ్యం పంచుకొనేలా చేయడం చేయాలి కానీ పత్రికల వారు ప్రజల మధ్య అజ్ఞానం వ్యాపింపచేయడం, సంకుచిత మనస్తత్వాన్ని ప్రేరేపించడం, మతతత్వానికి ప్రోదిచెయ్యడం, కొట్లాటలను, ఘర్షణలను ప్రోత్సహించడం, జాతీయ జీవనస్రవంతిలో కలిసిపోవాలనే భావనని వ్యతిరేకించడం చేస్తున్నారు. అందుకే భారతావని నేటి పరిస్థితి గురించి ఆలోచిస్తూంటే కళ్ళ నుంచి రక్తాశ్రువులు జలజల రాల్తాయి. "భారతదేశ భవితవ్యం ఏమి కానున్నది?" అన్న ప్రశ్న మనసులోంచి దూసుకువస్తుంది.

సహాయ నిరాకరణోద్యమం కాలం నాటి ప్రజల ఉత్సాహమూ, ఉద్వేగమూ చూసిన వారికెవరికైనా ఈనాటి దేశ పరిస్థితిని చూస్తే దుఃఖం కలుగక మానదు. కళ్ళ ఎదుట కనిపించే నాటి స్వాతంత్ర్యం ప్రతిబింబమెక్కడ? స్వాతంత్ర్యం ఒక కలగా మారిన నేడెక్కడ? ఈ మతకలహాలవల్ల లబ్ధి పొందిన మూడో పక్షం వారు నిరంకుశ ప్రభుత్వ అధికారులు. తమ ఉనికి ప్రమాదంలో పడిపోయి, నేడో రేపో మూటాముల్లే కట్టెయ్యాలని నిర్ణయానికి వచ్చిన ఈ నిరంకుశ ప్రభుత్వాధికారుల వేళ్ళు ఈ మత కలహాల వల్ల ఎంతో లోతుగా వ్యాపించాయి. ఇప్పుడు వారిని కదపడం అంత సులువయిన పని కాదు.

ఈ మతఘర్షణల మూలాల్లోకి వెళ్ళి చూశామంటే వీటికి మూలకారణం ఆర్థికమని మనకి స్పష్టంగా తెలుస్తుంది. సహాయ నిరాకరణోద్యమకాలంలో రాజకీయ నాయకులూ, పత్రికాధిపతులూ ఎనలేని త్యాగాలు చేశారు. వారి ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నం అయిపోయింది. జాతీయోద్యమం చల్లబడటంతో ప్రజలకి నాయకులపై అవిశ్వాసం కలుగసాగింది. అందువల్ల ఈనాడు ఎక్కువమంది మతనాయకుల వ్యాపారం బాగా దెబ్బతిని పోయింది. ప్రపంచంలో ఏ పనిని చూసినా, దాని వెనుక జీవనోపాధి ప్రశ్న మనకి కనిపిస్తుంది. అందుకే కోటి విద్యలూ కూటి కొరకే అన్నారు. కార్ల్ మార్క్స్ చెప్పిన మూడు పెద్ద సిద్ధాంతాల్లో ఇది కూడా ఒక ముఖ్యమైన సిద్ధాంతమే. దీనివల్లనే మత ప్రచారం, శుద్ధి వంటివి చేసే సంస్థలు మొదలయినాయి. ఫలితంగా ఈనాడు వర్ణింపరాని దుర్దశలో మనం కొట్టుమిట్టాడుతున్నాం.

ఈ మతకలహాలకి ఒక్కటే పరిష్కారమార్గం. భారతదేశ ఆర్థికవ్యవస్థని మెరుగుపరచడం. సాధారణ భారతీయుని ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా తయారయిందంటే – ఒకరి చేతిలో ఒక పావలాకాసు వుంచి 'ఫలానావాణ్ణి నలుగురి మధ్యా పరువు తీసేయ్‌రా' అంటే అతను ఇట్టే ఆ పనిని చేసేస్తాడు. ఆకలితో నకనకలాడుతూ దుఃఖంలో వున్న వ్యక్తి ఏ సిద్ధాంతం జోలికీ పోడు. అవును. చావబోతున్నవాడు ఏమైనా చేస్తాడు.

కాని ప్రస్తుత పరిస్థితిలో ఆర్థిక సంస్కరణలు జరగడం చాలా కష్టం. కారణం – మనది విదేశీ ప్రభుత్వం, ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపర్చడం దానికి సుతరామూ ఇష్టం వుండదు. అందువల్ల ప్రజానీకం పనిగట్టుకొని ప్రభుత్వం వెంటపడాలి. దాన్ని మార్చివేసేదాకా నిద్రపోరాదు.

దేశ ప్రజలు పరస్పరం కలహించుకోకుండా నివారించేందుకు వర్గచైతన్యం ఎంతయినా అవసరం. అసలు శత్రువు పెట్టుబడిదారుడనీ, అందువల్ల వాడి ఎత్తుగడల నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలనీ, వాడు ఆడమన్నట్టుగా మీరు ఆడరాదనీ నిరుపేద శ్రామికులకూ, కర్షకులకూ మనం స్పష్టంగా నచ్చజెప్పాలి. వారు ఏ జాతికి చెందినవారైనా, ఏ రంగువారయినా, ఏ కులంవారయినా, ఏ జాతీయతకి చెందినవారయినా, ఏ దేశంవారయినా ప్రపంచంలోని పేదప్రజల హక్కులన్నీ ఒక్కటే. మతం, రంగు, కులం, జాతీయత, దేశం అనే తేడాలను చెరిపివేసి, ప్రపంచప్రజలు ఏకమై, ప్రభుత్వ యంత్రాంగాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అందులోనే వారికి మేలుంది. ఇలాంటి ప్రయత్నాలు చేయడం వల్ల వారికి పోయేదేమీ లేదు. ఏదో ఒక రోజున వారి చేతులకు వున్న సంకెళ్ళు తెగిపోతాయి. అప్పుడు వారికి ఆర్థికస్వాతంత్ర్యం లభిస్తుంది.

రష్యా చరిత్ర ఎరిగినవారికి, అక్కడ కూడా జార్ పరిపాలనలో మనదేశంలో ఈనాడున్న పరిస్థితులే వుండేవన్న విషయం తెలుస్తుంది. అక్కడ కూడా ఎన్నో జాతులుండేవి. అవి పరస్పరం కలహించుకొనేవి. కొట్లాడుకొనేవి. కాని ఆ దేశంలో శ్రామికవర్గ పరిపాలన అమలులోకి రాగానే, ఆ దేశ చిత్రపటమే పూర్తిగా మారిపోయింది. ఆ తర్వాత అక్కడ ఎన్నడూ మతకలహాలు జరుగలేదు. ఇప్పుడు ఆ దేశంలో అందర్నీ 'మానవులు'గా భావిస్తున్నారు. మతపరంగా గుర్తించడం లేదు. జార్ పరిపాలనలో అక్కడి ప్రజల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా వుండేది. అందువల్ల అన్ని మత ఘర్షణలు, కల్లోలాలు జరిగాయి. కాని ప్రస్తుతం రష్యన్ల ఆర్థిక పరిస్థితి బాగా మెరుగుపడింది. వారిలో వర్గచైతన్యం వెల్లివిరిసింది. ఫలితంగా ఈనాడు అక్కడ ఎలాంటి మతకలహాలూ జరిగినట్టు వార్తలు రావడంలేదు.

ఈ మతకలహాల గురించి వింటూంటే ఎంతో నిరాశ కలుగుతూ వుంటుంది. ఇటీవలే కలకత్తాలో జరిగిన మతకలహాల్లో ఒక మంచి పరిణామం ఏమిటంటే – ట్రేడ్ యూనియన్లలో పనిచేస్తున్న కార్మికులు ఎవరూ ఇందులో పాల్గొనలేదు. అంతే కాదు – పరస్పరం కలహించుకొనడం లేదు కూడా. కార్మికులైన హిందూ–ముస్లింలు ఎంతో ఆత్మీయంగా కార్ఖానాల్లోనూ బయటా కలిసిమెలిసి జీవిస్తున్నారు. మత కలహాలను ఆపడానికి, వారు శతధా ప్రయత్నిస్తున్నారు. కారణం– వారిలో వర్గ చైతన్యం వుంది. తమ వర్గ పునాది ఏమిటో వారికి బాగా తెలుసు. అందువల్ల **మతకలహాలను నివారించడానికి వర్గచైతన్యమే సరైన రాజమార్గం.**

మరొక మంచి వార్త – పరస్పరం కలహించుకోమనీ, ఒకర్నొకరు అసహ్యించుకోమనీ, మతాలంటే భారతీయ యువకులకు విసుగెత్తి పోయింది. వాటికి దూరంగా వుంటూ, భారతీయుల్ని వీడు హిందువు, వాడు ముస్లిం, ఇంకొకడు సిక్కు అని కాకుండా అందర్నీ ముందుగా మానవులని, ఆ తర్వాత భారతీయులనీ భావిస్తున్నారన్న విషయం ఆనందదాయకం. భారతీయ యువజనులలో వచ్చిన ఈ మార్పు గురించి విన్నాక ఈ దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎవరికైనా అనిపించకమానదు. అందువల్ల భారతీయులు ఈ మతకలహాలను

చూసి భయపడరాదు. వారి ప్రయోజనాల కోసం మతకలహాలను రెచ్చగొట్టే వాతావరణం లేకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం వుంది.

**1914-15 నాటి అమరవీరులు మతం నుంచి రాజకీయాన్ని వేరు చేశారు.** (వక్కాణింపు మాది – సం॥) మతం మనిషి వ్యక్తిగత విషయమనీ, అందులో మరొకరు జోక్యం చేసుకోరాదని చెప్పాలి. రాజకీయాల్లోకి మతం దూరరాదు. ఎందుకంటే ఇది స్థిమితంగా కలిసికట్టుగా ఒకచోట కూచుని పనిచేయనివ్వదు. గదర్‌పార్టీ వంటి ఉద్యమంలో అందరూ ఐక్యంగా, ఒకే మాట మీద నిలబడ్డారు. అధిక సంఖ్యలో సిక్కులు ఉరికంబాలెక్కారు. ఈ విషయంలో హిందువులూ, ముస్లిములూ ఏ మాత్రమూ వెనుకబడిపోలేదు.

ప్రస్తుతం కొంతమంది జాతీయ నాయకులు రంగంలోకి దిగి, మతాన్ని రాజకీయం నుంచి విడగొట్టాలని ప్రయత్నిస్తున్నారు. సంఘర్షణలు నివారించడానికి ఇది కూడా ఓ చక్కటి పద్ధతే. మేం దాన్ని పూర్తిగా సమర్థిస్తున్నాము.

మతాన్ని వేరుచేసిన పక్షంలో రాజకీయరంగంలో మనమంతా ఐక్యం కావచ్చు. మన మతాలు వేర్వేరుగా వున్నా ఫర్వాలేదు.

భారతదేశాన్ని నిజంగా అభిమానించేవారు మేము సూచించిన ఈ నివారణోపాయం గురించి తప్పక ఆలోచిస్తారనీ, ఆత్మహత్యా సదృశమయిన మార్గంలో పయనిస్తున్న ఈ దేశాన్ని రక్షించగలుగుతామని మేం అభిప్రాయపడుతున్నాం.

**జనసాహితి 1986 మార్చి 23న**
**'మా నెత్తురు వృథాకాదు' అనే భగత్‌సింగ్ రచనల సంకలనాన్ని నిర్మలానంద సంపాదకత్వంలో ప్రచురించింది.**
**ప్రస్తుత పరిస్థితులకు అద్దంపడుతున్న ఈ వ్యాసాన్ని 2018లో వచ్చిన ఈ పుస్తకం నాల్గవ ముద్రణ నుండి అందిస్తున్నాం.** ✦

కవిత

# అ'సమానతా'శిల్పం!

– సహచరి

అతను సమానతకు చిహ్నమంటే
నిజమేననుకున్నం....
దేవుణ్ణి మనిషే కనిపెట్టాడు
కనుక, మనిషే దేవుడన్నందుకు
మానవతామూర్తే అనుకున్నం....
భగవంతునికి భక్తునికీ
మధ్య స్వాములుంటారని వాళ్ళు
ద్వైతాద్వైతాల్లో జనం ఆకాంక్షల్ని
భక్తి పారవశ్యాల్లో ముంచెత్తుతారని
తెలుసు – కానీ,
'మనిషే దేవుడు', గుళ్ళూ గోపురాలో
విగ్రహాలు విగ్రహారాధన వద్దన్న బుద్ధుణ్ణి
మాయం చేయడానికి త్రి'దండి' దళాలు
పుట్టుకొచ్చాయని తెలియనోళ్ళం..
ఎవరైనా గుళ్ళోకెళ్ళొచ్చు దేవుణ్ణి
దర్శనం చేసుకోవచ్చన్న రామానుజులె
సమతాసందేశాన్ని నమ్మిన మాకోటేశులు
రాష్ట్ర పతులకైనా ఆలయప్రవేశం లేక
అంటరానోళ్ళగ గుడిబయటే జీయర్
స్వాములకు సాష్టాంగ పడుతుంటే....
కులాలుండాలంటే! ఎవడి పని వాడు
చెయ్యాలంటే! అన్న మీ సందేశం
బోధపడడానికి చార్వాక, లింగాయతులో
జ్యోతిరావుపూలేలు, కబీరులు, వేమన్నలు
అంబేద్కర్‌లు మనుస్మృతిని
తగలెడితే కాని అర్థం కాలేదు
మతం మత్తు వుందన్న మార్క్స్
రచనలు చదివితే గానీ మీ దోపిడి
అర్థం కానోళ్ళం....
అయినా! సమతామూర్తంటే...
'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' ముందు
పాలకులే బారులు తీరుతుంటే
చినజీయర్ కుట్రలెట్లా తెలుస్తయ్
మామూలోల్లం. మాంసంతినేటోళ్ళం!
కోళ్ళను తిని కోళ్ళలాగా..
గొర్రెల్లి తిని గొర్రెల్లా
మీ విగ్రహాల చుట్టూ తిరిగెటోళ్ళం..
ఆవుల్ని తింటూ గోమూత్రాలు తాగే
పూర్వాశ్రమ వారసత్వాన్ని కొనసాగించడానికే..
రెండొందల నలభై ఎకరాల భూమి
రెండొందల పదహారడుగుల నూట ఇరవై
కిలోల బంగారపు విగ్రహానికి వేల కోట్లు
ఎవరిచ్చారో? ఎందుకిచ్చారో
మాకెట్లా తెలుస్తుంది స్వామీ!
అడవి తల్లుల్ని ఆరాధించే
అడవి సందీటి మాది..
ఆత్మగౌరవానికి ఆదివాసీ బిడ్డల
భూపోరాటానికి ప్రతీకలైన
మా సమ్మక్క సారలమ్మలకు నిలువెత్తు
బంగారమైన మా కప్పం కట్టని పగిడి
గిద్ది రాజుల వారసత్వం మాది..
పద్నాలుగొందల కోట్ల ప్రజాధనం
ముచ్చింతల్లో కూడబెట్టుకుని
సందర్శన కోసం టికెట్లు పెట్టి
నూట ఎనిమిది గుళ్ళ చుట్టూ తిప్పే
మీ 'జ్ఞానం' ముందు.. తెలంగాణ
పోరుబిడ్డల్ని తలచుకోవడం
'వ్యాపారమే' కదా! జీయర్..
మా ఆత్మగౌరవాన్ని.. నూట ఎనిమిది సీట్ల
అడుగున పాతిపెట్టి అసమానతాశిల్పాన్ని
'భాగ్యనగరపు భాగమతి' చిన్నెంల
వారసత్వపు నిజాం గోల్కొండల
చరిత్రలను కనుమరుగు చేసి
అ'సమానత'ను చాటుతున్న మూడు కర్రల
పంగనామాల కథ తెలిసే రోజొకటి
వస్తుంది.. అసమానతను కూల్చడానికి! ✦

గల్పిక

# పిచ్చి పుల్లయ్యలం!!

- శంకరం

**వరండాలో** కూర్చుని పేపరు చదువుతున్నాను. ఉదయం పదిగంటలయ్యింది. ఇవాళ పేపరు ఆలస్యంగా వచ్చింది. లేకపోతే ఈపాటికి బజారు నుండి వస్తూ ఉండేవాడిని. ఇంటిముందు గేటు తీసిన చప్పుడై అటు తల తిప్పి చూసాను. పక్కవీధి పుల్లారావు దిగాలుగా లోనికి వస్తున్నాడు. తిరుణాళ్ళలో తప్పిపోయి వెర్రిచూపులు చూస్తున్న చిన్నపిల్లాడిలా వున్నాయి.

వచ్చీ రాంగానే "మావయ్యా అనకాపిల్లి వెళ్ళాలి, వేగం బయలుదేరు మావయ్యా" అన్నాడు.

"ఏంట్రా అంతర్జంటు పని?" అనడిగాను.

"అర్జంటే మావయ్యా, కలెక్ట్రాఫీసుకెళ్ళాలి" అన్నాడు.

అక్కడ నీకేంపనిరా?

"నీకు తెలుసుకదా దేముడుబాబు కల్లం మా కల్లం పక్కనే వుందని, మా కల్లంలోని మావిడిసెట్టు కొమ్మలు ఆడి కల్లంలో పడతన్నాయని అటేపు కాయలు ఆడు కోసీసుకుంటన్నాడు. అదేట్రా అనడిగితే నా జాగాలో వుంది నాకే దక్కుతాది, నీకంతిదిగా వుంటే నాకాసి వచ్చిన కొమ్మలన్నీ నరికీసుకో అంటన్నాడు. ఇదేవన్నా నాయంగా వుందా?"

"దానికి కలెక్టరాఫీసుకెళ్ళి ఏం జేస్తావురా?"

"అదేటి మావయ్యా అలాగంటావ్? అన్నాయాలు జరిగినోల్ల కాడనుండి దరకాస్తులు దీస్కోని ఆల్లకి నాయం జేత్తారట గదా. మరి నాకు ఆ ముచ్చట్లేవీ తెలవ్వు గదా. నువ్వొత్తే కరెస్టుగా పన్జేసిపెడతావని".

మా పుల్లారావుని ఊళ్ళో అందరూ పిచ్చి పుల్లయ్య అని పిలుస్తారు. 'నాడూ-నేడు'కి తేడా గుర్తించలేని అయోమయావస్థలో ఉంటాడు. స్వాతంత్ర్యం రాక పూర్వం పుట్టాల్సినవాడు ఇప్పుడు పుట్టేడు అని వేళాకోళం ఆడుతుంటారు.

అలా కాకపోతే సాక్షాత్తూ ఒక 'ఎస్పీ' నా భూమిని ఆక్రమించు కున్నారని ఒక పార్లమెంటు సభ్యునిపై పిర్యాదు చేయవలసి వచ్చిన దేశం మనది. రాజ్యాంగ పదవిలో రాజ్యాంగ రక్షకులుగా ఉంటామని ప్రమాణం చేసి, సర్వభక్షకులుగా వర్తించగల నాయకమ్మన్యులున్న దేశం మనది!

ఒక వర్గాన్ని మతం పేరుతో రెచ్చగొట్టి, దేశ అత్యున్నత న్యాయస్థానం ఎటువంటి కూల్చివేతలకూ పాల్పడరాదని హెచ్చరించినా, ధిక్కరించి, బుల్‌డోజర్లను నడిపించిన వ్యవస్థ మనది!

ఏరుదాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా ఎన్నికల తంతు ముగిసేవరకూ ఆగి, యుద్ధం పేరు చెప్పుకుంటూ పెట్రోలు, డీజిల్ ధరలను ప్రతిరోజూ పెంచుకుంటూ పోతూ, అరుచుకుంటారో, రోడ్లెక్కుతారో, తింటారో, తినరో మాకెందుకు అంటూ నీరో చక్రవర్తిలా ఫిడేలు వాయించుకుంటున్న విధ్వంసకారులు పాలిస్తున్న దేశం మనది!

బాబూ మా పంటలకు మద్దతు ధర లభించడంలేదు, సేద్యం గిట్టుబాటు కావడంలేదు, ఆత్మహత్యలు తప్ప మాకు మార్గం కనబడడం లేదు అంటూ నెలల తరబడి ఇల్లూ, వాకిలీ, భార్యా, పిల్లలను వదిలి వచ్చి ఎండకూ, చలికీ తట్టుకుంటూ క్షోభ పడుతుంటే ఆత్మహత్య చేసుకోవడం నేరమంటూ, వరి కుప్పలను ట్రాక్టర్లతో నూర్చినట్లు రైతుల పైకి మోటారు వాహనాలనెక్కించి యమపురికి పంపే యువరాజులకు బెయిల్ మంజూరు చేసి, స్వేచ్ఛను ప్రసాదించే వ్యవస్థ మనది!

ఈ నేలా, ఈ ఇసుకా, ఈ మట్టీ మన ప్రజలందరి ఉమ్మడి సొత్తు. ప్రభుత్వం నుండి సరైన అనుమతులు లేకుండా ఎవరినీ తవ్వనిచ్చేది లేదు – అంటూ అడ్డుపడుతున్న రెవెన్యూ అధికారులపై (వారు స్త్రీలైనా సరే) చేయి చేసుకోవడం, దుర్భాషలాడడం (ఇవన్నీ చిన్నవనుకొండి) వారిపైకి ట్రాక్టర్లను నడిపించడం గల సత్తా వున్న ప్రజాస్వామ్యం మనది!

ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వార్తలు రాసినా, రచనలు చేసినా, డాక్యుమెంటరీలు తీసినా 'ఉపా' వంటి చట్టాలను ప్రయోగిస్తున్నారు. వాస్తవాలను ప్రజలకు చెప్పినందుకుగాను వాస్తవాలను చెప్తున్నవారి వాస్తవ పరిస్థితిని లోకానికి తెలియకుండా చేయగల ఘనులున్న (దేశభక్తులున్న) పవిత్ర స్థలం మన భారతావని!

తమ భూమి కబ్జాకు గురయ్యిందో, తమ కుమార్తె అఘాయిత్యానికి గురయ్యిందనో పోలీసు స్టేషనుకు వెళ్ళి కేసు పెట్టమని చెప్పినవారిపై అక్రమ కేసులు బనాయించి ఊసలను లెక్కబెట్టించే రక్షకులున్న భద్రతానిలయం మన దేశం!

మీరు సమ్మెలు కడుతున్నారు, జీతాలు అడుగుతున్నారు, సౌకర్యాలు కోరుకుంటున్నారు కనుక మీరు రోజుకు నాలుగు పర్యాయాలు మీ కార్యాలయంలోనే వున్నట్టుగా హాజరీ చూపించగలిగితేనే నెలాఖరున మీ (అదృష్టం బాగుంటే) వేతనాలు చెల్లించేది అని ప్రజల సొమ్ముకు నిజమైన జవాబుదారులుగా నిలబడే నిజాయితీపరులు మాత్రమే గద్దెలపైనున్న పెద్ద జాతి మనది!

పాపం మా పిచ్చిపుల్లయ్యకు (సారీ) మా పుల్లారావుకు ఇవేమీ అంతుబట్టవు. మేకవన్నె పులులను గుర్తించలేడు. గోముఖ వ్యాఘ్రాలను గుర్తించలేడు. మేరా భారత్ మహాన్ అనే అనుకుంటాడు. అమృత మహోత్సవాలు జరుపుతున్నవారే నిజమైన దేశభక్తులనుకుంటాడు.

నిజానికి మా పుల్లారావు అదృష్టవంతుడనే చెప్పాలి. ఎందుకంటే లోకాన్నేలుతున్న మదమాత్సర్యాలు, స్వార్థం, కుట్రలు, కుతంత్రాలు ఏవీ అంటవు వాడికి. కానీ అన్నీ తెలిసిన కోట్లాదిమంది ప్రజల్ని వెర్రి వెంగళాయిలు చేసి ఆడిస్తున్నది నేటి కార్పొరేటు స్వామ్యం, నేటి ధనస్వామ్యం, నేటి ప్రజాస్వామ్యం! నా దృష్టిలో మనమందరం పుల్లారావులమే! పిచ్చి పుల్లయ్యలమే!! ✦

పుస్తక పరిచయం

# డిజిటల్ శ్రమ - కార్ల్‌మార్క్స్

సారాంశ సమర్పణ : జి.వి. భద్రం

- Christian Fuchs

*గతసంచిక తరువాయి..*

## నూతన సామ్రాజ్యవాదం యొక్క శ్రమవిభజన : భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో పని

భారతదేశంలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ, సాఫ్ట్‌వేర్ పార్కుల రూపంలో బెంగుళూరు, భువనేశ్వర్, పూణె, చెన్నై, హైదరాబాద్ పట్టణాలలో ప్రధానంగా నెలకొల్పబడింది. అనంతర కాలంలో ఈ పరిశ్రమ యితర పట్టణాలకు కూడా క్రమక్రమంగా వ్యాపిస్తోంది.

ప్రపంచమంతటా పొందే సమాచార సాంకేతికత వ్యాపార ప్రక్రియలన్నింటిలోనూ 58% పనులను భారతదేశం ఆకర్షించింది. కాల్ సెంటర్లు, మానవ వనరులు, ఫైనాన్స్, అకౌంటింగ్ సేవలను యీ పరిశ్రమ అందిస్తుంది. సమాచార సాంకేతిక సేవలను పాశ్చాత్య దేశాలకు అందించే పెద్ద దేశాలలో భారతదేశం రెండవ పెద్ద దేశం.

ఈ సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో ఉద్యోగులుగా ఉన్నత మధ్యతరగతి, మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చినవారే అధిక సంఖ్యలో వుంటారు. పేద కుటుంబాలవారికి యింజనీరింగ్ విద్య చదవగల స్థోమత లేకపోవటంతో, వారి నుండి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వుండటం అన్నది అరుదుగా వుంటుంది.

భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ సంస్థలు ప్రధానంగా తక్కువస్థాయి కోడింగ్, డిజైనింగ్, ఎగుమతి మార్కెట్టుకు పంపే సాఫ్ట్‌వేర్‌ను పరీక్షించటం లాంటి పనులను నిర్వహిస్తాయి. దేశీయ సాఫ్ట్‌వేర్ సంస్థలు ఎక్కువ క్లిష్టమయిన సాఫ్ట్‌వేర్ యింజనీరింగ్ పనులను చేపట్టి నిర్వహిస్తాయి. అయితే భారతదేశంలో చేపట్టే పనులు, వ్యాపారానికి, సాంకేతికంగా అంత అత్యాధునికమైనవీ, కీలకమైనవీ కావని పలువురు అమెరికన్ మేనేజర్ల అభిప్రాయం.

భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలలో నాలుగు విభిన్న రకాల దశలలో పనులు నిర్వహింపబడతాయి. అభివృద్ధి, మోడ్యూల్ లీడర్, ప్రాజెక్టులీడర్ లాంటి దశలు ఆ సంస్థల మొత్తం అవగాహన, పని నిర్వహణలో వుంటాయి. భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలు, తమ వద్ద పనిచేసే ఉద్యోగులు అన్ని పనులూ చేయాల్సిన పని విధానాన్ని అవలంభిస్తున్నాయి. ఈ సంస్థలలో అత్యంత నైపుణ్యం గల కార్యకలాపాలు, సాధారణంగా జరిపే కార్యక్రమాలు విడదీసి వుండవు. అందువలన ఈ కంపెనీలలో పనిచేసే ఉద్యోగులందరూ, యించుమించుగా అవగాహన (భావాలను) సంకేతపరచటం, వాటి నిర్వహణ పనులు రెండింటినీ చేస్తారు.

భారతదేశపు కంపెనీలు రెండు రూపాలలో పనులను నిర్వహిస్తున్నాయి. అందులో "బాడీ షాపింగ్" అనేది ఒక రకమైన పద్ధతి. ఈ పద్ధతిలో కంపెనీలు భారతీయ ప్రోగ్రామర్లకు వర్క్ వీసాలను సంపాదించి, వారిని అమెరికా లేదా యితర దేశాలకు తీసుకుపోయి, అక్కడి పని ప్రదేశాలలో పని చేయిస్తారు. ఈ బాడీషాపు కంపెనీలు, ఐ.టి. ఉద్యోగులను అసలు యజమాని తరఫున పనిని చేయిస్తాయి. అంటే ఉద్యోగులకు తాత్కాలిక వీసాలను తీసుకువస్తాయి. వారికి జీతభత్యాలు చెల్లిస్తాయి. వారికి కావలసిన బస తదితర వసతులు ఏర్పాటు చేస్తాయి. అందువలన యీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తాము ఎవరికి పనిచేస్తున్నారో, ఆ అసలు యజమానితో నేరుగా సంబంధం వుండదు. ఫలితంగా వీళ్ళని ఎప్పుడైనా రిట్రెంచ్ చేయవచ్చు. అందువలన వీరిని తీసుకువచ్చిన బాడీ షాపు కంపెనీ యీ ఉద్యోగులకు మరొకచోట ఉద్యోగం చూపించ వచ్చును. లేదా అందుకోసం వీరిని వేచి వుండేటట్టు (వెయిటింగ్) చేయవచ్చును. ఈ రకంగా 'బాడీషాపు' చేయబడ్డ భారతదేశపు ప్రోగ్రామర్లు, ఒకేరకమైన, సాపేక్షంగా తక్కువ వేతనం యిచ్చే గాడిద బరువు పనిగా పిలవబడే ప్రోగ్రామింగ్ పనిని చేస్తూ వుంటారు. ఈ ఉద్యోగులను అమెరికా తదితర దేశాలకు పంపించిన 'బాడీ షాపింగ్' కంపెనీలు, ఆ ఉద్యోగుల జీతంలో కొంత భాగాన్ని రుసుంగా తీసుకొంటాయి. ఇందువలన ఆ ఉద్యోగులకు తాత్కాలిక నియామకపు ఒప్పందాలు యివ్వబడతాయి. వీరు యితర ఉద్యోగాలు వెతుక్కోవటంపై నిషేధం విధింపబడుతుంది. వీరికి యిచ్చే పని నియామక పత్రాలు ఎక్కువగా వ్యక్తిపరం (ఏ ఉద్యోగికి ఆ ఉద్యోగిగానే)గా వుంటాయి. ఈ ఒప్పందాలు అస్పష్టంగానూ, అనిశ్చితంగానూ వుంటాయి. వీటివలన యీ ఉద్యోగులు ఏ పాశ్చాత్య కంపెనీకి పనిచేస్తున్నారో, ఆ కంపెనీ తన ఉద్యోగుల సంఖ్యను కుదించి, కత్తిరించవచ్చును. వీరిచేత, తమకు అవసరమయినప్పుడే పని చేయించుకొని, అవసరంలేనప్పుడు పని నుండి తీసివేయవచ్చును. ఆ రకంగా ఆ కంపెనీ తన ఖర్చులను తగ్గించుకోవచ్చును. శాశ్వత ఉద్యోగులకు చెల్లించినట్లుగా వీరికి సామాజిక భద్రత, రిటైర్మెంట్ సదుపాయం, హెల్త్ ఇన్సూరెన్స్, నిరుద్యోగ ఇన్సూరెన్స్ లాంటి వాటికి చెల్లించాల్సిన కాంట్రిబ్యూషన్‌లను (నెలవారీ చెల్లించాల్సిన మొత్తాలను) ఆ కంపెనీ చెల్లించకుండా మిగుల్చుకోవచ్చును. భారతదేశంలోని బాడీషాపింగ్ కంపెనీలు సాధారణంగా ఉద్యోగస్తుడికి యిచ్చే జీతంలో మూడింట రెండు వంతులు కాని, ఒక వంతు గానీ తమ రుసుంగా తీసుకొంటారు.

భారతదేశంలో సాఫ్ట్‌వేర్ రంగంలో నిర్వహింపబడే మరొక రకపు పనివిధానం 'వర్చువల్ మైగ్రేషన్' పని విధానం. ఈ విధానంలో ఉద్యోగులు యితర దేశాలకు వెళ్ళకుండా, మనదేశంలోనే వుండి పనిచేస్తారు. వీరుగా అమెరికా దేశంలోని కంపెనీలకు అవసరమైన పనిని చేసి

పెట్టవచ్చు. నేరుగా అమెరికా దేశంలో గల మైన్‌ఫ్రేం కంప్యూటర్లపైనా, సర్వర్లపైనా భారతదేశంలోనే కూర్చొని ఉద్యోగి పనిచేయవచ్చును. ఒక కేంద్ర పని ప్రదేశం అవసరం లేకుండా, తమకు యిచ్చిన పనిని, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కూర్చొని చేయవచ్చును. ఆ రకంగా ప్రపంచమంతటా రోజులోగల 24 గంటలపాటూ, ఉద్యోగులచేత వారి వారి దేశాల్లోని కాలానికి అనుగుణంగా పని చేయించుకోవచ్చును. ఇందువలన అమెరికా దేశంలోని కంపెనీలు అధికారిక లాభాలను పొందుతాయి. ఉదాహరణకు అమెరికాలో రాత్రి అయితే, మన దేశంలో తెల్లవారుఝాము అవుతుంది. అందువలన అమెరికాలో రాత్రి సమయానికల్లా, పరిష్కరించాల్సిన పనిని భారతదేశంలోకి పంపిస్తే, ఇక్కడి ఉద్యోగులు పగలంతా ఆ పనిని పూర్తిచేసి, తిరిగి అమెరికాలో తెల్లారేసరికి, దానిని అమెరికా కంపెనీలకు అందుబాటులో వుంచుతారు. ఇందువలన వారికి చాలా సమయం కలిసి వస్తుంది.

బాడీ షాపింగ్ పద్ధతి ద్వారా అమెరికా వెళ్ళి పనిచేసే పద్ధతిలోనైనా, లేక మనదేశంలోనే కూర్చొని చేసే వర్చ్యువల్ పద్ధతిలోనైనా, మనదేశపు సాఫ్ట్‌వేర్ యింజనీర్లకు యిచ్చే వేతనాలు మనకు కొంచెం ఎక్కువగా వున్నప్పటికీ, అమెరికాలో వున్న అదే పనిని చేసే ఉద్యోగులకు చెల్లించే వేతనాలలో మూడోవంతో లేదా ఐదోవంతు జీతంగానే వుంటుంది. అమెరికాలో ఇచ్చే జీతం భారతదేశంలో యిచ్చే జీతం కేవలం 9.6%గానే వుంటుందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. అందువల్లనే మనదేశం నుండి అనేకమంది సాఫ్ట్‌వేర్ యింజనీర్లు అమెరికా దేశానికి 'మేధోవలస' వెళ్తున్నారు. అమెరికా వెళ్ళిన సాఫ్ట్‌వేర్ యింజనీర్లయినా అక్కడ ఎక్కువ గంటలపాటు పనిచేయటం, ఓవర్‌టైం పనిచేసిన దానికి అదనపు చెల్లింపులు లేకపోవటం అన్న రూపంలో తీవ్రమయిన శ్రమదోపిడీకి గురవుతున్నారు.

భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ యింజనీర్ల పనిని అధ్యయనం చేసిన మీస్, వెర్లహోఫ్‌లు, వారి పని 'గృహిణీకరణ' చేయబడిందని నిర్వచించారు. వీరి పని యింటిలో గృహిణుల పని మాదిరి వుంటుందనీ, కాకపోతే వీరికి వేతనాలు చెల్లిస్తారని వారు వివరించారు. గృహిణులను యింటి పనికి కట్టిపడేసినట్లు వీరిని తమ పనికి కట్టిపడేసి వుంచుతున్నారని వీరు అభిప్రాయపడుతున్నారు. ఈ యింజనీర్లు యింట్లో పనిచేసే సేవకుల మాదిరి నిరంతరం అందుబాటులో వుండాలనీ, రకరకాల పనులకు మారి వాటిని చెయ్యాల్సి వుంటుందని, తమకుంటూ కావలసిన సమయం లేకుండా వీరు ఎక్కువ గంటలు పనుల్లోనే గడపాలనీ తెలియజేశారు. వీరు మామూలుగా అయితే వారానికి 40 గంటలే పనిచేయాల్సి వున్నా, వాస్తవంలో వారు చాలా అదనపు గంటలు, ఎటువంటి వేతన చెల్లింపు లేకుండా, రాత్రీ–పగలు అన్నది లేకుండా పనిచేస్తున్నారనీ శలవు రోజుల్లో పనిచేస్తున్నారనీ, పలు అధ్యయనాల్లో వెల్లడయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు కుటుంబ జీవితం గడపటానికి సమయం అన్నది లేకుండా స్వేచ్ఛగా వుండాల్సిన గంటల్లో కూడా పని చేయటం వలన, అంటే అతిగా పనిచేయటం వలన వీరు పని ఒత్తిడి, బాధ్యతలు, టెన్షన్లు, మానసిక ఒత్తిడి, ఆశాభంగాల్ని పొందుతున్నారనీ, ఉద్యోగానికి రాజీనామా చేద్దామనే నిర్ణయానికి వస్తారనీ, ఆఖరుకు ఆత్మహత్య చేసుకొందామని కూడా అనుకొంటారనీ, ఆ రకంగా వీరు ఆరోగ్య ప్రమాదాల నెదుర్కొంటున్నారనీ పలు అధ్యయనాల్లో వెల్లడయింది.

ఎక్కువ గంటలపాటు పని చేయవలసి వస్తుంది కనుక యీ ఉద్యోగులు తమ కంపెనీల్లోనే సామాజిక నెట్‌వర్కులు ఏర్పాటు చేసుకొంటారు. ఆఫీసు నుండి బయటికొస్తే తమ కుటుంబంతో తప్ప మరెవరితోనూ సామాజికంగా గడిపేందుకు సమయం వీరికి వుండదు.

పని ఒత్తిడి, లక్ష్యాన్ని చేరుకోవల్సిన కష్టతరమైన గడువులు వీరికి కుటుంబ సమతుల్య సమస్యలను తెచ్చిపెడతాయి. సాఫ్ట్‌వేర్ కంపెనీల యాజమాన్యం అవలంబించి, అనుసరించే ప్రక్రియలు, టీంవర్క్ చేయటం, పనులలో భాగస్వాములవటం, బాహాటమైన, పారదర్శకమైన పని సంస్కృతి, యాజమాన్యపు లక్ష్యాలను ఉద్యోగుల ద్వారానే అంతర్జాతీయీకరించటం, స్వయం క్రమశిక్షణ, తోటివారితో బృందం వలన కలిగే ఒత్తిడి, కార్పొరేట్ సంస్కృతి – కార్పొరేట్ తాత్త్వికత, సాంస్కృతిక శిక్షణాకార్యక్రమాలు లాంటివి యీ ఉద్యోగులపై తీవ్ర వత్తిడిని, ప్రభావాన్ని కలుగజేస్తాయి. ఇందువలన ఉద్యోగుల మధ్య తీవ్రమైన పోటీ పెరిగి ఉద్యోగులు ఎవరికివారే వ్యక్తివాదులుగా మార్చబడతారు. ఇదే సమయంలో యాజమాన్యం యీ ఉద్యోగులపై సకలాంశాలతో కూడిన సమగ్ర నిఘాను వుంచుతుంది. ఈ రకంగా కంపెనీ యాజమాన్యాలు ఉద్యోగులను వ్యక్తివాదులైనవారిగా, స్వయం నియంత్రిత, స్వయందర్శకవాదులుగా మార్చి వారి నుండి సాధ్యమైనంత ఎక్కువగా పనిని పిండుకొని, వీలైనంత ఎక్కువ లాభాలు గడిస్తాయి.

వీరికి ఉద్యోగ భద్రత కానీ, చట్టబద్ధమైన రక్షణ కానీ వుండవు. యూనియన్‌లు పెట్టుకొనే అవకాశం వుండదు. వీరు ఎవరికి వారు తాము కార్మికులంకామనీ, కార్మికులకన్నా ఎంతో ఉన్నతస్థాయిలో వున్న హోదా వున్న ఉద్యోగులమనీ భ్రమలు పెంచుకొని, ఐక్యంగా వుండి సంఘాలు పెట్టుకొనే ఆలోచనను, అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తారు.

తాము సామాన్యులకన్నా ఉన్నతులమనీ అందువలన తాము సామాన్యులకన్నా భిన్నంగా వుండాలి అని భ్రమపడుతూ, తమ ఆలోచనలను, ఆచరణనూ భిన్నంగా సాగిస్తారు.

ఈ రకంగా తమ ఉద్యోగులను మానసికంగా తన దోపిడీకి అనువుగా మలచుకొని, భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ రంగంలోని కంపెనీలు వారి శ్రమను బాహాటంగానే దోపిడీ చేస్తూ, సూపర్ లాభాలను గడించుకొంటున్నాయి.

## కలల ప్రపంచం సిలికాన్ వ్యాలీ – చుట్టుముట్టిన శ్రమ దోపిడీ యొక్క భయంకర పీడ కలలు

అమెరికా దేశంలోని కాలిఫోర్నియాలో శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి దక్షిణాన గల కొన్ని పట్టణాలను సిలికాన్ వ్యాలీ అంటారు. ఈ ప్రాంతంలో చాలా ఐ.టి., ఐ.సి.టి. పరిశ్రమలున్నాయి. ఇక్కడినుండే మొట్టమొదటిసారిగా ప్రపంచంలో అమ్మకానికి లభించే తొలి మైక్రో ప్రాసెసర్లను ఇంటెల్ కార్పొరేషన్ విడుదల చేసింది. మొట్టమొదటి మైక్రో కంప్యూటర్‌ను కూడా ఇక్కడే అభివృద్ధి చేశారు.

అంతర్యుద్ధకాలంలో అమెరికాదేశపు రక్షణశాఖ యొక్క పెట్టుబడులతో, యుద్ధావసరాల కోసం, అమెరికా దేశపు రక్షణ పరిశ్రమ ప్రయోజనాల కోసం, మైక్రోప్రాసెసర్ల, ట్రాన్సిస్టర్ల పరిశోధన, అభివృద్ధి కోసం సిలికాన్ వ్యాలీలో యీ పరిశ్రమను స్థాపించారు. సమాచార, సమాచార ప్రసార సాంకేతికతకు చెందిన 2000 కంపెనీలలోనూ, 21 అతిపెద్ద కంపెనీలు యీ సిలికాన్ వ్యాలీలో వున్నాయి.

2012లో ప్రపంచంలోని అతిపెద్ద హార్డ్‌వేర్ కంపెనీలకు వచ్చిన మొత్తం లాభంలో, 84.9% లాభాన్ని గడించిన కంపెనీలు యీ సిలికాన్ వ్యాలీలోనే వున్నాయి. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రారంభమయిన నాటినుండీ యీ సిలికాన్ వ్యాలీలోని సాఫ్ట్‌వేర్ – ఇంటర్నెట్ అవగాహనతో వున్న అన్ని పరిశ్రమలలోనూ ఉద్యోగ అవకాశాలు (ఉద్యోగిత) పెరగటం మొదలైంది. ఈ పరిశ్రమల్లోని ఉద్యోగుల వేతనాలు, అమెరికాలోని సగటు వేతన స్థాయికంటే (కంప్యూటర్ సంబంధిత సర్వీసుల్లోని ఉద్యోగుల కంటే) రెండు నుండి ఐదున్నర రెట్లు ఎక్కువగా పెరిగాయి. అంటే సిలికాన్ వ్యాలీలోని గూగుల్ కంపెనీలో పనిచేసే ఉద్యోగికి, అత్యధికంగా వేతనం లభిస్తుంది. దీనర్థం ఏమిటంటే, సంక్షోభకాలంలో సిలికాన్ వ్యాలీ సాఫ్ట్‌వేర్ పరిశ్రమ, విజేత అయిందన్నమాట.

సిలికాన్ వ్యాలీలోని సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్ పరిశ్రమలో మొత్తంగా చూసినప్పుడు అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగినా, లేఆఫ్‌లు కూడా ఎక్కువగానే జరిగాయి.

కంప్యూటర్, ఎలక్ట్రానిక్ రంగంలో పెరిగిన ఉద్యోగితలో ఎక్కువ భాగం సిలికాన్ వ్యాలీలోనే జరిగింది. సాఫ్ట్‌వేర్ రంగంలోని సాఫ్ట్‌వేర్ ప్రచురణ, ఇంటర్నెట్ ప్రచురణ, బ్రాడ్‌కాస్టింగ్ (ప్రసారం) సెర్చ్‌పోర్టల్సు, డేటా ప్రాసెసింగ్, కంప్యూటర్ సిస్టమ్స్ డిజైన్ తత్సంబంధిత సర్వీసులలో ఉద్యోగుల సంఖ్య పెరిగింది. మరోవైపు సిలికాన్ వ్యాలీలో రిటైల్ వ్యాపారం, ఆరోగ్య సంరక్షణ సహాయం, వసతి – ఆహారసేవల రంగాలలో కూడా ఉద్యోగిత (ఎంప్లాయ్‌మెంట్) పెరిగింది.

అమెరికా యొక్క మొత్తం సమాచార ఆర్థికవ్యవస్థలో సిలికాన్ వ్యాలీ యొక్క పాత్ర గణనీయంగా వుంది.

సాఫ్ట్‌వేర్ – ఇంటర్నెట్‌సేవలు, సాఫ్ట్‌వేర్ యింజనీరింగ్, ఐ.టి. – ఐ.సి.టి. పరిశ్రమల్లో, ఐ.సి.టి. (ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ) విలువను సృష్టించటంలో గణనీయమైన పాత్రను నిర్వహించే సిలికాన్ వ్యాలీలోని పరిశ్రమలో పని పరిస్థితులు ఎలా వున్నాయో చూద్దాం :

2002 నుండీ సిలికాన్ వ్యాలీలో ప్రమాణాలు లేని ఉద్యోగిత పెరుగుతూ వచ్చింది. అంటే తాత్కాలిక పనులు, పార్ట్‌టైం పనులు, ఔట్‌సోర్సింగ్ పనులు, కాంట్రాక్టు పనులు, ఒక ఉద్యోగి స్వయంవ్యాపారం చేసుకోవటంలాంటి ఉద్యోగాలు పెరిగిపోయాయి. ప్రొఫెషనల్సుగా వున్న మేనేజర్లకూ, తయారీ కార్మికులకూ మధ్య తీవ్రమైన వేతన అసమానత్వం ఏర్పడింది.

తయారీ రంగంలో పనిచేసే కార్మికుల్లో చాలామంది ఉద్యోగులు తాత్కాలిక ఉద్యోగులుగా, అస్థిరమూ – అనిశ్చితమూ అయిన పని పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. ఇందువలన వారు ఉద్యోగాలను పోగొట్టుకొనే అవకాశం ఎక్కువగా వుంది. దాంతో వారు నిరంతరం భయపడుతూ వుంటారు. ఈ భయం వలన వారు తమ సమస్యల గురించి చర్చించరు. దీనితో వారికి తమ పని పరిస్థితులు వేతనాలు మెరుగుదల కోసం బేరసారాలు ఆడగలిగే పరిస్థితి చాలా తక్కువగా వుంటుంది. తక్కువ నైపుణ్యం గల కార్మికులకు చాలా తక్కువ వేతనాలు వుంటాయి. అదేవిధంగా లేఆఫ్‌లు ఎక్కువగా వుంటాయి. ఈ పరిశ్రమలోని తయారీరంగ కార్మికులు యొక్క ఆరోగ్యం, పరిసరాలు, రసాయనాల వలన కలుషితం అవుతున్నట్లు పలు అధ్యయనాలలో బయల్పడింది.

వలస వచ్చినవారి కుటుంబాలవారు తమ యింటివద్ద చేసే పీస్‌వర్క్ పనిలో పాల్గొంటారు. వీరు యీ సాంకేతిక పరిశ్రమకు చెందిన విషపూరిత పదార్థాలతో కూడిన విడిభాగాలను శుభ్రపరుస్తారు. ఈ పీస్‌వర్క్ పనులు ప్రత్యేకించి, ప్రింటెడ్ సర్క్యూట్ కూర్పు, కేబుల్ కూర్పు పనులకు సంబంధించిన పనిగా వుంటుంది. పీస్‌వర్కు పద్ధతిపై పనిచేయటం వలన, యీ కూర్పు పనిచేసేవారిపై ఒత్తిడిని పెంచుతుంది. ఎందుకంటే వీరికి గంటకు యింత అనే పద్ధతిపై వేతనం నిర్ణయింపబడదు. అందువలన వీరు ఎంత వేగంగా పనిచేసి, ఎన్ని వస్తువులను కూర్పు చేయగలిగితే అంత వేతనం వస్తుంది. వీరు వేగంగా పనిచేసి ఎక్కువ వస్తువులను తయారు చేయలేకపోతే వీరికి బ్రతకటానికి సరిపడినంత సంపాదన రాదు. అందువలన సిలికాన్ వ్యాలీలోని తయారీ పనిని కుటుంబాలకు కుటుంబాలే తమ పిల్లలతోసహా చేస్తారు. తయారీ రంగంలోని పరిస్థితి యీ రకంగా వుంటే, ఇక మేధోశక్తి – జ్ఞానం ఎక్కువగా అవసరమైన సాఫ్ట్‌వేర్ రంగంలోని ఉద్యోగుల పని పరిస్థితి ఎలా వుంటుందో, గూగుల్ కంపెనీలోని పని పరిస్థితులు చూస్తే అర్థమవుతుంది.

కంప్యూటర్ సర్వీసులు అందించే ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలలో గూగుల్ రెండవది. పరిశ్రమలోని సగటు వేతనాలకన్నా గూగుల్ కంపెనీ తన ఉద్యోగులకు కొంచెం తక్కువగా చెల్లిస్తుంది. గూగుల్ కంపెనీలో ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయాలి. అందువలన వీరికి ఉద్యోగం – జీవితం మధ్య సమతుల్యమనేది చాలా తక్కువగా వుంటుంది.

గూగుల్ తన ఉద్యోగులకు ఉచిత భోజనం, ఉచిత ఆటల సదుపాయం, రెస్టారెంట్లు, కేఫ్‌లు, ఈవెంట్ల లాంటి సదుపాయాలు కలుగజేసి టెక్–టాక్స్ (సాంకేతిక విషయాలను గురించిన ఉపన్యాసాలు) ఏర్పాటుచేసింది. ఉద్యోగులను ఎక్కువ సమయం పనిలో వుండి పనిచేసేందుకు ప్రోత్సహిస్తుంది. గూగుల్ యాజమాన్యమైతే ఎక్కువ పనిగంటలు పనిచేయమని నేరుగా ఉద్యోగులను శాసించదు కానీ, చాకచక్యంగా తన యొక్క కంపెనీ సంస్కృతిలో తోటివారితో పోటీపడాల్సిన వాతావరణాన్ని కల్పిస్తుంది. అందువలన ఉద్యోగులు తమ పనిసమయం కన్నా రెట్టింపు గంటల పనిని, తమ ప్రాజెక్టులు పూర్తిచేయటం కోసం చేస్తారు.

ఇక వేతనాల విషయానికి వస్తే ఉద్యోగులలో ఎవరికివారికే వ్యక్తిగతంగా వేతనాలను నిర్ణయించే పద్ధతిని అవలంబిస్తోంది. అందువలన ఉద్యోగులు తమ వేతనాల కోసం సమష్టిగా బేరసారాలు

చేయటం కుదరని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి ఉద్యోగులకు ప్రాజెక్టు పనిభారం మీద ప్రధాన పనిసమయంతోపాటు, అవసరం మేరకు పనిసమయాలను మార్చి పని చేయాల్సిన విధంగా పనిసమయం నిర్ణయింపబడుతుంది. అందువలన ఎక్కువ కంపెనీల్లో యీ ఉద్యోగులు అదనపు పనిగంటలు పని చేస్తారు. కానీ వీటిలో చాలా కంపెనీలు అందుకు అదనపు వేతనాన్ని చెల్లించవు. ప్రాజెక్టు పనిలో ఎక్కువ పనిభారం యిమిడి వుండటం వలన పనిసమయాన్ని అందుకు వీలుగా మార్చగలిగే ఆ రకమైన విధానం మంచిదేనన్నట్లు, అనివార్యం అన్నట్లు ఉద్యోగులు భావిస్తారు.

గూగుల్‌తోపాటు యూరోపియన్ దేశాలలోని డిజిటల్ మీడియా ఉద్యోగులైన 'డిజిటల్ విషయ సృష్టికర్తలు', ప్రోగ్రామర్లు, డిజైనర్లు, ఆర్టిస్టులు, ప్రాజెక్టు మేనేజర్ల పని పరిస్థితులపై జరిపిన అధ్యయనాల్లో "డిజిటల్ మీడియా పరిశ్రమలోని పని ఎటువంటి ఒత్తిడులు లేకుండా తీరిగ్గా, సడలింపులతో, విభిన్నమైన, సృజనాత్మమైన, సమానత్వంతో కూడినదై, అధికారక్రమం (నిచ్చెనమెట్ల అధికారుల క్రమం) లేనిదై వుంటుంది" అనే విషయం కేవలం కట్టుకథే.

ఈ రంగంలో పనిచేసే ఫ్రీలాన్సర్లు అయితే, సగటు వేతనంకన్నా తక్కువ సంపాదిస్తూ ఎక్కువ గంటలపాటు పనిచేస్తూ, అత్యంత ఉద్యోగ అభద్రతతో పనిచేస్తూ వుంటారు. వీరు కొంతకాలంపాటు ముమ్మరంగా ఎక్కువ పనిచేస్తే, చాలా కాలంపాటు పని లేకుండా వుంటారు. దానితో వీరు కుటుంబాన్ని, పిల్లలనీ, తమ కెరియర్‌ని (ఉద్యోగంతో) సమన్వయం చేసుకోలేకపోతున్నారు. యీ రకం ఉద్యోగులలో చాలామందికి పిల్లలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఫ్రీలాన్సర్ ఉద్యోగులు శెలవలు తీసుకోరు. వీరిలో చాలామందికి పెన్షన్లు కానీ, నిరుద్యోగ ఇన్సూరెన్స్‌లు కానీ రావు.

డిజిటల్ మీడియా ఉద్యోగులలో మహిళలు కూడా వున్నారు. అయితే వీరికి పురుషులకన్నా తక్కువ వేతనం చెల్లిస్తారు. మహిళలు ఐ.సి.టి. ప్రొఫెషనల్స్‌లో తక్కువస్థాయి ఉద్యోగులుగా పనిచేస్తూ, ప్రక్రియల మార్పుకు చెందిన పనుల్లో ఏ రకమయిన ప్రాబల్యం లేకుండా వుంటారు. అభివృద్ధి ప్రాజెక్టులలో మహిళల సంఖ్య చాలా తక్కువగా నామమాత్రంగా వుంది.

న్యూయార్కు నగరంలోని డిజిటల్ మీడియా ఉద్యోగులపై జరిపిన ఒక అధ్యయనంలో ఒక కీలకమైన పార్శ్వం బయటపడింది.

"వీరి పనిలో, వీరికి వేతనమిచ్చి పనిచేయించుకొనే సమయంలో, యీ ఉద్యోగులు స్వేచ్ఛగా చేసుకొనే ఆలోచనలను, ఉత్సాహ – ఉద్రేకాలను యజమానులు గుర్తించి వాటి జాబితాను తయారుచేసుకొంటారు. సృజనాత్మక భావాలు, సేవలు, పరిష్కారాలు మొదలైనవాటిలో వ్యాపారం చేసే కంపెనీలలో కార్మికులు తమ పని సమయంలో ఏం చేసినా ఏం ఆలోచించినా ఏం చెప్పినా అది వారి పారిశ్రామిక మిల్లులకు ఆడించే ధాన్యమే అవుతుంది. పనికీ విశ్రాంతికీ మధ్య సరిహద్దులన్నవే లేవు. ఉద్యోగం అన్నదే మిగతా అన్ని విషయాలకూ ఆధారభూత వ్యవస్థ అయిపోతుంది."

గూగుల్‌లో వెల్లడైన పని విధానం ప్రత్యేక లక్షణాలు కలిగివున్న ఒక నమూనా పని విధానంగా వుంది. ఇక్కడ ఒక ప్రత్యేకమైన పని సంస్కృతి, పని పట్ల ప్రత్యేకమైన అభిప్రాయాలు నెలకొల్పబడ్డాయి. స్వతంత్రత అన్న పేరుతో "పారదర్శకమైన, సహకారపూర్వకమైన, స్వయందర్శకత్వంలో పనిని చేయటం" అనే అవగాహనను ఉద్యోగులు తలకెక్కించుకొన్న పని సంస్కృతి నెలకొల్పబడింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఉద్యోగి తమ తనువూ, మనసూ, జ్ఞానం, జీవితం, సర్వస్వం పనికే అంకితం చెయ్యాలనుకునే పని సంస్కృతి ఉద్యోగుల మనస్సుకు ఎక్కించేశారు. ఎంత పని ఒత్తిడి వున్నా పనిభారం వున్నా ప్రశాంతంగా (కూల్‌గా) పనిచేయమని గూగుల్ తన ఉద్యోగులకు నిరంతరం ప్రబోధిస్తుంది. అదే పని సంస్కృతి అని వారిని ఒప్పిస్తుంది.

"ఎటువంటి ఓవర్‌టైం చెల్లింపులు లేకుండా వారానికి 85 గంటలు పనిచేయటం" అనే మత్తు ఎక్కించిన యీ పరిశ్రమ తమ ఉద్యోగుల భౌతిక శ్రమను చాకచక్యంగా దోచుకొంటోంది. మరో అంశమేమిటంటే, తన కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కంపెనీలో షేర్లు యివ్వటం అనే ఎరను చూపించి, వారిలో తమ స్టాక్ పెట్టుబడులపై తామే ఎక్కువగా పనిచేసి లాభాలు వచ్చేటట్టు పాటుపడాలి అనే అపభ్రమలోకి ఉద్యోగులను పని సంస్కృతి రూపంలో నెట్టివేశారు. ఆ రకంగా వీరంతా "మానసిక బానిసత్వం"లోకి యిరికింపబడ్డారు.

గూగుల్‌లో పనిచేసే వారందరూ పెద్ద జీతాలు లభించేవారు కాదు. గూగుల్‌కు పుస్తకాలను స్కానింగ్ చేసి, డేటాను ఎంట్రీ చేసే ఉద్యోగులున్నారు. వీరిలో చాలామంది తెల్లజాతివారు కాని రంగు జాతీయులే. వీరికి యితర గూగుల్ ఉద్యోగులకు లభించే ప్రత్యేక సదుపాయాలు, సౌకర్యాలు లేవు. మొత్తం వారానికి 168 గంటల సమయం వుంటే, వీరు వారానికి 130 గంటలు పని చేస్తూ వుంటారు. ఈ రకంగా వారానికి 130 గంటలు పనిచేయటం కోసం వారు తమ స్వంత పనులను ఎన్నింటినో కుదించుకోవాల్సి వస్తుంది.


గూగుల్ యాజమాన్యం తన ఉద్యోగులపై మృదువైన సామాజిక బలవంతాన్ని ప్రయోగిస్తుంది. ప్రాజెక్టు ఆధారిత పని పేరిట, ఉద్యోగులు అనివార్యంగానే ఓవర్‌టైం వేతనం లేకుండా పనిచేయాల్సి వస్తుంది. ఈ పని సంస్కృతిలో సహోద్యోగుల మధ్య ఒత్తిడి, పోటీ, ఉద్యోగులతో మమేకమవ్వటం (పనిచేయటంపైననే ధ్యాస) లాంటివాటికి గురవుతారు.

గూగుల్‌లో పనిచేసే ఉద్యోగులు అందరికన్నా ఎక్కువ వేతనాలు పొందుతూనే, అత్యంతమైన ఒత్తిడికి గురవుతూ, అత్యధికమైన అదనపు విలువను సృష్టిస్తున్నారు. వీరు తమకు లభించే అధిక వేతనాలరీత్యా కులీన (సంపన్న) కార్మికులవుతున్నారు. అందువలన వీరి దృక్పథంలో మార్పు జరిగి, వీరు దోపిడీ పెట్టుబడిదారీవర్గాలకు ఏజెంట్లుగా మారుతున్నారు.

ఈ రకంగా సిలికాన్ వ్యాలీ కొందరికి కలలప్రపంచం కాగా, అదే పరిశ్రమలోని తయారీరంగ కార్మికులకు పీడకలలు తెప్పించే మృత్యులోయగా పరిణమించి వారిని నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేస్తూ, వేధిస్తోంది.

(వచ్చే సంచికలో : **కాల్‌సెంటర్ పని – కత్తిరించి, కుదింపబడిన, గృహిణీకరింపబడిన సేవల శ్రమ....**) ✦

## జాతీయ అక్షరయోధులు



# కైఫీ ఆజ్మీ

(1919 - 2002)

## 4

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# కమ్యూనిస్టు కైఫీ

**ఉర్దూ సాహిత్యవేత్త సామ్యవాద ఆజ్మీ కైఫీ**
**స్వతంత్ర భారత రుగ్మతల రూపు మాఫీ**
**మరణించాక కూడా తనతోనే ఉండాలని**
**కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వ కార్డుతో సెల్ఫీ**

**"అసహనంతో ఊగిపోతున్న యువతని పిలవండి ముందు/**
**అణచివేతకు గురైన రైతాంగాన్ని కుదపండి ఒక్క కుదుపు/**
**చక్కగా పరిచివుంచండి ఆకాశాల్ని నేలతల్లి గుండెల మీద/**
**ఇటువైపు సాగిపోయే విముక్తి సేనకోసం!"**
**అంటూ అక్షరాన్ని అగ్నికణం చేసి సంధించిన కైఫీఆజ్మీ**
**ప్రసిద్ధ భారతీయ ఉర్దూ కవి. అసలుపేరు అథర్ హుస్సేన్ రిజ్వి.**

ఇరవయ్యో శతాబ్దపు అత్యంత ప్రసిద్ధ ముషాయిరా సమావేశాలలో పాల్గొన్న ప్రముఖుడు. భారతీయ సినిమాకు ఉర్దూ సాహిత్య పరిమళాన్ని అందించిన ప్రముఖుడు. రంగస్థల, సినిమా నటి ఇప్టా నాయకురాలు షౌకత్ ఆజ్మీ వీరిభార్య. ప్రముఖ నటి షబనాఆజ్మీ, ప్రసిద్ధ ఫోటోగ్రాఫర్ బాబాఆజ్మీ వీరి సంతానం. కోడలు తన్వీ ఆజ్మీ కూడా సినిమా నటి.

హైస్కూలు చదువు విడిచిపెట్టి 1942నాటి క్విట్ ఇండియా ఉద్యమంలోకి దూకారు. విద్యార్థిగా అభ్యుదయ కథాసంకలనం 'అంగారే' చదివి ఉత్తేజితులయ్యారు. దానిని బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది. 1943లో కైఫీ భారతకమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం పొందారు.

ఇప్టాకి అఖిలభారత అధ్యక్షునిగా పనిచేశారు.అరసంలో క్రియాశీల సభ్యునిగా కృషి చేశారు. తన కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వకార్డును ఎప్పుడూ తనతోనే ఉంచుకుంటూ చనిపోయిన తరువాత తన శవంతో పాటు ఖననం చేయమని కోరిన కమ్యూనిస్టు ప్రేమికుడు.

సమాజంలో వెనుకబడినవర్గాలపట్ల సానుభూతి, ఆయన కవిత్వలక్షణమైంది. సామాన్య మానవుడిని కవితావస్తువుగా స్వీకరించి, సమాజంలో మౌలిక మార్పులను ఆకాంక్షిస్తూ మతతత్వాన్ని, మతోన్మాదాన్ని, నిరసిస్తూ శ్రామికజనం కోసం, స్త్రీల హక్కుల కోసం గొప్ప రచనలు చేశారు. సమకాలిక ప్రజా ఉద్యమాలపై స్పందించారు.

'ఝంకార్'(1943) వీరి తొలి కవితాసంపుటి.'ఆఖిరి-ఎ-షబ్', 'సర్మాయా', 'ఆవారా సాజ్దే', 'కైఫీయత్', 'నయీ గులిస్థాన్' మరికొన్ని కవితాసంపుటాలు. 'బ్లిట్జ్' పత్రికలో రాసిన చైతన్య వ్యాసాలు 'మేరీ ఆవాజ్ సునో'శీర్షికతో గ్రంథరూపం సంతరించుకున్నాయి.

1951 'బుజ్దిల్' చిత్రంతో సినిమారంగంలోకి ప్రవేశించి 'యహూదీకి బేటి, పర్వీన్, మిస్ పంజాబ్ మెయిల్, ఈద్‌కాచాంద్, కాగజ్‌కెఫూల్, హకీకత్' చిత్రాలకు పనిచేశారు. చేతన్‌ఆనంద్ 'హీర్ రాంజాహ్'కి సంభాషణలను కవితారూపంలో రాసి ప్రయోగం చేశారు. ఇంకా 'మంథన్, గరంహవా, పాకీజా, బావార్చి, అర్థ్' చిత్రాలలో వీరి వన్నీ వాణిముత్యాలే.

సాహిత్య అకాడమీ అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు, జాతీయ చలనచిత్ర అవార్డులు అందుకున్నారు.

1919 జనవరి,14న ఉత్తరప్రదేశ్ అజంఘర్‌జిల్లా మిజ్వాన్‌లోజన్మించిన కైఫీఆజ్మీ. 2002 మే, 10న అనారోగ్యంతో ముంబై నుండి స్వగ్రామం వెళ్లి అక్కడే కన్ను మూశారు. ✦

వ్యాసం

# యుద్ధం ఒక సాంస్కృతిక విపత్తు



కొత్తపల్లి రవిబాబు

**ఐదు కోట్ల మంది ప్రపంచ ప్రజానీకాన్ని బలిగొన్న రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఇక ప్రపంచ యుద్ధం ఉండదంటూ అగ్రరాజ్యాలు శాంతి వచనాలు ఎన్ని పలికినా ఏదో ఒక మూల దురాక్రమణ యుద్ధాలు జరగని రోజు లేదు. యుద్ధోన్మాదంలో అమెరికాది మొట్టమొదటి స్థానం అన్నది జగమెరిగిన సత్యం. సోవియట్ యూనియన్ కూలిపోయి 15 స్వతంత్ర రాజ్యాలుగా మారిన తర్వాత, ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిపోయింది అని ప్రపంచం భావించిన తర్వాత కూడా అమెరికా తన దురాక్రమణ యుద్ధాలు ఆపలేదు. తాను నిర్మించిన సైనిక స్థావరాలలో ముఖ్యమైనదయిన నాటో కూటమిని రద్దు పరచనూ లేదు, సరి కదా దానిలో కొత్త రాజ్యాలని చేర్చుకుంటూ, రష్యా సరిహద్దు దేశమైన ఉక్రెయిన్‌కు విస్తరించి రష్యా చుట్టూ తన మిలటరీ అగడ్తను నిర్మించనుంది. తద్వారా దాన్ని మిలటరీ రీత్యా కట్టడి చేయాలనే దుర్మార్గ ప్రయత్నం చేస్తూ ఉంది.**

**రష్యా దేశం జర్మనీ ఫ్రాన్స్ దేశాలలోకి విస్తరించుకుంటున్న తన ఆయిల్ మరియు గ్యాస్ మార్కెట్‌ను నిరోధించటానికి అమెరికా పడుతున్న ఆర్థిక పోటీ యొక్క రాజకీయ కొనసాగింపుగా కూడా ఈ యుద్ధం జరుగుతోంది. అందుకు ఉక్రెయిన్ దేశాన్ని తన పావుగానో తుపాకీ మందుగానో అమెరికా వాడుకుంటోంది. రష్యాను ఏకైక నేరస్తురాలుగా చేస్తోంది. ఇది అగ్రరాజ్యాల నడుమ ఆర్థిక రాజకీయ యుద్ధమే అయినా నలిగిపోతున్నది సామాన్య ప్రజానీకం. సాగుతున్నది వారి సాంస్కృతిక జీవన విధ్వంసం. ఒడ్డున ఉండి ఉక్రెయిన్ను ఎగదోస్తూ ఉన్నది అమెరికా, దాని నాటో కూటమిలోని మిత్రదేశాలు.**

**25-4-2022 నాటి స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (SIPRI) ప్రకారం 2021 సంవత్సరానికి మొత్తం ప్రపంచంలో 162 లక్షల కోట్ల రూపాయల్ని రక్షణ బడ్జెట్ కు వినియోగించగా అందులో అమెరికా వాటా 38 శాతం. చైనా, ఇండియా, రష్యా, ఇంగ్లాండ్ దేశాల మొత్తం వాటా 24%. రానున్న మేడే సందర్భంగా ప్రపంచ కార్మిక వర్గం యుద్ధానికి వ్యతిరేకంగా, పెరిగిపోతున్న రక్షణ బడ్జెట్ లకు వ్యతిరేకంగా సమస్త శాంతికాముకులకు నాయకత్వం వహిస్తూ నిరసన ప్రకటించాల్సిన అవసరం ఉంది.**

**- సం॥**

**గత** 55 రోజులుగా రష్యా తన పొరుగు దేశమైన ఉక్రెయిన్‌పై జరుపుతున్న యుద్ధం ఫలితంగా లక్షలాదిమంది ప్రజలు తమ వూర్లు విడచి ప్రాణాలు రక్షించుకోడానికి శరణార్థులుగా ఇరుగుపొరుగు దేశాలకు వలసబోతున్నారు. అక్కడ సాధారణ జీవితం అల్లకల్లోలమైంది. మరికొందరు భూగర్భ నివాసాలలో బిక్కుబిక్కుమని బతుకుతున్నారు. యుద్ధం ఒక కల్లోలాన్ని సృష్టించింది. ప్రజలను అతలాకుతలం చేస్తోంది.

సోవియట్ యూనియన్‌లోని దేశాలు విడిపోయిన క్రమంలో 1991లో ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా ఒక రిఫరెండమ్ ఫలితంగా ప్రకటించుకుంది. దానిని చరిత్రకారులు ‘ఒక నాగరికమైన విడాకులు’గా పేర్కొన్నారు. 1922 నుండి 1991 వరకు సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ యూనియన్‌లో వున్న 15 రాష్ట్రాలలో ఇదొకటి. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీని ఓడించడంలో ఉక్రేనియన్లు కీలకపాత్ర వహించారు. సోవియట్ యూనియన్లో వ్యవసాయానికి కేంద్ర బిందువుగా వుండేది. ఉక్రేనియన్ల భాష, ఫ్రెంచి, పర్షియన్‌ల భాషల తర్వాత సుందరమైనదిగా గుర్తింపు పొందింది. అది ఇటాలియన్ భాష తర్వాత మృదుమధురమైన భాష. ఇక్కడ వున్న చెర్నోబిల్ అణువిద్యుత్ కేంద్రం 26 ఏప్రిల్ 1986లో పేలిన సందర్భంగా ఎంతో విధ్వంసం జరిగింది. ప్రస్తుతం యూరప్ ఖండంలో ఉక్రెయిన్ అతిపెద్ద దేశం. అతిచిన్న వయసు గల దేశం. సాంస్కృతికంగా యునెస్కో ఈ దేశంలో ఏడు ప్రపంచ వారసత్వ స్థలాలకు గుర్తింపునిచ్చింది.

సోవియట్ యూనియన్ ఏర్పడక ముందు అంటే 1922 ముందు ఉక్రెయిన్ ఒక దేశమే కాదు కనుక ఈనాడు పుతిన్ ఒక సార్వభౌమత్వం గల దేశంగా ఉక్రెయిన్‌ని మాత్రం గుర్తించడంలేదు. కాని ఉక్రెయిన్ ప్రజలు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడంలో నిమగ్నులై వున్నారు. తమ అస్తిత్వానికి సంబంధించిన భాష, సంస్కృతి, కళ, సంగీతం మొదలైన అంశాలలో తమదైన ప్రత్యేకత ప్రదర్శిస్తున్నారు. తమ దేశంలో వున్న గ్రంథాలయాలను, మ్యూజియంలను, చిత్రకళాప్రదర్శనశాలలను, వాటిలో వున్న అపురూపమైన శిల్పాలను, చిత్రాలను యుద్ధం సృష్టించే విధ్వంసం నుంచి కాపాడుకుంటూ తమ అస్తిత్వానికి ఋజువు చూపిస్తున్నారు.

రష్యన్ సైన్యం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ను ఆక్రమించే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో ఇవాంకివ్ (Ivankiv) పట్టణంలోని ఒక చరిత్ర మ్యూజియంను ధ్వంసం చేసింది. దీనిలో వున్న ప్రసిద్ధ జానపద, ప్రజాచిత్రకారిణి మరియా ప్రిమచెంకో చిత్రించిన 25 ప్రసిద్ధ చిత్రాలు తగలబడిపోయాయి. ఆమె చిత్రించిన “రెండు తలల కోడిపిల్ల” చిత్రాన్ని ప్రసిద్ధ స్పానిష్ చిత్రకారుడు పాబ్లో పికాసో ప్రశంసించారు. అయితే వాటిలో కొన్నిటిని స్థానికుడొకరు తగలబడకుండా రక్షించారు.

మరియా స్థానిక పురాణగాథలు, జానపదగాథల ఆధారంగా చిత్రాలను వేశారు. ఆమె పెయింటింగ్‌లోనూ, ఎంబ్రాయిడరీలోనూ, పింగాణీ సామానుపై చిత్రించడంలోనూ కృషిచేశారు. 650దాకా వున్న ఈ చిత్రాలను కీవ్‌లో వున్న జాతీయ జానపద అలంకరణ కళాప్రదర్శనశాలలో (National Folk Decorative Art Museum)లో పెట్టారు. మరియా 1909–1997 మధ్య జీవించారు. ఆమె వేసిన చిత్రాలలో ముఖ్యమైనవి : 'బ్లాక్ మంకీ', 'ఫెయిరీ బర్డ్ – పీకాక్', 'షెపర్డ్స్', 'బ్ల్యూ లయన్', 'ఎ హౌస్ ఇన్ శాడ్‌నెస్' మొదలగునవి. ఆమె చిత్రించిన కొన్ని చిత్రాలను ఉక్రెయిన్ తపాలా బిళ్ళలుగా విడుదల చేసింది. ఆమెకు 1966లో దేశంలోని అత్యున్నత సాంస్కృతిక బహుమతి – షెలీచెంకో జాతీయ బహుమతిని ఇచ్చారు. యునెస్కో 2009వ సంవత్సరాన్ని ప్రిమచెంకో సంవత్సరంగా ప్రకటించింది.

ఉక్రెయిన్‌కు పశ్చిమాన గల చారిత్రక నగరమైన ల్వివ్ (Lviv) నగరం యునెస్కో గుర్తించిన ప్రపంచ వారసత్వ సంపదలో ఒకటి. 7 లక్షల మంది జనాభా గల నగరం అది. ఈ నగరంలో గల విగ్రహాలను ఫోమ్‌తోనూ, అగ్ని నిరోధక పదార్థాలతోనూ చుట్టేస్తున్నారు. మార్కెట్ స్క్వేర్‌లో వున్న రోమన్ సముద్ర దేవుడు నెప్ట్యూన్ విగ్రహం చుట్టూ దట్టమైన ప్లాస్టిక్ షీట్లు అమర్చారు. ఇక్కడ వున్న ఆండ్రీ షెప్టీట్‌స్కీ జాతీయ మ్యూజియంలో వున్న అరుదైన వ్రాత ప్రతులను, పాత పుస్తకాలను అట్టపెట్టెల్లో సర్దేశారు. ఎథ్నోగ్రఫీ మ్యూజియం కిటికీలను మెటల్ ప్లేట్లతో మూసివేశారు. చారిత్రక కట్టడాల పరిరక్షణ సంస్థ నాయకుడు ఆండ్రీ సల్యూక్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమమంతా సాగుతోంది. అంతర్జాతీయ మ్యూజియంల సంస్థ సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ చర్యలలో పాల్గొనమని ఉక్రెయిన్ ప్రజలకు పిలుపునిచ్చింది. జె.పాల్‌గెట్టీ ట్రస్టు (ప్రపంచ కళాసంస్థ) వారు ఇవాంకిల్ మ్యూజియంలోని జానపద కళాచిత్రాలను దహనం చేయడాన్ని ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు.

ఉక్రెయిన్‌లో వున్న వేలాది మ్యూజియంలలో ఉక్రైన్ మరియు రష్యన్ చిత్రకారుల పెయింటింగ్స్, కళాఖండాలు వున్నాయి. ప్రసిద్ధ చిత్రకారులు గియొవన్ని బెల్లిని, ఫ్రాన్సిస్కో గోయా జాక్విస్ లూయా దేవిడ్‌ల చిత్రాలున్నాయి. 2014లో కీవ్ నగరంలో ప్రారంభించిన మ్యూజియం ఆఫ్ ఫ్రీడంలో 4000 చిత్రాలున్నాయి. ఒడెస్సాలో 1899లో స్థాపించిన ఒడెస్సా – జాతీయ లలితకళల మ్యూజియంలో 10వేల కళాఖండాలు, చిత్రాలు, స్మారక చిహ్నాలు – 16వ శతాబ్దం నాటి వాటితో కలిపి వున్నాయి.

ఖార్కివ్ (Kharkiv) నగరంలో ఎన్నో మ్యూజియంలు, కెథిడ్రల్స్, చారిత్రక ప్రదేశాలు వున్నాయి. ఈ నగరానికి చెందిన కళాకారుడు, శిల్పి పావ్లావ్ మీకావ్ రూపొందించిన Foundation of Exhaustion శిల్పం కీవ్ నగరంలో వుంది. 72 రాగి రేకులను పిరమిడ్ రూపంలో అమర్చి, వాటి నుండి నీరు బయటకు రావడానికి ప్రయత్నిస్తున్నట్లు తయరుచేసిన ఈ కళాఖండం అలసట (Exhaustion)కు ప్రతీకగా వుంది. ఇటలీలోని వెనిస్ నగరంలో ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే 59 ద్వైవార్షిక ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడానికి దీనిని కీవ్ నుండి ఆస్ట్రియాకు తరలించారు. రష్యా దాడిని ప్రారంభించిన రెండవరోజే మరియా లాంకో, ఆమె బృందం ఈ శిల్పంలోని 72 భాగాలను తన కారులో కీవ్ నుండి దాటించేశారు. ఒక వారంపాటు వివిధ నగరాలు దాటి అవి ఆస్ట్రియా చేరాయి. దీనిని రూపొందించిన శిల్పి పావ్లావ్ మకావ్ తన వెబ్‌సైట్‌లో కళాఖండాలను అమ్ముతూ, ఆ వచ్చిన డబ్బును ఉక్రెయిన్‌కు కావాల్సిన ఆయుధాల కొనుగోలు కోసం నిధిని సేకరిస్తున్నాడు. 63 ఏళ్ళ మకావ్ మార్చి 2న తన భార్యతోనూ, మరో ఇద్దరు మహిళా కుటుంబ స్నేహితులతోనూ, 92 ఏళ్ళ తల్లితోనూ క్షిపణి దాడుల మధ్య ఖార్కివ్ వదలి, వెనిస్‌కు ప్రయాణమై వెళ్ళారు. రష్యన్ సరిహద్దుల్లో వున్న ఈ పట్టణంలోని ఆర్ట్ మ్యూజియంలోనివన్నీ పెట్టెల్లో సర్దేసి సురక్షితమైన ప్రదేశానికి తరలించారు. చిత్రమేమిటంటే ఈ మ్యూజియంలోని అత్యధిక చిత్రాలు రష్యన్ చిత్రకారులవే! దీనిలో 25 వేల చిత్రాలున్నాయి. కొసమెరుపు ఏమిటంటే, "ఇది విధి కల్పించిన ఒక విచిత్రం! మేము రష్యన్ల దాడి నుంచి రష్యన్ చిత్రకారుల కళాఖండాలను రక్షించడం" అని ఖార్కివ్ ఆర్ట్ మ్యూజియం నిర్వాహకులైన మర్యానా ఫిలటోవా ప్రకటించాడు!

ఇంతేగాక, ఉక్రెయిన్‌లో నాలుగు ప్రాంతాల్లో గల 20 మ్యూజియంలలోని వస్తువులను కట్టకట్టి జాగ్రత్త చేయడానికి కావాల్సిన ఆర్థిక సహాయం అందించడానికి ఒక 'అత్యవసర కళానిధి' ఒకటి ఏర్పడింది. దీని ద్వారా వారు ఒక ఖండాలను రక్షించడమేగాక, కళాకారులు తమ సృజనాత్మక కృషి కొనసాగడానికి తగు ఏర్పాట్లు చేసారు.

'గార్డియన్' పత్రిక ఇచ్చిన సమాచారం ప్రకారం Vinnytsia, Zhytomys, Sumy, Chernihivలో వున్న నాలుగు మ్యూజియంలను రక్షించడానికి తగు చర్యలు తీసుకున్నారు. Vinnytsiaలోని మ్యూజియంలో స్థానికంగా విస్థాపనకు గురైన ప్రజలు వుంటున్నారు. వీటిపై దాడి కానీ, లూటీ కాని జరగలేదు. కాని కీవ్ నగరంలో వున్న Babynyar Holo Caust Memorial భవనం రష్యన్ బాంబుదాడుల్లో ధ్వంసమైంది. 1941లో నాజీలు 33 వేలమంది యూదు జాతీయులను ఊచకోత కోసిన సంఘటనకు జ్ఞాపక చిహ్నంగా ఏర్పాటుచేసిన భవనం ఇది. మార్చి 17వ తేదీన మరియుపోల్ నాటకరంగ స్థలం (Theatre) శిధిలాలుగా మారింది. దీని నేలమాళిగలో వందలాది శరణార్థులు నివసిస్తున్నారు. తూర్పు ఉక్రెయిన్‌లో వున్న 1526 నాటి అతి ప్రాచీన మఠం (Monastery) బాంబుదాడుల్లో బాగా దెబ్బతింది.

రెండవ ప్రపంచయుద్ధ సమయంలో పోలెండ్‌లోని సాంస్కృతిక కేంద్రాలపై నాజీ జర్మనీ, ఆ తర్వాత సోవియట్ ఆక్రమణదారులచే ఉద్దేశపూర్వకమైన దాడులు జరిగాయి. అంతేగాని అవి యుద్ధ సమయంలో అప్రయత్నంగా జరిపిన దాడులు కాదు. పోలెండ్ అనే దేశానికి అస్తిత్వం లేదని ఋజువు చేయడానికి చేసిన దాడులు. ఐతే ఇప్పుడు ఉక్రెయిన్‌కు పొరుగు దేశమైన పోలెండ్‌లో "ఉక్రెయిన్‌లోని మ్యూజియంలకు సహాయమందించే కమిటీ" ఒకటి ఏర్పడి ఉక్రెయిన్ సాంస్కృతిక సంపద పరిరక్షణకు కృషిచేస్తోంది. పుతిన్ కూడా ఇప్పుడు ఉక్రెయిన్ ఒక దేశం కాదు – దానికెటువంటి అస్తిత్వం లేదని ఋజువు చేయడానికి ఈ దేశపు సాంస్కృతిక వారసత్వపు జాడలను ఈ విధంగా తుడిచివేయడానికి సాహసిస్తున్నాడు.

ఉక్రెయిన్ చారిత్రక జాతీయ మ్యూజియం – రెండవ ప్రపంచ యుద్ధపు సాంస్కృతిక వారసత్వ చిహ్నం – కీవ్ పట్టణానికి దక్షిణపు సరిహద్దుల్లో వుంది. దానిలోని అపురూపమైనవాటన్నిటినీ ఆ భవనపు నేలమాళిగలోకి తరలించారు.

మ్యూజియంలలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు లేవు. వారిని ఆదుకోడానికి "మ్యూజియం సంక్షోభ కేంద్రం" ప్రారంభమై ఇప్పటికి 8 ప్రాంతాల్లో వున్న 30 మ్యూజియంలలో పనిచేస్తున్న 200 మందికి సహాయం అందించింది. 'అత్యవసర కళానిధి' దేశంలోనూ, విదేశాలలోనూ ఉన్న ఉక్రెయిన్ కళాకారులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది.

ఇప్పటికే రష్యా ఉక్రెయిన్‌లోని ఈ క్రింది వాటి భవనాలను ధ్వంసం చేసింది. 1. మరియుపాల్ (Mariupal)లో వున్న కుంజ్డి ఆర్ట్ మ్యూజియం. 2. చెర్నిహివ్ (Chernihiv)లోని గోథిక్ రివైవల్ గ్రంథాలయం 3. కీవ్‌లోని మూకుమ్మడి హత్యల జ్ఞాపక భవనాలు 4. ఉక్రెయిన్ రచయితలు, కళాకారుల కోసం నిర్మించిన ఖార్కివ్‌లోని స్లోవ్ అపార్ట్‌మెంట్. 5. ఇవాంకిల్‌లోని స్థానిక చరిత్ర మ్యూజియం, వీటిలోని చారిత్రక వస్తువులను, చిత్రాలను మ్యూజియం అధికారులు ముందే జాగ్రత్తపడి రక్షించారు.

ఉక్రెయిన్‌లోని కీవ్ (Kyiv) 30 మ్యూజియంలతో దేశ రాజధాని నగరమేకాక సాంస్కృతిక రాజధానిగా గుర్తింపు పొందింది. బ్లాక్‌సీకి సంబంధించిన ఓడరేవు గల పట్టణం ఒడెసా (Odesa)లో తూర్పు, పశ్చిమదేశాల చిత్రకళా మ్యూజియం, ఒడెసా లలితకళల మ్యూజియం వున్నాయి. పోలెండ్ సరిహద్దుకు 50 మైళ్ళ దూరంలోని లీవ్ (Lyiv) నగరం 13వ శతాబ్దంనాటిది. పోలెండ్ రాజ్యంలో వుండేది. దీనిని 1998లో యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది.

సాంస్కృతిక కేంద్రాల విధ్వంసం గురించి 1954 నాటి హేగ్ ఒప్పందం ఇలా ప్రకటించింది. "ఏ దేశ ప్రజలకు సంబంధించిన సాంస్కృతిక ఆస్తులను నష్టపరచడం అంటే మొత్తం మానవజాతి సాంస్కృతిక వారసత్వాన్ని ధ్వంసం చేయడమే".

ఉక్రెయిన్‌కు చెందిన కుడ్య చిత్రాల నిపుణుడు వ్లాడిమర్ మంజోస్, వీధుల్లోని గోడలపై చిత్రాలు వేయడం ఆపివేసి, తన చిత్రాలు కీవ్‌లోని తన స్టూడియోలో వదిలేసి, తన ప్రసిద్ధ చిత్రాల NFTలు (Non Fungible Tokens) అమ్మగా వచ్చిన డబ్బును సైన్యానికి పంపిస్తున్నాడు. ఇతర చిత్రకారులు కూడా ఈయన పద్ధతిని అనుసరిస్తున్నారు. "మా అస్తిత్వం ధ్వంసమైన భవనాలలోనూ, చిత్రాలలోనూ లేదు. అది మాలో అంతర్గతంగా వుంది. కనుక ధ్వంసం చేసినదంతా పునః సృష్టి చేస్తాం" అని ఈ కళాకారులు ప్రకటించారు. SUCHO (Saving Ukraine's Cultural Heritage Online) అనే సంస్థ కంప్యూటర్లలో వున్న చిత్రాలను బయటకు తీసి వెబ్‌సైట్లలో వుంచుతోంది. సర్వర్లు ఉక్రెయిన్‌లో ఎక్కువ వున్నాయి కనుక వాటిని ధ్వంసం చేయవచ్చునని రష్యా తలుస్తోంది. భౌతికంగా కళాకృతులను కాపాడలేకపోయినా, వాటి డిజిటల్ ప్రతులను కాపాడటం లక్ష్యంగా కృషిచేస్తున్న SUCHO సంస్థ కార్యక్రమాలను సహాయం చేయడానికి 1000 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.

ఉక్రెయిన్‌పైన రష్యా దాడి చేస్తోంది గనుక ఉక్రెయిన్‌కు సంఘీభావం ప్రకటిస్తూ యూరప్ దేశాలలో వున్న రష్యన్ కళాకారులనూ, సంగీతకారులనూ, చలనచిత్ర రంగానికి చెందినవారిని ఆయా దేశాల్లో జరిగే పోటీల నుండి, ప్రదర్శల నిండి బహిష్కరిస్తున్నారు. కాన్స్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో రష్యన్ బృందానికి అవకాశం ఇవ్వడంలేదని ప్రకటించారు. పుతిన్ దాడిని తప్పుపడుతూ, విమర్శిస్తున్న రష్యాలోనే వున్న రష్యన్లు, చలనచిత్రరంగానికి చెందినవారు ప్రశంస లందుకుంటున్నారు. యూరోపియన్ ఫిల్మ్ అవార్డు కమిటీ కూడా రష్యాను దూరంగా వుంచింది.

గతంలో రష్యాలో కనిపించే 'యుద్ధం వద్దు' (No War) పోస్టర్లన్నిటినీ పుతిన్ ప్రభుత్వం తొలగించింది. బోల్షోయ్ థియేటర్‌కు కళాదర్శకునిగా వున్న వ్లాడిమర్ యురిన్, గతంలో పుతిన్‌ను సమర్థించేవారు. ఆయనకు 'రష్యా ప్రజాకళాకారుడు' (People's Artists of Russia) అనే గౌరవ బిరుదు కూడా వుంది. అయితే ఉక్రెయిన్‌పై చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ప్రకటనలో ఈయన కూడా సంతకం పెట్టారు. "శత్రుత్వాలను ఆపి, అందరూ చర్చలకుపక్రమించాలి" అనేది ఆ ప్రకటన. వెనిస్‌లో జరిగే ద్వైవార్షిక కళాప్రదర్శనకు సంబంధించిన రష్యన్ కళాకారులు, మ్యూజియం సంరక్షకులు (Curators) యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా చేశారు. ఈ ప్రదర్శన నిర్వాహకులు రష్యన్ ప్రాతినిధ్యాన్ని నిషేధించారు.

జర్మన్ పియానో విద్వాంసుడు లార్స్ వోగ్ట్ (Lars Vogt) "ఈ యుద్ధ నేరస్తుడు (పుతిన్) అధికారంలో వున్నంతకాలం – నేను ఆ దేశంలో కచేరీలు చేయను" అని ప్రకటించారు. ఈ ఒగ్ట్ రష్యా అభిమాని. ఫిబ్రవరి 28న ప్రసిద్ధ ఎస్టోనియన్ సంగీత కచేరీ కండక్టర్ పావో జార్వి (Paavo Jarvi) మాస్కోలో రష్యన్ యూత్ ఆర్కెస్ట్రాతో కలసి కచేరి నిర్వహించారు. ఈ కచేరిని రద్దుచేసి, రష్యా వదలి వెళ్ళమని మిత్రులు సలహా ఇవ్వగా, "అలా వెళ్ళిపోవడం – పరాజయంలా వుంటుందనీ, యువసంగీతకారులను అగౌరవించినట్లవుతుందనీ, అవిశ్వాసపరంగా వుంటుందనీ – నేనూ యుద్ధ వ్యతిరేకినే – ప్రభుత్వపు అనాగరిక చర్యలకు యువత బలికారాద"నీ ప్రకటించారు.

పుతిన్ ప్రభుత్వాన్ని తప్పుపడుతూ యూరోపియన్ ఫిల్మ్ అకాడమీ (EFA) రష్యన్ చిత్రాలను బహిష్కరిస్తూ, పుతిన్ ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని విరమించమని కోరింది.

యుద్ధం ప్రారంభమైన 5వ రోజున రష్యన్ పాప్‌స్టార్ సెర్గీ లజరెవ్ ఉక్రెయిన్‌పై దాడిని తీవ్రంగా విమర్శించాడు. చాలామంది రష్యన్ నటులు యుద్ధంపట్ల వ్యతిరేకత వహించగా, కొందరు మౌనం వహించారు. న్యూయార్క్ నగరంలోని మెట్రో పాలిటన్ ఒపేరా వారు పుతిన్‌ను సమర్థించే కళాకారులతో తెగదెంపులు చేసుకుంటామని ప్రకటించారు.

1990ల నుంచీ పుతిన్ మిత్రుడైన సంగీత కచేరీల కండక్టర్, 69 ఏళ్ళ వేలరీ గెర్గీవ్‌ను యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రకటన ఇవ్వమని అడగ్గా ఆయన మౌనం వహించారు. దానితో ఆయన స్థానంలో వేరే కండక్టర్‌ను పెట్టుకొని కచేరీలు సాగాయి. పుతిన్‌ను సమర్థిస్తున్న పియానో కళాకారుడు డెనిస్ మాత్స్‌వోవ్ కచేరీ కూడా రద్దయింది. మ్యూనిచ్ ఫిలో హార్మోనిక్ కచేరీలో ప్రధాన కండక్టర్‌గా వున్న గెర్గీవ్‌కు అంతిమ హెచ్చరిక చేస్తూ, పుతిన్‌ను సమర్థించినట్లయితే ఆ కచేరీ

నుండి తొలగిస్తామని మూనిచ్ మేయర్ డయటర్ రేటర్ ఫిబ్రవరి 28న ప్రకటించాడు. ఇటువంటి హెచ్చరికే గెర్గీవ్‌కు మిలాన్‌లోని లెజండరీ ఒపేరా హౌస్ లాస్కాలా యాజమాన్యం చేసి మార్చి 5 కచేరీని రద్దు చేస్తానని చెప్పింది. నెదర్‌లాండ్‌లోని రాటెన్‌డామ్ ఫిలో హార్మోనిక్ ఆర్కెస్ట్రాకు గెర్గీవ్ గౌరవ కండక్టర్‌గా వున్నారు. కాని పుతిన్‌ను సమర్థిస్తున్నందుకు ఆయన సంగీత ఉత్సవాన్ని, కచేరీని రద్దు చేసింది. నేరాలు చేస్తున్న పాలనను సమర్థిస్తున్నందున గెర్గీవ్‌కు సుదీర్ఘకాలంగా ఏజెంటుగా పనిచేస్తున్న మార్కస్ ఫెల్సనర్ (Felsner) అతని బృందం నుండి గెర్గీవ్‌ను తొలగించాడు. బెర్లిన్‌లోని ఫిలోహార్మోనిక్ ఆర్కెస్ట్రా ప్రధాన కండక్టరైన కిరిల్ పెట్రెంకో ఫిబ్రవరి 25న తీవ్రమైన పదజాలంతో పుతిన్ దారుణమైన దాడిని ఖండించాడు. ఆ దాడిని ఆయన "మొత్తం శాంతియుత ప్రపంచపు వెన్నుపై కత్తితో పొడవడమేగాక, సరిహద్దులను చెరిపివేసే కళలపై కూడా దాడి" అన్నారు.

ప్రసిద్ధ రాప్ సంగీత గాయకుడు ఆక్సివీమిరాన్ (Oxvxymiron) యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ తన కచేరీని రద్దు చేసుకున్నాడు. అతని ఇన్‌స్టాగ్రామ్‌లో 2.2 మిలియన్ల అభిమానులున్నారు. "అది దురాక్రమణ కాదు – ఆత్మరక్షణ అని పుతిన్ ఎంత చిత్రించినా, ఉక్రెయిన్ రష్యన్ భూభాగంపై దాడి చేయలేదు – రష్యా ఒక సార్వభౌమ దేశంపై బాంబులు కురిపిస్తోంది" అన్నారాయన.

ఒకప్పుడు పుతిన్‌ను బాగా సమర్థించిన పాప్ గాయకుడు సెర్గీ లాజరెవ్, 2016లో యూరోవిజన్ పాటల పోటీలో రష్యా తరపున పాల్గొన్నవాడు 4.7 మిలియన్ల అభిమానులున్న తన ఇన్‌స్టాగ్రామ్‌లో – నల్లటి బొమ్మ ఒకటి పంపి "చర్చలకై కూర్చోండి. ప్రజలను బతక నీయండి. ఎవరూ యుద్ధాన్ని సమర్థించరు. నా పిల్లలు శాంతియుత వాతావరణంలో జీవించాలని కోరుకుంటున్నా" అనే సందేశాన్ని ఇచ్చాడు.

బోల్షోయ్ బ్యాలేకు నృత్య దర్శకునిగా గతంలో పనిచేసిన అలెక్సి రత్మన్‌స్కీ – కొత్తగా తయారుచేసిన బాలే (సంగీత నృత్యరూపకం) బృందంతోపాటు రష్యా విడచి కీవ్ నగరానికి వెళ్ళిపోయాడు. 'పుతిన్ అధ్యక్షుడిగా వున్నంతకాలం ఇక రష్యాకు తిరిగి వెళ్ళలేనేమో' అన్నారాయన. ప్రముఖ రష్యన్ నాటక దర్శకులు తమ తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. మాస్కోలోని మేయర్ హోల్డ్ కేంద్రానికి సుదీర్ఘకాలం దర్శకునిగా వున్న ఎలినా కొవాలస్కాజా (Yelena Kowalskaja) తన ఉద్యోగాన్ని వదులుకున్నాడు. "నేరస్థుడైన పుతిన్ ప్రభుత్వానికి చెందిన నాటకశాలలో పనిచేయను" అని ప్రకటించాడు. మయకోవస్కీ థియేటర్ దర్శకుడు Mindavgas Karbauskis ఫిబ్రవరి 24నే ఏ కారణం చెప్పకుండా నిష్క్రమించాడు. మాస్కోలోని స్టానిస్లవస్కీ థియేటర్ దర్శకునిగా వున్న ఫ్రెంచి బాలే ఉపాధ్యాయుడు Laurent Hilaire రాజీనామా చేశారు. లండన్‌లోని రాయల్ ఒపేరా హౌస్‌లో బోల్షోయ్ బాలే బృందపు ప్రదర్శనను రద్దు చేశారు.

యుద్ధసమయంలో సాంస్కృతిక విధ్వంసం పలు రకాలుగా సాగుతున్నది. ఇంతకంటే దారుణమైన పరిస్థితుల్లో మహిళలు, పిల్లలు వున్నారు. వారి గురించి యుద్ధం వారి జీవితాలలో ప్రశాంతతను ఎలా చెరిపివేస్తుందో చరిత్ర ప్రారంభం నుండీ మనకు తెలుసు. యుద్ధ ప్రభావం తీవ్రంగా పడేది. అంతిమంగా మహిళలపైనా, పిల్లలపైనా, వారి బాధలు అపారం. కనుకనే ప్రపంచమంతా 'యుద్ధం వద్దు' అంటూ నినదిస్తోంది. రచయితలూ, కళాకారులూ యుద్ధ వ్యతిరేకతను ప్రచారం చేస్తున్నారు. ✦

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## 1992 మే – సంపుటి : 15 సంచిక : 9

**మోహన్** చిత్రించిన కార్మిక దీక్షాదినం మేడే ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. 'కార్మికవర్గ విజయం రేపటి వెలుగంత తథ్యం' అనే సంపాదకీయంలో 'మేడే పుట్టే నాటికి యూరపు, అమెరికా దేశాలకే పరిమితమైన కార్మికవర్గ ఉద్యమం ఈనాడు ప్రపంచంలోని ప్రతి మూల దేశానికి వ్యాపించిందని, శ్రామికవర్గ విప్లవ దీక్షాదినంనాడు పీడిత ప్రజాపక్షపాతాల కర్తవ్యంగా శ్రామికవర్గ రాజ్యం కోసం ప్రతినబూనాలన్నారు'. 'సమకాలీనం' శీర్షికలో 'పెట్టుబడిదారీ భూతా(త)ల స్వర్గం – నిజస్వరూపం' అనే వ్యాసాన్ని డా॥ కిరణ్మయి రాశారు. 'ఆంక్షలు–నిషేధాలు' శీర్షికలో 'ఈజిప్ట్ నవలా రచయిత ఆలా హమీద్‌కు ఎనిమిది సంవత్సరాల జైలుశిక్ష!' గురించి కొత్తపల్లి రవిబాబు రాశారు. 'సజీవ సాహిత్యం' శీర్షికలో 1954లో అవసరాల సూర్యారావు రాసిన 'కొత్త పుంతలు' కథను ప్రచురించారు. 'వ్యంగ్యం' శీర్షికలో కత్తుల కాంతయ్య రాసిన 'పెద్దోళ్ళు దేవుళ్ళు', 'పుస్తక సమీక్ష' శీర్షికలో 'వసంతగీతం' నవలపై నవీన్ (అంపశయ్య) రాసిన 'రహస్యోద్యమ పవనం', చిత్ర రాసిన 'కృష్ణారెడ్డి కథలు', 'గల్పిక' శీర్షికలో శ్రీకృష్ణ రాసిన 'శాంతిభద్రతలు', రాజ్ శ్రీనివాస్ రాసిన 'చిరంజీవ! సుఖీభవ!', 'త్యాగమేరా జీవితం' శీర్షికలో మాక్సింగోర్కీ రాసిన 'మైకేల్ విలొనోవ్', మేడే సందర్భంగా 16 అక్టోబరు 1883న పిట్సుబర్గ్‌లో విడుదల చేసిన 'అంతర్జాతీయ కార్మిక సంస్థ' – ప్రణాళికను ప్రచురించారు. ధారావాహిక వ్యాసం : 'సంస్కృతి; ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమ స్వరూప స్వభావాలు – భూస్వామ్యం; భూస్వామ్య సంస్కృతి" నీ, 'కవితలు' శీర్షికలో నూర్ సంతాఖ్‌పురీ రాసిన పంజాబీ కవిత 'మా పంజాబ్', స్వర్ణజీత్ సవి రాసిన 'ముందుగా', శ్వాస రాసిన 'ఓ నా లెనిన్ గ్రాడ్!' సృజన్ రాసిన 'మార్క్సిజం అజేయం', బి. రామానాయుడు రాసిన 'తుఫాను తీరం దాటదు' కవితలను ప్రచురించారు. వి....రాగి రాసిన '21వ శతాబ్దం' కథతోపాటు 'పిల్లల ప్రపంచం', 'చైతన్యవాహిని', 'అందుకున్నాం'లతో పాటుగా 2, 3 కవరు పేజీలలో మిత్ర రాసిన 'జలవనరుల సాధనకై' జనం పాటనూ, నాల్గవ కవరు పేజీలో ఛాయరాజ్ రాసిన 'లెనిన్ వారసత్వమే లేకపోతే' కవితను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 64 పుటలు. వెల : 4 రూ॥. ✦




సత్యజిత్ రాయ్ శతజయంతి సందర్భంగా....

# పాథేర్ పాచాలీ (1955) (బెంగాలీ)

– బాలాజీ (కోల్‌కతా)

**మొదటి** సినిమాతోనే గ్రేట్ మాస్టర్స్ సరసకు చేరిన దర్శకుడిగా, తను సృష్టించిన పాత్రలతో తరతరాల పాఠకులను అలరిస్తున్న రచయితగా, కంప్యూటర్ ఫాంట్లు లేని కాలంలో సరికొత్త అక్షరాలను సృష్టించిన కాలిగ్రాఫర్‌గా, వినూత్న రీతిలో గ్రంథాల ముఖచిత్రాలూ, పోస్టర్లూ, లోగోలూ డిజైన్ చేసిన ఇలస్ట్రేటర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా, సంగీత దర్శకుడిగా, డాక్యుమెంటరీ నిర్మాతగా, పత్రికా సంపాదకుడిగా – ఇలా సత్యజిత్ రాయ్ తను ప్రవేశించిన ప్రతి రంగంలోనూ అసమాన ప్రతిభాపాటవాలు కనబరిచి బహుముఖ ప్రజ్ఞాశాలి అనిపించుకున్నాడు. పద్మభూషణ, భారతరత్న బిరుదులు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఆస్కారు జీవన సాఫల్య పురస్కారం, అకిరా కురసోవా జీవన సాఫల్య పురస్కారం వంటి వ్యక్తిగత అవార్డులతో పాటు, తన వేర్వేరు సినిమాల కోసమూ లెక్కలేనన్ని అవార్డులూ, గౌరవాలూ దక్కించుకున్నారాయన. ఇంకా పౌరాణిక ఇతివృత్తాలతోనే భారత చలనచిత్రం సతమతమౌతూంటే, అచ్చమైన భారతాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు సత్యజిత్ రాయ్. 1921, మే 2న జన్మించిన సత్యజిత్ రాయ్ శతజయంతి ఉత్సవాలు పూర్తవుతున్న ప్రత్యేక సందర్భంగా ఆయన మొదటి సినిమా 'పథేర్ పాచాలీ' విశేషాలనూ, విశిష్టతనూ పరిచయం చేసుకుందాం.



## సినిమా నేపథ్యం :

1940లలో సత్యజిత్ రాయ్ సిగ్నెట్ ప్రెస్ అనే ప్రచురణ సంస్థకు బొమ్మలు వేసే (ఇలస్ట్రేటర్) ఉద్యోగం చేస్తున్నాడపుడు. బిభూతిభూషన్ బంధోపాధ్యాయ 'పాథేర్ పాచాలీ' ('పాంచాలి' కాదు) నవల అప్పటికే చాలా పాపులర్‌గా వుంది. దాన్ని సులువైన భాషలో 'ఆమ్ ఆటిర్ భేపూ' (మామిడి టెంక ఈల) అనే బాలలసచిత్ర నవలగా తీసుకురావాలని తలపెట్టారు ప్రచురణ కర్తలు. ఉద్యోగంలో భాగంగా దానికి బొమ్మలు వేసే పని సత్యజిత్ రాయ్‌కి అందింది. అది అతడి జీవితంలో ఒక పెద్ద మలుపు. ఆయన ఆ పుస్తకంతో, ఆ పాత్రలతో, ఆ బొమ్మలతో ఎంతగా మమేకమయ్యాడంటే, దాన్నో సినిమాగా ఎలా తీయవచ్చా అని ఆలోచించడం మొదలుపెట్టాడు. 1949 లో ప్రఖ్యాత ఫ్రెంచి దర్శకుడు జీన్ రెనర్ తన 'ది రివర్' సినిమా షూటింగు కోసం కలకత్తాకు వచ్చినపుడు రాయ్ అతనికి గైడుగా వుంటూ, షూటింగును పరికిస్తూ అతని నుండి దర్శకత్వంలో కిటుకులెన్నో నేర్చుకున్నాడు. 'పాథేర్ పాచాలీ' సినిమా తీయాలన్న సంగతి రెనర్‌కు చెప్పాడు. రెనర్ మనసారా ప్రోత్సహించాడు. విటోరియా డి సికా 'ది బైసైకిల్ థీవ్స్' చూశాక ఆ సినిమా ఇచ్చిన ఇంపాక్టుతో 'పాథేర్ పాచాలి' సినిమా నిర్మించవలసిందే అనే కృతనిశ్చయానికి వచ్చాడు రాయ్.

'పాథేర్ పాచాలి' అంటే 'రహదారి వినిపించే గేయకావ్యం'. 1929లో విడుదలై అప్పటికే బెంగాలో క్లాసిక్‌గా పేరు తెచ్చుకున్న నవల ఇది. ఇందులో 300 పాత్రలున్నాయి. కానీ రాయ్ ముఖ్యమైన 30 పాత్రల్ని తీసుకున్నాడు. నవల ఆత్మ దెబ్బతినకుండా సినిమాకు తగ్గట్టు స్క్రిప్టు అప్పటికే రెడీగా వుంది. నటీనటుల ఎంపిక చాలామటుకు పూర్తయింది. ముఖ్యమైన నటీనటులను రంగస్థలం నుంచే తీసుకున్నారు. బామ్మ పాత్ర కోసం ఒకప్పుడు రంగస్థలంలో రాణించి, విస్మృతిలోకి వెళిపోయిన ఇందిరా ఠకురాన్‌ను ఒక వేశ్యావాడ నుంచి వెతికి పట్టుకొచ్చాడు రాయ్. మిగిలినవాళ్లంతా కొత్తవాళ్లు లేదా కొద్దిపాటి అనుభవమున్నవాళ్లే. ఉద్యోగాలు చేస్తూ వారాంతాల్లో షూటింగు చేయాలని అనుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సినిమా షూటింగు మూడేళ్ల పాటు సాగింది. ఎనిమిది వేల రూపాయల బ్యాంకు బ్యాలెన్సుతో షూటింగు మొదలు పెట్టారు. భార్య నగలూ, అరుదైన రికార్డులూ అమ్మేశారు. ప్రముఖుల పరిచయాలతో నిధులు సేకరించారు. మామ సుబిమల్ రాయ్ ప్రావిడెంట్ ఫండ్ కూడా వాడేశారు. అయినా చాలలేదు. చివరికి పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి బిదాన్ చంద్రరాయ్‌ను ఆశ్రయించారు. ఆయన మొదట్లో పెద్ద ఆసక్తి చూపకపోయినా, ఆ తర్వాత వొప్పుకుని 'రహదారి కథ' కనుక 'రోడ్డు రవాణాశాఖ' నుండి ధనసహాయం చేయటంతో ఈ సినిమా పూర్తయింది. విడుదల కాగానే ప్రపంచ సినిమాలో తన స్థానాన్ని ప్రతిష్టించుకుంది. 1955 కాన్స్‌లో 'ఉత్తమ హ్యూమన్ డాక్యుమెంట్' అవార్డు అందుకుంది. ఈ సినిమా విడుదలయ్యాక రాయ్ తన ఉద్యోగం వదిలేశాడు.

ఏముందందులో! ఓ ప్రేమా పాడూ వుందా? పాటా, ఫైటుకు అవకాశముందా? కనీసం హ్యాపీ ఎండింగు వుందా? మరొకడైతే దాని వైపు కన్నెత్తి చూసేవాడు కాదు. కానీ సత్యజిత్‌రాయ్‌కి అందులో ఒక అద్భుత కళాఖండం కన్పించసాగింది. రాయ్‌కి స్క్రిప్టు దశలోనే సన్నివేశాలను స్కెచ్చులుగా వేసుకుని వుంచుకునే అలవాటు వుండేది. ఆ అలవాటు ఈ పిల్లల పుస్తకానికి బొమ్మలు వేసినప్పుడే మొదలైంది.

## సినిమా కథ :

బెంగాలు గ్రామంలోని పేద బ్రాహ్మణ పరివారం కథ. భర్త హరిహర్, భార్య సర్బజయా, పిల్లలు దుర్గ, అపూలతో చాలీచాలని బ్రతుకు. హరిహర్‌కు అక్క వరుస పండు ముసలామె ఇందిర్ ఠాక్రూన్

కూడా వారితోనే వుంటూ బ్రతుకీడ్చుతుంది. పౌరోహిత్యంలో పూట గడవక హరిహర్ వూళ్లు తిరుగుతూంటాడు. నెలల తరబడి ఇంటికి రాడు. కుటుంబ బాధ్యతంతా సర్బజయాదే. దుర్గ, అపూల ఆకతాయి చేష్టలతో సినిమా నడుస్తుంది. దుర్గ జామకాయలు దొంగిలించి బామ్మకు ఇవ్వడం, కూతుర్ని మందలించినపుడు బామ్మ అడ్డురావడం, అలిగిన బామ్మ చాపా, చెంబూ పట్టుకుని బయల్దేరడం, మిఠయివాడు ఊరిలోకి వచ్చినపుడు ఆ పిల్లల చేష్టలు, తమ్ముడిని రైలుబండి చూపడానికి ఊరికి దూరంగా తీసుకెళ్లడం – ఇలా ఎన్నో దృశ్యాలు మనమా పాత్రలతోనే ఆ ప్రాంతాల్లో తిరుగుతున్నామా అన్నంత సహజంగా చిత్రించాడు దర్శకుడు. బామ్మ మరణం తర్వాత సినిమా ఆఖర్లో దుర్గ మరణం చాలా కలవరపెడుతుంది మనల్ని. మొదటి సినిమాలో అపూ కథ ఎక్కువగా లేకపోయినా, ఈ కథను అతడే పరికిస్తున్నాడని చెప్పేందుకు నిద్రిస్తున్న అపూ కనురెప్పను దుర్గ తెరవడం ద్వారా అతడ్ని మనకు పరిచయం చేస్తాడు దర్శకుడు. తండ్రీ, తల్లీ, అపూ జీవనపోరాటం కోసం బనారస్ బయల్దేరడంతో 'పాథేర్ పాచాలీ' ముగుస్తుంది.

## ఎందుకీ సినిమా మైలురాయిగా నిలిచింది?

భారతీయ సమాంతర సినీ ముత్యాల్లో అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ సినీపటంలో భారతదేశానికి పీఠస్థానం కల్పించిన సినిమా ఇది. ప్రతి దృశ్యాన్నీ ఎంతో శ్రద్ధగా నిర్మించారు. రైలు బండిని చూట్టానికి పిల్లలు పరుగెత్తే దృశ్యం ఎప్పటికీ పాతబడని ఐకానిక్ దృశ్యంగా వుండిపోతుంది. వర్షాగమనాన్ని సూచించే దృశ్యం కూడా అలాంటిదే! చిన్నగా గాలి మొదలై చెరువులో అలలు రావడం, తామరాకులు పైకి లేస్తూ ఊగడం, ఒక ఆసామి బట్టతలపై ఒక నీటి చుక్క పడడం, అలా అది ఉధృత రూపం దాటల్చడం! ఈ వర్షాన్ని దర్శకుడు వృధా కానివ్వడు. ఆ వర్షంలో సరదాగా గంతులేసి జబ్బుపడి చనిపోతుంది దుర్గ. దుర్గ చనిపోయిన సంగతి హరిహర్‌కు తెలిసిన విధానాన్ని కూడా చాలా హృద్యంగా చిత్రిస్తాడు దర్శకుడు. చనిపోయిన బామ్మ పక్కకి వొరిగిపోయిన వెంటనే ఆమె సత్తు చెంబు దొర్లుకుంటూ చెరువులోకి జారడం ఆ దృశ్యపు తాకిడిని మరింత పెంచుతుంది. 'సత్యమే శివం' సినిమాలో యాక్సిడెంట్ దృశ్యంలో కొండమీంచి కుండ దొర్లడానికి ప్రేరణ ఎక్కడిదో మనకు అర్థమౌతోంది. "ఇది సినిమాలా అనిపించదు. ఎవరో నిజజీవితంలోని కొంత భాగాన్ని రహస్యంగా దొంగిలించి తెరపై పరిచేసినట్టనిపిస్తుంది" అనంటాడు 'అపూ త్రయం'లో అపూగా వేసిన సౌమిత్ర చటర్జీ.

'పాథేర్ పాచాలీ' (1955), 'అపారాజితో' (1956), అపూర్ సాంసార్ (1959) – ఈ మూడు సినిమాల్నీ కలిపి 'అపూ ట్రిలాజీ' (అపూ త్రయం) అంటారు.

## 'అపారాజితో' (1956) :

బనారస్‌లో పౌరోహిత్యం ద్వారా కొద్దిపాటి సంపాదన తెస్తున్న హరిహర్ ఒకరోజు నది వొడ్డున జ్వరంతో కుప్పకూలిపోతాడు. తర్వాతి దినం ఉదయాన్నే అపూ తెచ్చిన గంగ నీళ్లు నోట్లో పోస్తుండగా ప్రాణం విడుస్తాడు ఆ తండ్రి. తల్లీ, కొడుకూ మామయ్యగారి గ్రామానికి వస్తారు. తండ్రి నేర్పిన పౌరోహిత్యం కొనసాగించమని తల్లి కోరితే, తను బడికి పోతానంటాడు అపూ. చదువులో చురుగ్గా వున్న అపూకు హెడ్ మాష్టర్ ప్రోత్సహిస్తాడు. స్కాలర్‌షిప్ రావడంతో తల్లికి ఇష్టంలేక పోయినా, కలకత్తాలో చదువుకోడానికి వెళతాడు. తల్లి ఆరోగ్యం క్షీణిస్తుంది, కొడుకు కోసం నిరీక్షిస్తూ, మిణుగురులు నాట్యం చేస్తున్న ఓ రాత్రివేళ మరణిస్తుంది. తల్లీ, కొడుకుల అనుబంధం, వారి మధ్య సంఘర్షణ ఇందులో ప్రధాన యితివృత్తం. 'ది షో మస్ట్ గో ఆన్' అని సినిమావాళ్లు అనే మాదిరిగానే ఎన్ని చావుల తర్వాతనైనా జీవితం కొనసాగవలసిందే. ఒంటరిగానైనా ఆ యాత్ర సాగవలసిందే. 'అపరాజితో' అంటే 'అపజయం లేని' అని అర్థం. ఈ జీవశక్తే అపూ త్రయానికి చోదకశక్తి.

## అపూర్ సాంసార్ (1959) :

మూడో భాగం తీయాలని సత్యజిత్ రాయ్ మొదట్లో అనుకోలేదు. ఈలోగా 'పారాస్ పాథొర్' (1957), 'జల్సాఘర్' (1958) అనే సినిమాలు తీశాడు. కానీ ఒక విదేశీ పాత్రికేయుడి ప్రశ్న, దానికి తనిచ్చిన జవాబు కారణంగా మూడోభాగం తీశాడు రాయ్. ఇందులో అపూ వైవాహిక జీవితం, దాని ఒడిదొడుకులూ చోటుచేసుకుంటాయి. సినిమాలో కనిపించే వాటర్ ట్యాంకును బట్టి ఇది ఉత్తర కోల్‌కతా టాలా బ్రిడ్జికి దగ్గరలో తీశారని తెలుస్తోంది. నగర పేదరికం ఇందులో చిత్రితమైంది. నిరుద్యోగి అయిన అపూ తన స్నేహితుడి చెల్లెలి పెళ్లికి వెళతాడు. అనుకోని పరిస్థితుల్లో పెళ్లి చెడిపోగా, తనే ఆ అమ్మాయి అపర్ణను పెళ్లిచేసుకుంటాడు. పేదరికంలో కూడా ఆ జంట అన్యోన్యతను అందంగా చిత్రిస్తాడు దర్శకుడు. ఉదయం బద్ధకంగా నిద్రలేస్తూ దిండు పక్కన దొరికిన హెయిర్ పిన్ను చేతిలోకి తీసుకుని, బాల్కొనీలో పొయ్యి రాజేస్తున్న భార్య వైపు చిరుమందహాసం చేసే దృశ్యం ప్రత్యేకంగా గమనించదగ్గది. ఏ మాత్రం న్యూడిటీ లేకుండా కళాత్మకంగా చిత్రించిన అతి శృంగార దృశ్యమిది. గతరాత్రి దృశ్యాన్ని తెలివిగా మన ఊహకే వదిలేస్తాడు దర్శకుడు. ఈ సినిమాలో సత్యజిత్ తన అభిమాన నటీనటులు సౌమిత్ర చటర్జీ, షర్మిలా ఠాకూర్‌లను ప్రధాన పాత్రధారులుగా తీసుకున్నాడు. పుట్టింటికి వెళ్లిన అపర్ణ కాన్పు సమయంలో చనిపోవడంతో పిచ్చివాడిలా మారిపోతాడు అపూ. తను రాస్తున్న నవల రాత ప్రతుల్ని విసిరేస్తాడు. ఐదేళ్లవరకు కన్న కొడుకును చూట్టానికి కూడా అత్తవారింటికి వెళ్లడు. చివరికి ఒక స్నేహితుడి మందలింపుతో కొడుకును చూట్టానికి వెళ్లడం, ఆ పసివాడి నమ్మకాన్ని జయించి, అతడ్ని తన భుజాలపై కూర్చోబెట్టుకుని తన వెంట తీసుకురావడంతో సినిమా ముగుస్తుంది.

కొన్ని ప్రతీకలతో ట్రిలాజీలోని ఒక భాగం నుండి మరో భాగానికి చాలా సునాయాసంగా లింకు కలుపుతాడు దర్శకుడు. రైలు కనిపించే ప్రతిసారీ, ఆ ధ్వని వినిపించే ప్రతిసారీ ఒక వేర్పాటు, ఒక మరణం సంభవించడం చూస్తాం. రైలు ధ్వని చెవిలో పడ్డ ప్రతిసారీ అపూకు తన అక్క గుర్తొచ్చి బాధపడుతుంటాడు. పుస్తకంపై ఇంకు పడిపోయే దృశ్యంతో రెండో భాగానికీ, మూడో భాగానికీ చాలా తొందరగా లింకు కలిపేస్తాడు దర్శకుడు. అలాగే చిరిగిన కిటికీ గుడ్డ, వీధి ద్వారాలను కూడా ప్రతీకాత్మకంగా, కళాత్మకంగా వినియోగిస్తాడు దర్శకుడు. ఈ సినిమాల గురించి ఎందరో సినీ విమర్శకులు ఎన్నో విశ్లేషణలు ఇప్పటికీ చేస్తున్నారు. ప్రపంచంలోని సినిమా బోధనా సంస్థల్లో వీటిపై అధ్యయన పాఠాలు నడుస్తునే వున్నాయి. ✦

# చైతన్యవాహిని

**ఆంధ్రప్రదేశ్** టీచర్స్ ఫెడరేషన్ ప్లాటినం జూబ్లీ మహాసభ, 19వ విద్యా వైజ్ఞానిక సభ 2022 ఏప్రిల్ 14, 15, 16 తేదీలలో శ్రీకాకుళం పట్టణంలో కామ్రేడ్ నూతలపాటి పరమేశ్వరరావు నగర్ (బాలుర ప్రభుత్వ డిగ్రీ కళాశాల)లో జరిగింది. 75 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన నిర్మాణాత్మక ఉపాధ్యాయ వృత్తి సంఘం తన మొదటి రోజు (14వ తేదీ) మహాసభ కార్యక్రమంలో చివరి అంశంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ సభకు ఏపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనసాహితి రచయిత అయిన బి. నేతాంజనేయ ప్రసాద్, ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకులు బి. తులసీనాథంనాయుడు అధ్యక్షత వహించారు. జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్ క్లుప్తంగా మాట్లాడుతూ సంస్కృతికి అసలు నిర్మాతలు : 1. శ్రమజీవులు, 2. శాస్త్రజ్ఞులు, 3. కళాకారులు అని గోర్కీ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. సారాంశంలో వీరందరూ కూడా శ్రమజీవులే అని చెప్పారు. ఆహార సేకరణ దశనుంచి ఆహార ఉత్పత్తి దశకు మానవ నాగరికత అభివృద్ధి చెందటం, సంస్కృతిలో ఒక విప్లవాత్మక పరిణామం అని చెప్పారు. మనం పరిశీలనగా చూస్తే పై పరిణామంలో శ్రమజీవులలో భాగంగా శాస్త్రజ్ఞులు కళాకారులు కూడా విడివిడిగా కాకుండా కలగలిసి ఉన్నారని మనకు అర్థమవుతుందన్నారు.

కొద్దిమంది సంపన్నులుగా అత్యధికులు నిరుపేద శ్రమజీవులుగా రూపొందుతున్న కాలం నుండి సంస్కృతి కూడా వర్గ విభజనకు గురైందనీ, ఒక తరం నుండి మరొక తరానికి అందే స్వభావం గల సంస్కృతిలో భావజాల ఆవిష్కరణ, భావ విస్తరణ ఒక ముఖ్యభాగం అన్నారు. కళారంగానికి చెందిన రచయితలే కాక ఉపాధ్యాయులు కూడా ఒకరకంగా ఈ భావ విస్తరణలో అంతర్భాగమే. వారు విద్యార్థులకు వాస్తవ చరిత్రను అందించడం ద్వారా సరైన భావాలను సమాజానికి అందించిన వారవుతారన్నారు.

ఈరోజు ఉదయం మన ఉపాధ్యాయుల మహాసభ ప్రారంభ సమయంలోనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని నిర్వహించుకున్నాము. ఆయనను భారత రాజ్యాంగ నిర్మాత అని పదే పదే చెప్పుకుంటున్నారు తప్ప రాజ్యాంగ నిర్ణాయక సభ ముగింపు సమావేశపు (26 నవంబర్ 1949) ప్రసంగంలో ఆయన చేసిన హెచ్చరికను చాలామంది పట్టించు కోవడంలేదన్నారు. రాజకీయంగా ప్రజలందరికీ ఒకే ఓటు ద్వారా సమానత్వాన్ని అందించినట్లుగా ఉండినా, ఆర్థిక సాంఘిక అసమానతలు ఇలాగే కొనసాగితే రాజకీయ సమానత్వం కూడా దాని అసలైన అర్థంలో సజీవంగా నిలబడలేదు అని ఆయన ఆరోజు హెచ్చరించారనీ, గడిచిన 75 ఏళ్లుగా ఎంత ప్రమాదకరంగా ఆర్థిక సాంఘిక అసమానతలు పెరుగుతున్నాయో అంతగా అవి మన రాజకీయ హక్కులను, స్వేచ్ఛా స్వాతంత్రాన్ని హరిస్తున్నాయని గ్రహించాలన్నారు. అలాగే చరిత్రలో అత్యంత ఘోర దురంతంగా నిలబడిపోయిన జలియన్ వాలాబాగ్‌ను కామ్రేడ్ భగత్‌సింగ్ ఒక హైస్కూలు విద్యార్థిగా ఉండగానే, తన 12 ఏళ్ల ప్రాయంలో దర్శించుకున్న రోజు ఈరోజు!!.

ఆనాడు బ్రిటిష్ పాలకులు మనదేశంపై రుద్దిన నిరంకుశ రౌలట్ చట్టంకు వ్యతిరేకంగా అమృతసర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో సభ జరుగుతూ ఉండగా వందలాది మంది ప్రాణాలను బలిగొన్న సంఘటన జరిగి నిన్నటికి సరిగ్గా 103 సంవత్సరాలు. అయితే 1919 నాటి ఆ కాలపు రౌలట్ చట్టం లాంటి మరింత నిరంకుశమైన UAPA లాంటి చట్టాలు నేటి పాలకులు చేస్తున్నారు. ఇదంతా వలస పాలన నుండి కొనసాగుతున్న విధానాలే కావడం గమనించాల్సిన విషయమన్నారు.

స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచిపోయింది అని చెబుతున్నా నేటికీ శాస్త్రీయమైన విద్యా విధానం ప్రజల భాషలో బోధనా మాధ్యమం పరిపాలన అందించలేని స్థితిలో నేటి కేంద్ర రాష్ట్ర పాలకులు ఉన్నారు. ఏ పరాయి భాషనైనా మాతృభాష ద్వారానే సులువుగా బాగా నేర్చుకోవచ్చు అనే కనీస అవగాహన పట్ల కించిత్తు శ్రద్ధలేని పరిపాలకులను నేడు మనం చూస్తున్నాము. దేశంలో 22 జాతీయ భాషలు ఉంటే హిందీ ఒక్కటే జాతీయ భాష అన్నట్టు అందరూ ఇతర మాతృభాషల వారితో హిందీలోనే కార్యకలాపాలు నిర్వహించాలని కేంద్ర హోంమంత్రి తాఖీదులులాంటివి ఇస్తున్నారు. దీనిని కేవలం భాషా అధిపత్యం అన్నట్లు చూడకూడదు. మనవైన అటవీ ఖనిజ లోహ సంపదలు విశాఖ ఉక్కు కర్మాగారాలు, ఓడరేవులు కృష్ణా గోదావరి బేసిన్ గ్యాస్‌లు విదేశీ స్వదేశీ కార్పొరేట్ వర్గాలకు ఉత్తరాది బడాపెట్టుబడిదారులకు కట్టబెట్టే కార్యక్రమంలో భాగంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ పోరాటంలో అనేకమంది ఏపిటిఎఫ్ కార్యకర్తలు ప్రభుత్వ నిర్బంధానికి బలి అయిన సంగతి మనకు తెలుసు. అలాగే కళారంగ కార్యకర్తలయిన తామాడ చిన్నబాబు లాంటి బాల కళాకారుడు, సుబ్బారావు పాణిగ్రాహి లాంటి గొప్ప వాగ్గేయకారులను కూడా ఈ పాలకులు ఎన్కౌంటర్ పేరిట హత్య కావించిన సంగతి మనకు తెలుసు... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, షహీద్ భగత్‌సింగ్‌లను, శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయ ప్రజా కళారంగ అమరవీరులను ఒకసారి జ్ఞాపకం చేసుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శనలను ప్రారంభించవలసిందిగా నిర్వాహకులను కోరుతూ సభను ముగించారు.

**17 ఏప్రిల్ 2022, ఒంగోలు :** జనసాహితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ చావాలి శాంతికుమార్‌గారి జీవిత సహచరి ప్రభావతిగారు 23-3-2022న తన 74వ ఏట మరణించారు. వీరికి ఇద్దరు పిల్లలు శ్రీకాంత్, అరుణ శ్రీ లు.

ప్రముఖ అడ్వకేట్ జనసాహితి సభ్యుడు అయిన పంగులూరు గోవిందయ్య అధ్యక్షతన ప్రభావతిగారి సంస్మరణ సభ 17 ఏప్రిల్ 2022న ఒంగోలు లాయర్ పేటలో జరిగింది. సభలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు అరుణ, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు

డి.వి.ఎస్. స్వామి, రచయిత విమర్శకుడు శ్రీరామ కవచం సాగర్, డాక్టర్ కె.వి. రమణ, జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్ తదితరులు ప్రసంగించారు.

సుమారు 28 సంవత్సరాలపాటు ప్రభావతిగారు వ్యాపార దృష్టి లేకుండా, విద్యార్థుల పట్ల నిబద్ధతతో నిర్వహించిన లిటిల్ ఫ్లవర్ కాన్వెంటులో ఆమెతో కలసి పనిచేసిన అనుభవం గల ఉపాధ్యాయులు, వారి వద్ద చదువుకున్న విద్యార్థులు కూడా తమ మరువలేని జ్ఞాపకాలను పంచుకున్నారు.

జనసాహితి సాంస్కృతిక కార్యకలాపాలలో వారి పిల్లలు ఇరువురితో సహా వారి కుటుంబమంతా ఎంత మమేకమై పాల్గొన్నారో, జనసాహితికి పట్టు కొమ్మగా వారు ఎలా నిలిచారో తమ తమ జ్ఞాపకాలను ప్రజా సంఘాల బాధ్యులందరూ పంచుకున్నారు.

డాక్టర్‌గారి తండ్రి, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు, బాల సాహిత్య కవి అయిన సమతారావుగారిని కూడా ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకున్నారు. హాజరైన మిత్రులు బంధువులు అందరూ ప్రభావతిగారికి ఘనంగా నివాళులు అర్పించారు.

**20-4-2022 గుంటూరు :** ఈ నెల 6వ తేదీన మరణించిన సాహితీ విమర్శకుడు కడియాల రామమోహనరాయ్ సంస్మరణసభ మోదుగుల రవికృష్ణ నిర్వహణలో గుంటూరు చిన్మయ ఫంక్షన్‌హాలులో జరిగింది.

ముందుగా ఆయన 2003లో రాసిన '20వ శతాబ్ది తెలుగు కవిత్వం' పుస్తకాన్ని ఆయన సంస్మరణగా ద్వితీయ ముద్రణగా ప్రచురించిన బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి లోకార్పణ చేసి, రాయ్‌తో తనకున్న సాహిత్య మిత్రత్వాన్ని వివరించారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ అధ్యాపకునిగా, సాహిత్య విమర్శకునిగా, ఉపన్యాసకునిగా రాయ్ కృషిని తెలియచేశారు. అరసం తరఫున పెనుగొండ లక్ష్మీనారాయణ నివాళులర్పించారు. భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. 'ప్రజాసాహితి', 'జనసాహితి' తరఫున కొత్తపల్లి రవిబాబు రాయ్‌కు జోహార్లు తెలియచేస్తూ ఆయన తెలుగు, ఇంగ్లీషు సాహిత్యం బాగా అధ్యయనం చేశారనీ, సాహిత్య విమర్శ అంటే కేవలం పొగడటం కాదనీ, ఒక రచనలోని బాగోగులను నిష్కర్షగా చెప్పటమనేది రాయ్ పాటించేవారనీ, 'ప్రజాసాహితి'లో Marxist Cultural Movement in India అనే ఇంగ్లీషు పుస్తకాన్ని సమీక్షించారనీ చెప్పారు.

**23-4-2022, చోడవరంలో** శనివారం సాయంత్రం విశాఖజిల్లా జనసాహితి నిర్వహణలో శ్రీపాద సుబ్రహ్మణశాస్త్రిగారి జయంతి సందర్భంగా, సాహిత్య గోష్ఠి నిర్వహించబడింది. జనసాహితి విశాఖజిల్లా శాఖ అధ్యక్షులు ఐ.టి.ఆర్.వి. శివాజీరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ శ్రీపాదవారి జీవితమూ, సాహిత్య కృషీ నేటితరంవారు తప్పక తెలుసుకోవల్సిన అవసరముందన్నారు. కులాచారాలను, మతాచారాలను పరమ నిష్ఠగా పాటించే కుటుంబం నుంచి వచ్చి, సమాజ పురోగమనానికి ఏ భావాలు అవసరమో ఆ భావాలవైపు, ఎవరు పీడితులుగా ఉన్నారో వారివైపు నిలుచుని సాహిత్య సృజన చేసిన గొప్ప ప్రజారచయిత శ్రీపాదవారన్నారు. జనసాహితి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం నూకాచారి మాట్లాడుతూ శ్రీపాద సాహిత్యంలో "అరికాళ్ళ కింద మంటలు" కథలో బాల వితంతువుల వేదనను సంభాషణలుగా కొంత రాసి ఏమీ రాయకుండా చుక్కలుగా కొంత ఉంచి శ్రీపాద చిత్రం కట్టారన్నారు. కథ చివరలో బాల వితంతువు గడప దాటి ఎక్కిన బండి వీధి మలుపు తిరిగింది అన్నపుడు, పాఠకుడి భావ ప్రపంచం కూడా అభ్యుదయం వైపు మలుపు తిరుగుతుందనిపిస్తుందన్నారు. జనసాహితి సభ్యులు మన్మథరావు మాట్లాడుతూ పరిణామం చెందుతూ ఉండే సామాజిక చరిత్రను అధ్యయనం చేయాలంటే, చారిత్రక దశలో ఉత్పన్నమైన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలనీ, ప్రజాసాహిత్యకారులు ప్రజల జీవితాలలోనూ, సమాజంలోనూ వ్యక్తమవుతున్న సంఘర్షణను సాహిత్యబద్ధం చేస్తారని అన్నారు. ప్రజలపట్ల ఎంతో బాధ్యతతో అలా సాహిత్యకృషి చేసినవారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అని అన్నారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ శ్రీపాదవారు రాసిన 'పుల్లంపేట జరీచీర' వంటి కథలు ఎంతో ఆలోచింపజేస్తాయని అన్నారు. పరిమిత ఆదాయంతో నెట్టుకొచ్చే దంపతుల మధ్య, చిన్న బహుమతి కోసం చేసిన చిట్టిపొట్టి త్యాగాలు కళ్ళు చెమరింపజేస్తాయన్నారు. ఆ కథ చదివి, ఇప్పటి పరిస్థితి చూసినపుడు.... ఇటు 20 వేలు, 25 వేల రూపాయల సెల్‌ఫోన్లు పెళ్ళికూతుళ్ళకు, అటు లక్షల రూపాయల మోటారుబైకులు పెళ్ళికొడుకులకు పరస్పర బహుమానాలుగా మారుతున్న పరిస్థితి ఉన్నా స్త్రీ పురుషుల సంబంధాలు ప్రేమ అనురాగాలకన్న, అనుమానాలు, అపనమ్మకాలతో నిండిపోతున్నాయన్నారు. ఇటీవల విశాఖజిల్లాలో గిఫ్ట్ యిస్తానంటూ పెళ్ళికొడుకు కళ్ళుమూసి, పెళ్ళికూతురే గొంతుకోసిన సంఘటన ఈ పరిణామాలకు పరాకాష్ట అన్నారు. జనసాహితి సహాయ కార్యదర్శి ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాసాహిత్యరంగంలో పనిచేసేవారందరూ శ్రీపాదవారి సాహిత్యాన్ని అధ్యయనం చేయాలన్నారు. మాతృభాష, మహిళలు, అస్పృశ్యత, వ్యవహారిక భాషోద్యమము.... ఇలా సాహిత్యంలో ప్రోది చేయాల్సిన ప్రజాతంత్ర భావాలను ఆయన ఎంతో త్యాగశీలమైన కృషితో మనకందించారన్నారు. తెలుగు అధ్యాపకులు రసూల్ మాట్లాడుతూ యువతీ యువకులకు సరైన ప్రాపంచిక దృక్పథం ఏర్పడాలంటే శ్రీపాద వంటివారి రచనలు అధ్యయనం చేయాలని అన్నారు. రైతుకూలీసంఘం జిల్లా బాధ్యులు కోన మోహనరావు మాట్లాడుతూ వెర్రితలలు వేస్తున్న విచ్చలవిడి సంస్కృతిని అడ్డుకట్ట వేసేందుకు శ్రీపాద వంటి ప్రజాతంత్ర సాహిత్యకారుల రచనలను మరింత విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరముందన్నారు. ఉపాధ్యాయులు నాగరాజు, దేవీప్రసాద్, రేవతి తదితరులు మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల మధ్య, యువతీయువకుల మధ్య, స్త్రీ పురుషుల మధ్య పెచ్చరిల్లుతున్న పెడధోరణుల గురించి సభికులలో చర్చ జరిగింది. శ్రీపాద వంటి ప్రజాతంత్ర సాహితీకారుల సాహిత్యం ప్రచారంలోకి వచ్చేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషిచేయాలని చర్చించారు. జనసాహితి సభ్యులు రవిశంకర్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ✦




**నేను - నా నేపథ్యం : రచయిత - వుమ్మనేని పాపయ్య**

రచయిత వుమ్మనేని పాపయ్య తెనాలి, చిలకలూరిపేట కళాశాలల్లోనూ, రిటైరైన తర్వాత గౌతమ్ కళాశాలలోనూ తెలుగు అధ్యాపకులుగా 55 సంవత్సరాలపాటు పనిచేసి 23-3-2022న తన 95వ యేట మరణించారు. తన వంశ చరిత్ర, తన జీవితగాథ మేళవించి 2015లో దీనిని రాశారు.

గుంటూరు, నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లో ప్రకాశం జిల్లాలోని వుమ్మనేనివారిపాలెంలో 12 పూరిండ్లు, 12 కుటుంబాల పేద గ్రామానికి చెందిన మధ్యతరగతి కుటుంబం వీరిది. ఆయన శివరామపురం, తాళ్ళూరు, ఒంగోలులో చదువు ముగించి గుంటూరు ఎ.సి. కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ కాలంలో స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆంధ్రా యూనివర్శిటీలో తెలుగు బి.ఏ. (ఆనర్స్) చదివినప్పుడు ప్రొఫెసర్ల పక్షపాతానికి గురై 3వ క్లాసులో ఉత్తీర్ణుడయ్యారు. 1954లో వివాహానంతరం తెనాలి కళాశాలలో చేరారు.

ఆయన ఒంగోలులో స్కూల్ ఫైనల్ విద్యార్థిగా 1946-47లో పట్టణ స్టూడెంట్ ఫెడరేషన్ కార్యదర్శిగా వున్నారు. 1947లో ఎ.సి. కాలేజీలో దాసరి నాగభూషణంను డిటైన్ చేస్తే పికెటింగ్‌లో పాల్గొన్నందుకు వారంరోజులు జైలులో వున్నారు. 1951లో తుపానుచే దెబ్బతిన్న కోనసీమ ప్రాంతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థుల వైద్య సహాయక బృందంలో పదిరోజులు సేవలు చేశారు. 1953లో మెస్ కార్యదర్శిగా అక్కడ జరుగుతున్న అవకతవకలు సరిచేశారు.

తన జీవితకాలంలో రచయిత సంప్రదాయ ఆధునిక సాహిత్యంపై పట్టు సాధించారు. వేదాలు, ఉపనిషత్తులు చదివారు. వాటిలో వున్న ఆనాటి సామాజిక పరిస్థితులకనుగుణంగా వున్నాయి. వాటిని పరిశీలించడం అవసరమేనన్న భావంతో వాటిని చదివారు.

నేటి సమాజంలో నెలకొన్న సంక్షుభిత సామాజిక రాజకీయ పరిస్థితులు విప్లవాలకు దారితీస్తాయని ఊహించారు.

1/8 డెమ్మీలో 64 పుటలు. తెనాలిలో పాపయ్యగారి కుటుంబసభ్యుల వద్ద కాపీలు లభ్యం.

**విద్యాదాన కర్ణ-యక్షగాన కళానిధి తెల్లాకుల వేంకటేశ్వరగుప్త: రచయిత - బి.ఎల్. నారాయణ**

తెనాలి ప్రచురణలు (ఇంప్రెషన్స్) పేరుతో ప్రచురిస్తున్న 'చరితార్థులు' పుస్తక పరంపరలో ఇది నాలుగో పుస్తకం. మొదటిది - 'వీరచక్ర తాతా పోతురాజు' చరిత్ర; రెండోది - 'ఆంధ్రుల అందాల తార కాంచనమాల'. మూడోది - 'మార్క్సిస్టు గాంధీ బొల్లిముంత శివరామకృష్ణ'. వీటి సమాచార సేకరణ, రచన 'గాడిచర్ల' అవార్డు గ్రహీత, పాత్రికేయుడు బి.ఎల్. నారాయణ.

తాను స్వయంకృషితోనూ, గురువుల శిక్షణతోనూ, 20వ శతాబ్దపు అగ్రగణ్య హరికథకునిగా ఖ్యాతిని పొందటమేగాక, తన ఇంట్లోనే హరికథా పాఠశాల నడిపి, కొన్ని వందల మందిని ముఖ్యంగా మహిళలను హరికథకులుగా తయారుచేసినవారు తెల్లాకుల వెంకటేశ్వరగుప్త.

ప్రకాశంజిల్లాలోని కనిగిరి తాలూకాలోని చిలమకూరు వారి స్వగ్రామం. 6-2-1912న జన్మించారు. 1978 డిసెంబరు 21న మరణించారు. 1890 ప్రాంతాల్లో కరువు వల్ల వారి కుటుంబం తెనాలికి వచ్చింది. బాలాజీదాసు చెప్పిన హరికథతో ఆకర్షితుడైన వెంకటేశ్వరగుప్త, దాసరి చెంగలరాయుడు దగ్గర ఫిడేలు, ఉప్పలపాటి శ్రీరాములు, అంకయ్యల వద్ద సంగీతం నేర్చుకున్నారు. తన ఇంటినే హరికథాపాఠశాల చేసారు. 'బోసు హరికథ' రాసి, చెప్పారు. రామాయణాన్ని బుర్రకథగా రాశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో 1946లో దేశభక్తి గీతాలు బహిరంగ సభల్లో గొంతెత్తి పాడారు. ఎందరో మహిళలకు హరికథాగానం నేర్పారు.

వీరికి 1971 ఫిబ్రవరిలో తెనాలిలో షష్టిపూర్తి మహోత్సవం జరిపారు.

ఈ పుస్తకంలో ఇంకా గుప్త శిష్యులలో ముఖ్యులైన 124 మంది జాబితా, తెనాలికి చెందిన 56 మంది హరికథ కళాకారుల క్లుప్త పరిచయాలు, బుర్రకథ కథకుల వివరాలు, తొలి మహిళాహరికథా గాయని సి. సరస్వతి మొదలగువారి గురించీ వున్నాయి.

1/8 డెమ్మీ, 96 పుటలు. వెల : రూ.100/- ప్రతులు : 500. మార్చి 2022.

ప్రతులకు : తెనాలి ఇంప్రెషన్స్, 22-5-42 సరోజినినాయుడు వీధి, కొత్తపేట, తెనాలి-1. ఫోన్ : 95509 30789.

**త్రిపురనేని రామస్వామి సర్వలభ్య రచనలు : సంపాదకుడు - పారా అశోక్‌కుమార్**

మనసు ఫౌండేషన్‌ను స్థాపించి నడుపుతున్నవారు ముగ్గురు సోదరులు - వెంకటరాయుడు, గోపీచంద్, చంద్రమౌళి. వారి తండ్రిగారు మన్నం నరసింహం, తల్లిగారు సుబ్బమ్మ పేర్లలోని మొదటి అక్షరాలతో మ.న.సు. అని దీనికి పేరు పెట్టారు. ఒక రచయిత రచనలన్నిటినీ ఒకే సంపుటంగాగానీ, పలు సంపుటాలుగా గానీ ప్రచురించడం పాశ్చాత్య సాహిత్యంలో ఏనాటినుండో వుంది. తెలుగులోనూ గతంలో వీరేశలింగం రచనలూ, కొ.కు., శ్రీశ్రీ రచనలు, కృష్ణశాస్త్రి, రామిరెడ్డి రచనలు మొదలగునవి సంపుటాలుగా వచ్చాయి. కాపీరైటు ఇబ్బందులు లేని రచయితల సర్వలభ్య రచనలను మనసు ఇప్పటికి 14 గ్రంథాలుగా ప్రచురించింది. ఇది పదిహేనవ గ్రంథం.

మనసు ఫౌండేషన్ చేబట్టిన మరో బృహత్కార్యక్రమం తెలుగు పుస్తకాల డిజిటలీకరణ. 2018 ఉగాదినాడు డిజిటలీకరణ కేంద్రం నెల్లూరు సమీపంలోని వరికుంటపాడులో ప్రారంభించారు. వ్యక్తుల వద్ద, సంస్థల వద్ద వున్న తెలుగు పుస్తకాలన్నిటినీ డిజిటలీకరణ ఉచితంగా చేస్తున్న కార్యక్రమంలో నిమగ్నమై వున్నారు. మా 'ప్రజాసాహితి' గ్రంథాలయంలోని పుస్తకాలన్నీ డిజిటలీకరణ క్రమంలో వున్నాయి.

వెల్చేరు నారాయణరావు దీనికి ముందుమాట రాస్తూ త్రిపురనేని రామస్వామి, పెరియార్ రామస్వామి చేసిన కృషిలో తేడాలు పాఠకుల

దృష్టికి తెచ్చారు. త్రిపురనేని సాయిచంద్, అనిల్ అట్లూరి వారి తాతగారైన రామస్వామి జ్ఞాపకాలు రాశారు.

1910-25ల మధ్య తన పేరు త్రిపురనేని రామస్వామిగా రాసుకున్న ఆయన 1940లలో అక్కడక్కడా 'చౌదరి' అనే తోక ఎందుకు తగిలించుకున్నారో పరిశోధించాల్సిన అంశంగా కనబడుతోంది.

త్రిపురనేని రామస్వామి రచనలు 14 - (748 పుటలు) కాగా వారి వ్యాసాలు, లేఖలు, ఇతరములు 150 పుటలు కలిపి మొత్తం 1/8 డెమ్మీలో 901 పుటలు + 26 పుటలు (ముందుమాటలు) వున్న ఈ బౌండు పుస్తకం వెల : రూ.400/- ఎమెస్కోవారు సరఫరా చేస్తున్నారు.

**అశ్రు తర్పణం : మా అన్నయ్య కాదు - మా పాలిట కన్నయ్య :**

**రచన, సంపాదకత్వం, ప్రచురణ - ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు**

తణుకులో వుండే తంగిరాల వేంకటకృష్ణ సోమయాజులుకు ముగ్గురు తమ్ముళ్ళు. వారు వరుసగా 1. తంగిరాల వేంకట సుబ్బారావు, 2. తంగిరాల భాస్కరరావు, 3. తంగిరాల కృష్ణమూర్తి. వీరిలో మొదటి తమ్ముడు తెలుగు సాహిత్య లోకానికి చిరపరిచితులు. వీరగాధలపై విశేష పరిశోధన చేసినవారు. బెంగుళూరులో తెలుగు అధ్యాపకునిగా పనిచేశారు. 'చైతన్యకవిత' అనే త్రైమాస పత్రికను నడిపారు. వీరి అన్నగారు తమనెంతో ప్రేమించి, పెంచి, సహాయ సహకారాలందించి తన 91వ యేట ప్రాయోపవేశం చేసి 28-7-2021న మరణించారు. తమ అన్నయ్య టి.వి.కె. సోమయాజులుకు అశృతర్పణంగా ఈ పుస్తకాన్ని ప్రచురించారు.

టి.వి.కె. సోమయాజులు హైస్కూళ్ళలోనూ, జూనియర్ కళాశాలలోనూ తెలుగు అధ్యాపకులుగా చేశారు. ఆయన వ్యక్తిత్వం, పాండిత్యం విశిష్టమైనవి. జ్యోతిష్యం, జాతకాలు నమ్మేవారుకాదు. ఇంట్లో పూజల తతంగం లేదు. గుడిలోకి వెళ్ళేవారుకాదు. దైవానికంటే పురుషకారాన్ని ఎక్కువ నమ్మినవాడు. హైస్కూలులో ఉపాధ్యాయునిగా అమావాస్య మంగళవారంనాడు చేరారు. అయితే ఒక సెంటిమెంటు (నమ్మకం) వుండేది. వారి కుటుంబంలో ఎవరూ షష్టిపూర్తులూ, పుట్టినరోజులూ జరుపుకోకూడదని. అలా జరిపినవారు వాటి దుష్ఫలితాలు అనుభవించిన ఉదంతాలు - ఇంకా ఎన్నెన్నో విశేషాలు, సాహిత్య, సామాజిక అంశాలు ఈ పుస్తకంలో గుదిగుచ్చారు.

సోమయాజులు 8 గ్రంథాలు రాశారు. వాటిలో 'ఏరిన ముత్యాలు', 'సత్య సందర్శనం', 'జ్ఞాన తరంగాలు', 'భగవద్గీతాప్రబోధము' ముఖ్యమైనవి. వీరు చెప్పిన ఆరు యధానికలు (యదార్ధంగా జరిగినవి), మూడు కవితాకథానికలు, రెండు వేదాంత కథానికలు, చమత్కార సంభాషణలు, హాస్యరచనలు మొదలైనవి దీనిలో పొందుపరిచారు. తమ్ముడికి రాసిన వందలాది లేఖల్లో - 2008లో రాసిన లేఖలో "నీ పుస్తకాలు హోసూరు లైబ్రరీకి తరలించు. ఏ వస్తువును ఎక్కడకు చేర్చాలో అక్కడకు చేర్చి చేతులు కడుక్కోవడం విజ్ఞత లక్షణం" అని సలహా ఇవ్వగా తమ్ముడు ఆ సలహా పాటించారు.

రెండవ భాగంలో సోమయాజులు రాసిన కవిత్వం, 'జ్ఞానరత్నాలు' - తత్త్వవివేచన, వ్యాసమంజూష ఇచ్చారు. వ్యాసాలలో వారి అమ్మ, నాన్నల గురించి రాసినవే, 'వార్ధక్యంలో ఎలా బ్రతకాలి?' అనే వ్యాసమూ విశిష్టమైనవి. మూడవభాగంలో 'సాహిత్యంలో ఏరిన ముత్యాలు', 'సూక్తి ముక్తావళి', 'వేదాంత కథలు' 'జ్ఞాన తరంగాలు' మొదలగునవి పొందుపరిచారు.

అనుబంధంలో కవి తిలక్ గురించి రెండు వ్యాసాలూ, ఆదిభట్ల నారాయణదాసు - శ్రీశ్రీ గురించి ఒక వ్యాసమూ - ఈ పుస్తకానికి సంబంధించినవి కాకపోయినా ఒకచోట ముద్రితమై వుంటే చరిత్రలో మిగిలి వుంటాయని ఇచ్చారు.

406 పుటలున్న ఈ పుస్తకం చదువుతుంటే తణుకు, చుట్టుప్రక్కల వున్న సాహిత్యకారులతో, సాహితీ బంధువులతో కాలం గడిపినట్లుంది.

1/8 డెమ్మీ 406 పుటలు + 16 పుటలు నలుపు-తెలుపు ఫొటోలు + 40 కలర్ ఫొటోలు. మొదటి ముద్రణ : 1-3-2022. వెల : రూ.400/- ప్రతులకు : విశాలాంధ్ర, నవచేతన, నవోదయ, ఎమెస్కో ప్రజాశక్తి, నవతెలంగాణ, పల్లవి. రచయిత ఫోన్ నెం. 99454 22742.

**వలస : సందుపట్ల భూపతి కవిత్వం**

1995 నుండి 2021 జూన్ వరకు రచయిత రాసిన వచన కవితలు, పాటలు, రెక్కలు మొత్తం 98 రచనలు ఈ సంపుటిలో అందించారు. వీటిలో అత్యధికం వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వీరి మొదటి కవితాసంపుటి 'దర్పణం', రేడియో నాటికలు 'జీవన వలయాలు' శీర్షికతోనూ, కథాసంపుటి 'చేనేత బతుకు'గానూ గతంలో విడుదలయ్యాయి. ఇవిగాక మరెన్నో కథానికలు, ఆకాశవాణిలో నాటికలు, కథలు వీరు రచించారు.

వ్యవసాయ సమస్యలు, చేనేత కార్మికుల కడగండ్లు, స్త్రీల సమస్యలు, ఆర్థిక అసమానతలు, కుల, మత అంతరాలు మొదలైనవి వీరి కవితలకు వస్తువులు. సామ్యవాద సమాజ ఆవిష్కరణ కవి ఆకాంక్ష.

1/8 డెమ్మీలో 168 పుటలు. వెల : రూ.160/- మొదటిముద్రణ : జూన్ 2021. ప్రతులకు : సందుపట్ల భూపతి, 3/103 (74ఎ), గండాలయపేట, మంగళగిరి - 522503. గుంటూరుజిల్లా. సెల్ : 96035 69889.

**జ్ఞానోదయము : నాలుగు అంకముల నాటకం**

రచన : డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావు, యం.బి.బి.యస్.

ప్రముఖ హేతువాది, ప్రజావైద్యుడు, డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావు స్థాపించిన కవిరాజ సాహిత్య విహారము, గుడివాడవారు 1968లో ప్రచురించిన పుస్తకానికి పునర్ముద్రణ ఇది. పొట్లూరి పూర్ణేందుమౌళి ఇప్పుడు ప్రచురించారు.

దీనిలో 'తొలిపూవు' అనే మొదటి భాగంలో డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావు పెద్దకొడుకు కవిరాజు గుంటూరులో వైద్య విద్యార్థిగా మూడోసంవత్సరం చదువుతూ తన 23వ యేట ఆత్మహత్య చేసుకోగా, డా॥ త్రిపురనేనికి ధైర్యం చెబుతూ పలువురు రాసిన లేఖలు వున్నాయి. రెండవభాగం 'మలిపూవు'లో నేటి విద్యావిధానం గురించీ, నవ విద్య ఆవశ్యకత గురించీ డా॥ త్రిపురనేని రాసిన వ్యాసం వుంది. మూడవ భాగం : 'తుదిపూవు'లో ఆయన విద్య, ఉపాధ్యాయుల గురించి రాసిన నాటకం 'జ్ఞానోదయము' వుంది. 1/8 డెమ్మీలో 94 పుటలు. ఇతర వివరాలు లేవు.

**(ఇంకా వున్నాయి)** ✦

కవిత

# యుద్ధం వెనుక....

– చలపాక ప్రకాశ్

యుద్ధాలకు ముగింపు పలికేదీ లేదు
చితులను పేర్చడం ఆపిందీ లేదు
తరిగిపోతున్న కొండలు మంచుబిందువుల్లా కరిగిపోతున్నా-
డబ్ డబ్ డబ్ మని చేసే బూట్ల శబ్దం ఆగిందీ లేదు!

యుద్ధం అసలు ఎందుకొస్తుందో ఎందుకు పోతుందో
పూర్తిగా అర్థం చేసుకున్నదీ లేదు!
నష్టం మొత్తం గుట్టలు గుట్టలుగా పోగేసుకున్నాక
కన్నీరు మున్నీరుగా ఏడవడం తప్ప చేసేదేమీ లేదు!!

యుద్ధం నీకా నాకా అన్నది కాదు
మరణం ఎవరికా అన్నదే ఎక్కుపెట్టబడిన గురి!
మృత్యువు ఎటువైపన్నది కాదు-
యుద్ధం మధ్యలో మృత్యువు ఎప్పుడూ
రెండు వర్గాల మధ్య గీతలో దాగుండే సంకేత గీతం!
రెండువర్గాల జెండాల్లో తలరాతల్ని చెరిపేసే
విషాదనాట్య గాత్రం!!

యుద్ధ నష్టం దేశాల మధ్యనే కాదు-
నడిరోడ్డుపై పడే ఓ కుటుంబ ఛిద్ర రూపం!
ఒంట్లో ఏదో ఒక ప్రధాన అంగాన్ని
కోల్పోయిన విషాద స్వరూపం!!

యుద్ధం-
శవయాత్రలో కార్చే కన్నీటి బొట్లే కాదు
సమాధి స్థలాన్ని సిద్ధం చేసే
ఓ కనిపించని తంత్రయంత్రం!
యుద్ధం ఒకరోజుది కాదు
ఒక సంవత్సర కాలానిదీ కాదు
యుద్ధం -
కోల్పోయిన ఒక జీవిత కాలానిది..
దాని వెనుక కనిపించక కాచుకు కూర్చున్న
అనేక మానవతా నీడలవి!!

కవిత

# పడమటి వర్జీనియాలో 'తుపాకి మనిషి'

– పెయింట్ లోయలోని ఓ గని కార్మికుడు

తెలుగు అనువాదం : రవి

దిగంబర, ఏకాంత, శీతలాలు ఆ కొండలు....
రానున్న నెలల్లో జరిగే పరిణామాల గురించే నా ఉత్సుకత....
సమ్మె జరుగుతోంది.... మన శక్తి జయిస్తుంది.....
ఓ ప్రియ నేస్తమా.... నేనావసంతానికై
ఎంతగా ఎదురు చూస్తున్నానో.....

వారు మనల్ని పడదోశారు.... సాయుధ బలగాలను ఉసిగొల్పారు
కోతబెట్టే శీతాకాలపు చలిలోకి విసిరివేశారు....
ఓరిదేవుడో.... అయినా ఆ వెధవలు మనల్ని పట్టలేరు....
చివరకు..... నరలోకపు జాగిలమ్ములయినా కానీ!....

లేలేత చిగుర్లతో ఎదిగిన కొండల
పచ్చందనాల వీక్షకుడిని మాత్రమేకాదు....
ప్రతీకారేచ్ఛతో రగులుతున్న నన్ను
పత్రహరితం చాటున దాచమంటున్నా....

పక్షుల రెక్కలపై తారాడి తేలిపోయే
మేఘాలను ఈనాడు వీక్షించలేను....
ఓ ప్రియనేస్తమా.... దాచివుంచిన తుపాకీని ప్రయోగించే
ఆ వసంతానికై ఎంతగా ఎదురుచూస్తున్నానో.....

ఆశబోతులైన యజమానులాడించే
కీలుబొమ్మలు.... సమ్మె విచ్ఛిన్నక మూకలవిగో!
ఆకలిమంటల మలమలమాడే మన కసిని వారికి రుచి చూపిద్దాం!
యజమానుల క్రూరహత్యలకు తప్పక మూల్యాన్ని చెల్లింపజేద్దాం!

తూటాల వర్షంతో మనల్ని గాయాల దేహాల్ని చేశారు
జుయ్‌మని దూసుకువచ్చే ఆ తూటాల చప్పుడు
చెవుల్లో మార్మోగుతూనే వుంది....
కానీ.... త్వరలోనే ఈ నీచకృత్యాలకు వారు చింతించక తప్పదు....
ప్రియనేస్తమా.... నేనా వసంతానికై ఎంతగా ఎదురుచూస్తున్నానో....

PRAJA SAAHITI May 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

కవిత

# గుండెల్లో గుచ్చుకునే విలాప గేయం

ఆంగ్లం : మేఖలాశరణ్ 'ది క్వింట్'
తెలుగు : కొత్తపల్లి రవిబాబు






శౌర్యమనేది శబ్దం చేయదు
యుద్ధం కనుక వస్తే
అది గౌరవప్రదమైన శబ్దం కాదు
సైనికుల కరకు బూట్ల
శబ్దాలె నీవు వినగలవు
ఇంకా నీవు వినేది
గుక్కపట్టి ఏడుస్తున్న పసిపిల్లల 'గానం'
రోగాలతో, ఆకలితో వ్రక్కలైపోతున్న వారి శోకం
తమ అమాయకమైన కళ్ళతో వారు నిన్ను చూస్తూ
తమ అమ్మా, నాన్నలెక్కడికి పోయారని అడుగుతుంటే
దేశం కోసం పోరాడుతూ
యుద్ధంలో వారు చనిపోయారని చెప్తావా!
దేశమంటే ఏమిటని వారు అడిగితే
మతిలేని మనుషుల చర్యలతో
మరుభూమిగా మారిన ధరిత్రిని చూపుతావా!
రోగాలు, రొష్టులతో నిండిన రుద్రభూమిని చూపిస్తావా!
ఆశాలేశం లేనితనాన్నీ,
విధ్వంసమైన ఆర్థికవ్యవస్థనీ,
ఇళ్ళులేని అనాథల సంద్రాన్ని వారికి చూపిస్తావా!
దేశమంటే ఏమిటని వారడిగితే
తమ తలిదండ్రులు దేనికోసం ఆహుతయ్యారో
అడిగితే
నిజం ఏమిటో నీకు నీవైనా చెప్పుకోగలవా?
యుద్ధంలో ఎవరు ఓడిపోలేదో చెప్పగలవా!

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI